నవతెలంగాణ 1
సమగ్ర తెలుగు దినపత్రిక
మెదక్
శనివారం | 10 ఫిబ్రవరి 2024 | www.navatelangana.com

పీవీకి భారతరత్న పట్ల హర్షం

నవతెలంగాణ-జిన్నారం



భారత మాజీ ప్రధాని కీర్తిశేషులు పీవీ నరసింహారావు దేశానికి చేసిన సేవలకు గుర్తింపుగా కేంద్రంలోని మోడీ ప్రభుత్వం ఆయనకు భారతరత్న అవార్డును ప్రకటించడం పట్ల జిన్నారం మాజీ ఎంపీటీసీ అంతిరెడ్డిగారి శ్రీనివాస్ రెడ్డి, మండల బీజేపీ నాయకులు కొత్తకాపు జగన్‌రెడ్డి బృందాలు శుక్రవారం వేర్వేరు ప్రకటనల్లో హర్షం వ్యక్తం చేశారు. మండల కేంద్రంలో పీవీ నరసింహారావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. భారతరత్న అవార్డు ప్రకటించడం పట్ల మోడీకి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు కొత్త కాపు జగన్ రెడ్డి అశోక్, సాయి, మహేష్, పద్మారావు, పెంటేష్, సంతోష్, జిన్నారం అశోక్ తదిరులు పాల్గొన్నారు.

సీఐ సుధీర్ కుమార్‌కు సన్మానం

నవతెలంగాణ-జిన్నారం

జిన్నారం మండలం నూతన సర్కిల్ ఇన్‌స్పెక్టర్(సీఐ)గా బాధ్యతలు స్వీకరించిన సుధీర్ కుమార్‌ను పలువురు యువకులు శుక్రవారం ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ నేతలు కోరబోయిన నరేష్, జిన్నారం మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు యనగండ్ల నరేందర్ గౌడ్, యాదగిరి, మల్లేష్ యాదవ్, రొయ్యపల్లి రవి బృందం పాల్గొన్నారు.





40 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

నవతెలంగాణ-సిద్దిపేటఅర్బన్

అక్రమంగా తరలిస్తున్న 40 క్వింటాళ్ల ప్రభుత్వ రేషన్ బియ్యాన్ని పట్టుకుని టూటౌన్ పోలీసులకు అప్పగించినట్లు సిద్దిపేట టాస్క్‌ఫోర్స్ పోలీసులు తెలిపారు. వారు తెలిపిన వివరాల ప్రకారం.. కొమురవెళ్లి మండలం మర్రిముచ్చాల గ్రామానికి చెందిన ఆకుల మహిపాల్ టాటాఏసీ వాహనం ద్వారా పలు గ్రామాల్లో తక్కువ ధరకు 40 క్వింటాళ్ల ప్రభుత్వ రేషన్ బియ్యాన్ని కొనుగోలు చేసి.. ఎక్కువ ధరకు రైస్ మిల్‌కు తరలిస్తున్నాడన్న నమ్మదగిన సమాచారం రావడంతో.. శుక్రవారం మధ్యాహ్నం సిద్దిపేట టూ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో సిద్దిపేట టాస్క్‌ఫోర్స్ పోలీసులు రైడ్ చేశారు. ఆ వాహనంలో ఉన్న పట్టుకొని 40 క్వింటాళ్ల పిడిఎస్ రైస్‌ను పట్టుకొని వాహనంతో సహా సిద్దిపేట టూ టౌన్ పోలీసులకు అప్పగించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలో ఎక్కడైనా ప్రభుత్వ అనుమతి లేకుండా ఇసుక, పిడిఎస్ రైస్ అక్రమ రవాణా చేసిన నిల్వ ఉంచిన, చట్ట ప్రకారం కేసులు నమోదు చేసి చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. చట్ట వ్యతిరేకమైన కార్యక్రమాలు ఎవరైనా నిర్వహిస్తున్నట్లు తెలిస్తే సిద్దిపేట పోలీస్ కమిషనరేట్ పోలీస్ కంట్రోల్ రూమ్ నెంబర్ 8712667100, టాస్క్‌ఫోర్స్ అధికారుల నెంబర్లు 8712667447, 8712667446, డయల్ 100 లకు సమాచారం అందించాలని సూచించారు.



హజ్రత్ ఫతేఖాన్ దర్గాలో బీరయ్య యాదవ్ ప్రార్థనలు

నవతెలంగాణ-సంగారెడ్డి

హజ్రత్ ఫతేఖాన్ దర్గాలో బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు బీరయ్య యాదవ్ స్థానిక ముస్లిం మత పెద్దలతో కలిసి శుక్రవారం దర్గాకు దట్టి ఎక్కించి.. పూలమాలలు సమర్పించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ప్రార్థనల అనంతరం మత పెద్దలు బీరయ్య యాదవ్‌ను పూల మాలతో సత్కరించారు. ఈ సందర్భంగా మెదక్ లోక్‌సభ టికెట్‌ను ఆశిస్తున్న బీరయ్య యాదవ్ మాట్లాడుతూ.. రాజ్యాంగం ప్రకారం అందరికీ సమాన హక్కులు ఉన్నాయని.. కుల,మత, ప్రాంత విభేదాలు లేకుండా అందరూ అన్నదమ్ములుల్లా జీవించాలన్నారు. అన్ని మతాల విశ్వాసాలను ప్రతి ఒక్కరు గౌరవించాలన్నారు. కేసీఆర్ అన్ని విషయాలు ఆలోచించి ఒక బీసీ నేతగా, తెలంగాణ ఉద్యమకారుడిగా పార్టీకి తన సేవలను గుర్తించి.. పార్లమెంట్ టిక్కెట్ ఇవ్వాలని కోరారు. ఉమ్మడి మెదక్ జిల్లా ప్రజలు ముఖ్యంగా మెదక్ పార్లమెంటు నియోజకవర్గంలోని ప్రజలు తనకు అండగా నిలవాలని విజ్ఞప్తి చేశారు. తనను ఎంపీగా ఎన్నుకుంటే అందరికి అందుబాటులో ఉంటానన్నారు. ఈ కార్యక్రమంలో మైనార్టీ నాయకులు అబూబాకర్,ఉస్మాన్ అలీ, బీసీ సంఘం రాష్ట్ర జనరల్ సెక్రటరీ కృష్ణ మూర్తి కేసీఆర్ యువసేన అధ్యక్షులు అంజాద్, టిఆర్ఎస్వి నాయకుడు అఖిల్ ముస్లిం మత పెద్దలు పాల్గొన్నారు.



అసెంబ్లీ ఎన్నికల్లో పనిచేసిన వాహనాల డబ్బులను చెల్లించండి

నవతెలంగాణ-పటాన్‌చెరు

అసెంబ్లీ ఎన్నికల్లో పనిచేసిన వాహనాల డబ్బులను చెల్లించండని వాహనాల యజమానులు అధికారులను డిమాండ్ చేశారు. శుక్రవారం పటాన్‌చెరు తహశీల్దార్ కార్యాలయం ఎదుట ప్రైవేట్ వాహనాల డ్రైవర్లు ధర్నా చేపట్టి నిరసనకు దిగారు. శాసనసభ ఎన్నికల సమయంలో వినియోగించుకున్న వాహనాల బిల్లులు వెంటనే చెల్లించాలని వారు డిమాండ్ చేశారు. కార్యాలయంలోకి ప్రజలు, సిబ్బంది వెళ్లకుండా అడ్డగించారు. తహశీల్దార్ కార్యాలయంలో పనిచేసే సిబ్బంది ఒకరు అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఎలక్షన్ పనుల నిమిత్తం వాహనాలను అద్దెకు మాట్లాడారని చెప్పారు. వాహనాల కిరాయిని ఎలక్షన్స్ అయిపోయిన మరుసటి రోజు చెల్లిస్తామని హామీ ఇచ్చారని వారు గుర్తు చేశారు. ఇప్పటివరకు కిరాయి డబ్బులు మాకు చెల్లించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. దాదాపు 80 వాహనాలకు సుమారు 40 లక్షల రూపాయలు కిరాయి డబ్బులు చెల్లించాల్సి ఉందని, వీటిలో కొంత మీరే మాత్రమే డబ్బులు చెల్లించారని అన్నారు. ఇంకా చాలా డబ్బులు మాకు చెల్లించాల్సి ఉందని అన్నారు. మాలాంటి పేద వాళ్లకు డబ్బులు రాకపోతే ఎంత ఇబ్బందిగా ఉంటుందో అని వాపోయారు. తమకు డబ్బులు చెల్లించి న్యాయం చేయాలని వారు డిమాండ్ చేస్తున్నారు. ప్రభుత్వం నుండి నిధులు మంజూరు కాగానే త్వరలోనే డబ్బులు చెల్లింపులు చేస్తామని పటాన్ చెరు తహశీల్దార్ భాస్కర్ హామీ ఇచ్చారని వారు తెలిపారు.

రాష్ట్రస్థాయి వధూవరుల పరిచయ వేదికను సద్వినియోగం చేసుకోవాలి

నవతెలంగాణ-కల్చర్



పద్మశాలి ఉద్యోగుల సంఘం ఉమ్మడి వరంగల్ జిల్లా ఆధ్వర్యంలో రేపు(ఆదివారం) జరగనున్న తెలంగాణ రాష్ట్ర స్థాయి ఎనిమిదో వార్షిక పద్మశాలి వధూవరుల పరిచయ వేదికను పద్మశాలీ కుల బాంధవులు సద్వినియోగం చేసుకోవాలని ఉమ్మడి మెదక్ జిల్లా పద్మశాలి ఉద్యోగుల సంఘం అధ్యక్షులు జట్ల భాస్కర్ విజ్ఞప్తి చేశారు. ఇప్పటివరకు చేపట్టిన ఈ పరిచయ వేదికల ద్వారా నేటి వరకు సుమారు 500లకు పైగా పెండ్లి సంబంధాలు కుదుర్చటం జరిగిందన్నారు. కాబట్టి రాష్ట్రవ్యాప్తంగా ఉన్న పద్మశాలి బంధువులు ఈ అవకాశాన్ని సద్వినియోగపరుచుకోవాలని ఆయన కోరారు. ఈ వివాహ పరిచయ వేడుకకు వచ్చే అబ్బాయిలు, అమ్మాయిలు అమ్మాయిలు.. వారి వారి ఫోటోల (పోస్ట్ కార్డ్ సైజ్)తో పాటు బయోడేటా, రూ.1116 ఫీజును ముందస్తుగా చెల్లించి రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. వరంగల్‌లోని పోచమ్మ మైదాన్ దగ్గర గల కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ ఫంక్షన్ హాల్‌లో ఈ వేడుక జరుగుతుందన్నారు. మరింత సమాచారం కోసం 9704360703ను సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అరిగే శ్రీనివాస్ ప్రధాన కార్యదర్శి,న్యాలమ్ శివకుమార్ కోశాధికారి, పద్మశాలి ఉద్యోగుల సంఘం ఉమ్మడి మెదక్ జిల్లా సభ్యులు తదితరులు పాల్గొన్నారు,

అక్రమంగా ఇసుకను తరలిస్తున్న రెండు లారీలు పట్టివేత



నవతెలంగాణ-న్యాల్‌కల్

అక్రమంగా ఇసుకను తరలిస్తున్న రెండు లారీలను మెటల్‌కుంట కూడలి వద్ద హద్నూర్ ఎస్సై రామునాయుడు పట్టుకున్నారు. ఆ రెండు లారీలపై సుమోటోగా కేసు నమోదు చేసి.. రూ.30,000 జరిమానా విధించినట్టు ఎస్ఐ తెలిపారు. అక్రమ ఇసుక రవాణాకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ముందే ఎండలు..



ఎండలు ముందే కాస్తున్నాయి. వేసవి తాపం అప్పడే మొదలైంది. ఫిబ్రవరి నెలాఖరు వరకు చల్లి ప్రభావం ఉంటుంది. కానీ..! ప్రస్తుతం చలి కంటే ఎండల వేడిమే అధికంగా కనిపిస్తుంది. ఈ ఏడాది ఎండల తీవ్రత అధికంగా ఉంటుందని వాతావరణ శాఖ వెల్లడించిన నేపథ్యంలో రాబోయే కాలంలో ఎండలు మండే అవకాశ ముంది. ఎండల తీవ్రత పెరిగితే యాసంగీ పంటలకు సాగునీటి ఎద్దడి, కరెంట్ కష్టాలు తలెత్తే ప్రమాదంలేక పోలేదని అన్నధాతలు ఆందోళన చెందుతున్నారు. ఉక్కపోత తీవ్రత పెరగడం వల్ల ప్రజలు సైతం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొక తప్పదంటున్నారు.

- పెరుగుతున్న పగటి ఉష్ణోగ్రతలు
- ఫిబ్రవరి రెండో వారంలోనే వేడిమి
- యాసంగి పంటలకు తప్పని...
- నీటి ఎద్దడి కరెంట్ కోత సమస్యలు

నవతెలంగాణ-మెదక్ ప్రాంతీయ ప్రతినిధి

గతేదాది కంటే ఈ సారి ఎండల తీవ్రత అధికంగా ఉంటుందని, ముందే ఎండలు రానున్నాయని వాతావరణ శాఖ అధికారులు వెల్లడించినట్లే ప్రస్తుతం వాతావరణం కనిపిస్తుంది. రాష్ట్రం మాదిరే ఉమ్మడి మెదక్ జిల్లా వ్యాప్తంగా కూడా ఎండల తీవ్రత కనిపిస్తుంది. ఎండల తీవ్రత పెరగనున్నందున ప్రజలు, రైతులు ముందస్తుగా తగిన జాగ్రతలు తీసుకోవాల్సి ఉంటుంది. ఎల్‌నిలో ప్రభావంతో ఈ ఏడాది చలికాలం కూడా చాలా వేడిగా గడిస్తోంది. చలి కాలం ముగియకముందే ఎండా కాలం ప్రవేశించిందని చెప్పక తప్పదు. గతేదాదితో పోలిస్తే ఈ సారి చలి కాలంలో చలి తీవ్రత కాస్త తక్కువనే చెప్పాలి. అయితే చలి కాలంలో చలి ప్రభావం లేకపోవడమే కాకుండా చలికి బదులు ఎండల తీవ్రత పెరగడం గమనార్హం. సంగారెడ్డి, సిద్దిపేట, మెదక్ మూడు జిల్లాల్లోనూ అన్ని ప్రాంతాల్లోనూ ప్రస్తుతం పగటి పూట ఉష్ణోగ్రతలు వేడిగా ఉంటున్నాయి. శుక్రవారం పగటి ఉష్ణోగ్రతలు 28 డిగ్రీల వకు ఉంది. ఇలా రోజూ కొంత పెరుగుతూ వస్తున్నందున మార్చి మొదటి వారంలో 32 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు ఉండొచ్చంటున్నారు.

యాసంగీ పంటలపై ప్రభావం..

మార్చి రెండో వారంలో మొదలవ్వాల్సిన ఎండల ప్రభావం నెల రోజుల ముందే ప్రారంభమైంది. దీంతో ఈ ఏడాది యాసంగీ పంటలకు ప్రతికూల పరిస్థితులు ఏర్పడే అవకాశం ఉందుంటున్నారు. ప్రస్తుతం సంగారెడ్డి, మెదక్, సిద్దిపేట మూడు జిల్లాల్లోనూ వరి నాట్ల పనులు పూర్తయ్యాయి. ముందస్తుగా నాట్లు వేసిన పైర్లు పచ్చబడి కలుపుతీత పనులు కొనసాగుతున్నాయి. రెండో సారి యూరియా వేశాక పైర్లు ఏపుగా పెరుగుతుంటాయి. ఆ దశలో వరి పైర్లకు నీటి వినియోగం కూడా పెరుగు తుంది. పైర్లు ఎదుగుదలకు నీటి వినియోగం పెరగడమే కాకుండా ఎండలు తీవ్రంగా కాయడం వల్ల నీటి అవిరి అధికమవుతుంది. భూమిలో తేమ శాతం తగ్గడం వల్ల కూడా పైర్లకు నీటిని అధికంగా పెట్టాల్సి వస్తుంది. 5 లక్షల ఎకరాల్లో వరి సాగుతుంది. మార్చి, ఏప్రిల్ పైర్లకు నీటి వినియోగం అధికంగా ఉంటుంది. మరో పక్క బోరు, బావుల్లో కూడా ఎండల తీవ్రత వల్ల నీటి మట్టం అడుగంటిపోయే ప్రమాదముంది. రిజర్వాయర్లు, చెరువుల్లో నీటి మట్టం కూడా తగ్గుతుందంటున్నారు. మూడు జిల్లాల్లో 3.50 లక్షల వరకు బోరు బావులున్నాయి. సింగూరు, రంగనాయకసాగర్, మల్లన్నసాగర్ వంటి జలాశయాల్లోనూ ప్రస్తుతం నీటి లభ్యత ఉన్నప్పటికీ వేసవిలో ఎద్దడి ఏర్పడే అవకాశం ఉందంటున్నారు. మరో పక్క మామిడి, సపోట, బొప్పాయి. నిమ్మ తోటలకు వర్షాకాలంలో నీటిని కట్టాల్సిన అవసర ముండదు. ఎండలు కాస్తున్నందున నీటి కడతారు. దీంతో తోటలకున్న మోటర్లు నడుస్తాయి. మరో పక్క ఉల్లి, ఆలు గడ్డ, మొక్కజొన్న ఇతర ఆరుతడి పంటలు కూడా సాగయ్యాయి. ఇప్పటికే కరెంట్ కోతల వల్ల ఆరుతడి నీళ్ల కట్టడం కష్టంగా మారిందని రైతులు ఆందోళన కూడా చేశారు.

కరెంట్‌కూ కష్టాలు తప్పవు..

వ్యవసాయానికి 24 గంటల పాటు ఉచిత కరెంట్ ఇవ్వడం వల్ల రైతులు ఆటోమెటిక్ పద్దతిలో మోటర్లను నడపడానికి అలవాటు పడ్డారు. వేసవి ప్రభావంతో విద్యుత్ ఉత్పతిలో లోటు ఏర్పడతుంది. సరఫరాలోనూ తరుగుదల ఉంటది. ప్రస్తుతం వ్యవసాయానికి రోజుకు 3 గంటల వరకు అధికారికంగానే కోత పెడుతున్నారు. ఎండలు ఇలానే ముదిరితే కోతలు మరింత పెరిగే అవకాశముందని విద్యుత్ అధికారులు చెబుతున్నారు. నీటి వినియోగం పెరగడం వల్ల మోటర్లు అధిక సమయం నడపాల్సివస్తది. దీంతో విద్యుత్ వినియోగం కూడా పెరుగుద్ది. దీంతో వినియోగానికి సరఫరాకు తేడా ఏర్పడడంతో ట్రిప్ అవ్వడం, ట్రాన్స్‌ఫార్మర్లు, మోటర్లుఖాళీపోవడంసమస్యలు ఉత్పన్నమవుతాయంటున్నారు.

ముందస్తు జాగ్రతలు తప్పవు

ఎండలు బాగా కొడితే తట్టుకునేందుకు అన్ని రకాల ముందస్తు జాగ్రతలు తీసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. పంటల సాగు విషయంలో రిజర్వాయర్లు, చెరువుల్లోంచి నీటిని విడుదల చేసే విషయంలో జాగ్రతలు తీసు కోవాలి. నీటి వినియోగంలోనూ రైతులు జాగ్రతలు తీసు కొని నీటి వృథాను తగ్గించుకోవాలని ఇరిగేషన్ అధికా రులు సూచిస్తున్నారు. కరెంట్ వాడకంలోనూ అనవసరంగా మోటర్లను నడపకుండా అవసరం మేరకే పైర్లకు నీటిని కట్టేందుకే మోటర్లు నడపాలని విద్యుత్ అధికారులు చెబుతున్నారు. ఎండల నుంచి ఉపసమనం పొందేందుకు ప్రజలు సైతం జాగ్రతలు తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. పిల్లలు, వృద్ధులు, శ్రమజీవులు జాగ్రతలు పాటించాల్సి ఉంటది.

మహాలక్ష్మి వివరాలను సరిచేయాలి

నవతెలంగాణ-సంగారెడ్డి

మహాలక్ష్మి పథకంలో గ్యాస్ కనెక్షన్ల వివరాలను ఈరోజు(ఈనెల 10వ తేదీలోగా)లోపు మొత్తం పూర్తిచేయాలని జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి సంబంధిత అధికారులకు సూచించారు. శుక్రవారం టెలి కాన్ఫరెన్స్ ద్వారా సంబంధిత అధికారులతో మహాలక్ష్మి గ్యాస్ కనెక్షన్ల డేటా సరిచేయడం, గృహజ్యోతి, తదితర అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. మహాలక్ష్మి పథకంలో గ్యాస్ కనెక్షన్ల వివరాలను సరిచెయాలని, అధిక అప్లికేషన్లు ఉన్నచోట ఎక్కువ లాగిన్స్ తీసుకోవాలన్నారు. ప్రతీ లాగిన్‌లో ప్రతిరోజు 40 నుండి 60 దరఖాస్తులు సరిచేయాలని సూచించారు. డాటా సరి చేయడం మరింత వేగవంతం చేయాలని, ఎంపీడీవోలు క్షేత్ర పరిధిలో తనిఖీ చేయాలన్నారు. గృహ జ్యోతి పథకం కోసం ప్రజాపాలన కార్యక్రమంలో అందజేసిన సమాచార ధృవీకరణ కార్యక్రమం విద్యుత్ శాఖ సిబ్బంది ద్వారా జరుగు తున్నదన్నారు. సంబంధిత సిబ్బంది వచ్చినప్పుడు దరఖాస్తు దారులు ప్రజాపాలన దరఖాస్తు రసీదు, ఆహార భద్రతా కార్డు (రేషన్ కార్డు) నెంబర్ మరియు ఆధార్ కార్డు నెంబర్, విద్యుత్తు బిల్లు అందుబాటులో వుండేలా చూసుకోవాలని సూచించారు. ప్రధానమంత్రి విశ్వకర్మ పథకాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకునేలా విస్తృత ప్రచారం చేయాల న్నారు. అర్హులను ఆన్లైన్ ద్వారా దరఖాస్తు చేసుకునేలా ప్రోత్సహించాలని సూచించారు. ప్రత్యేక పారిశుధ్య వారోత్స వాల్లో భాగంగా అన్ని గ్రామ పంచాయతీల్లో తాగునీటి సమస్యలు లేకుండా చూసుకోవాలని, ఏవేని పైప్‌లైన్ లీకేజీలు, వాటర్ ట్యాంకుల మరమ్మత్తులు తదితరాలను గుర్తించి వెనువెంటనే పరిష్కరించేలా చర్యలు చేపట్టాలన్నారు. అందరి భాగ స్వామ్యంతో పారిశుద్ధ్య నిర్వహణ, గ్రామాలలో నెలకొన్న ఆ యా సమస్యలను పరిష్కరించాలని సూచించారు. ఈకాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, డీపీఓ సురేష్ మోహన్, మున్సిపల్ కమిషనర్లు, డీఎల్‌పీఓలు, ఎంపీడీవోలు పాల్గొన్నారు.

పీఏసీఎస్ సిబ్బందికి వేతనాలు చెల్లించాలి

నవతెలంగాణ-సంగారెడ్డి



సంగారెడ్డి జిల్లా వ్యాప్తంగా పీఏసీఎస్‌లో పని చేస్తున్న కార్యదర్శులు, ఇతర సిబ్బందికి ప్రతినెల జీతాలు ఇచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని రైతుసంఘం జిల్లా ఉపాధ్యక్షులు గొల్లపల్లి జయరాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక సుందరయ్య భవనంలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. సంగారెడ్డి జిల్లా వ్యాప్తంగా 200 పైగా పీఏసీఎస్‌ల్లో పని చేస్తున్న కార్యదర్శులు, ఇతర సిబ్బంది ప్రతినెలా జీతాలు అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. కలెక్షన్ల పేర్లతో గత మూడు నెలలుగా జీతాలు ఇవ్వడం లేదన్నారు. డీసీసీబీ బ్యాంకుల్లో పనిచేస్తున్న సిబ్బందికి ప్రతినెల జీతాలు ఇస్తూ.. పీఏసీఎస్‌లో పనిచేస్తున్న సిబ్బందికి మాత్రం జీతాలు ఇవ్వకుండా ఇబ్బందులు గురి చేయడం సరికాదన్నారు. జిల్లా కలెక్టర్, డీసీఓ సొసైటీలో పనిచేస్తున్న సిబ్బందికి కార్యదర్శులకు ప్రతినెల జీతాలు ఇచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు అశోక్, రమేశ్ గౌడ్ ,తదితరులు పాల్గొన్నారు.

ఆశా వర్కర్స్‌కు 2 నెలల బకాయి వేతనాలు చెల్లించాలి

సీఐటీయూ జిల్లా కార్యదర్శి జి.సాయిలు

నవతెలంగాణ-సంగారెడ్డి



ఆశా వర్కర్స్‌కు పెండింగ్‌లో ఉన్న రెండు నెలల బకాయి వేతనాలను వెంటనే చెల్లించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి జి.సాయిలు డిమాండ్ చేశారు. ఈ మేరకు రాష్ట్ర కమిటీ పిలుపుతో కలెక్టర్ కార్యాలయం ఎదుట శుక్రవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా జి. సాయిలు మాటాడుతూ.. ఆశా వర్కర్లు గత 18 ఏండ్ల నుంచి పనిచేస్తున్నా.. నేటికీ వారికి కనీస వేతనం, ఉద్యోగ భద్రత, ఈఎస్ఐపీఎఫ్ అమలు చేయట్లేన్నారు. కరోనా కష్టకాలంలో పని చేసినా రిస్క్ అలవెన్సులు అందలేవన్నారు. నెలకు రూ.9750 లు తక్కువ వేతనంతో పనిచేస్తున్న ఆశా వర్కర్లకు సకాలంలో పారితోషకాలు అందకుంటే ఎలా బ్రతుకుతారని ప్రశ్నించారు. రెండు నెలల నుంచి వేతనాలు రాక అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వెంటనే బకాయి వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. సమ్మె సందర్భంగా గత ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని, ఈఎస్ఐ పీఎఫ్, ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా ఫిక్స్‌డ్ వేతనం రూ.18 వేలు నిర్ణయించాలని.. ఆరు నెలల పీఆర్సి ఏరియల్ వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఐదు లక్షలు ఇవ్వాలని టీవీ స్యూటీ డబ్బులను ఆశలతో మోపించే పనిని రద్దు చేయాలని, 32 రకాల రిజిస్టర్ లను ప్రభుత్వమే ప్రింట్ చేసి ఇవ్వాలన్నారు. ప్రసూతి సెలవుల పైన ఉత్త ర్వులు వెంటనే విడుదల చేయాలని పని భారం తగ్గించా లన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి యాదగిరి ఆశ యూనియన్ జిల్లా నాయకులు యశోద, వీరమని, ప్రశాంతి, గంగా, వైష్ణవి, తుల్జమ్మ సంగీత, సావిత్రి, హైమావతి, శశికళ, ఆశ వర్కర్లు పెద్ద ఎత్తున పాల్గొ న్నారు. ధర్నా అనంతరం డీఆర్‌ఓకు వినతి పత్రం అందజేశారు.

నేటి నుంచే సెపక్టాబాల్ జాతీయ స్థాయి పోటీలు



నవతెలంగాణ-అమీన్‌పూర్

4వ సెప్టోబాల్ ఫెడరేషన్ కప్-2024 జాతీయ స్థాయి పోటీలను నేడు, రేపు(ఈనెల10, 11వ తేదీల్లో) అమీన్పూర్‌లోని సూర్య ది గ్లోబల్ స్కూల్‌లో నిర్వహిస్తున్నట్టు పాఠశాల సీనియర్ ప్రిన్సిపాల్, ట్రస్టీ లక్ష్మి ధరిత్రి తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. టోర్నమెంట్ వివరాలను వెల్లడించారు. విద్యార్థులకు చదువులతోపాటు క్రీడలతో శారీరక, మానసిక ఉల్లాసం చేకూరుతాయన్నారు. అనంతరం ఇండియా సెప్టోబల్ సెక్రటరీ జనరల్ మహమ్మద్ అఖిబ్ మాట్లాడుతూ... రెండ్రోజులపాటు జరిగే సెప్టోబాల్ ఫెడరేషన్ కప్ 2024 దేశంలోని 14 రాష్ట్రాల నుంచి పది పురుషుల జట్లు మరియు ఎనిమిది మహిళల జట్లు పోటీ పడుతున్నట్లు తెలిపారు. కాగా 300 మంది క్రీడాకారులకు పాఠశాలలో భోజన వసతి సౌకర్యాలను ఏర్పాటు చేసినట్టు తెలంగాణ సెప్టోబాల్ అధ్యక్ష కార్యదర్శులు జక్కుల దామోదర్ రావు, ఓదేలు యాదవ్ తెలిపారు. ఈ విలేకరుల సమావేశంలో తెలంగాణ సెప్టోబాల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు మాదాడివిరాట్ అధిక జయపాల్ రెడ్డి, ఎడపల్లి అనిల్, చంద్రశేఖర్ మరియు తెలంగాణ రిఫరీ బోర్డు చైర్మన్ సత్యనారాయణలు పాల్గొన్నారు. ఆదివారం జరిగే ముగింపు కార్యక్రమంలో విజేతలకు బహుమతులు అందజేయనున్నట్లు వారు తెలిపారు.

కనులు మిరిమిట్లు గొలిపిన 'ఆటో షో'

- సాంకేతిక-సాంస్కృతికోత్సవాలతో సందడిగా మారిన గీతం

నవతెలంగాణ-పటాన్‌చెరు



గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం హైదరాబాద్ ప్రాంగణంలో నిర్వహిస్తున్న ప్రమాణ-2024 కార్యక్రమం శుక్రవారం కనులు మిరిమిట్లు గొలిపిన ఆటో షోతో శ్రీకారం చుట్టుకున్నది. ఆటోమొబెల్ పరిశ్రమలో తాజా పురోగతులను తెలుసుకోవాలనే ఆసక్తి ఉన్న విభిన్న నేపథ్యాల విద్యార్థులను ఆకర్షించింది. ఆడీఆర్ 8, బీఎండబ్ల్యూ, స్కోడా వంటి అత్యాధునిక, ఖరీదైన కార్లు, సీబీజెడ్, కవాసాకి వంటి బైకులు ప్రాంగణంలో సందడి చేశాయి. ప్రమాణ ఉత్సవాల్లో భాగంగా రోజంతా వివిధ కార్యక్రమాలు, పోటీ లు నిర్వహించారు. ఎంటర్‌ప్రెన్యూర్ వర్క్ షాప్, నృత్య శిక్షణ కార్యశాల, ఆర్కిటెక్చర్ మోడళ్ల ప్రదర్శన, రా అండ్ రియల్ పేరిట డ్యాన్స్ పోటీలు, రోబో సాకర్, ఫోటోగ్రఫీ పోటీలలో పలువురు విద్యార్థులు పాల్గొన్నారు. ఇవన్నీ ఆయా విద్యా ర్థుల నైపుణ్యాలు, సృజనాత్మకత, ఆవిష్కరణలను ప్రదర్శి ంచడానికి వేదికగా తోడ్ప డ్డాయి. దీనికితోడు వాయిద్య హెూరు-కుర్రకారు హుషారు ప్రాంగణాన్ని సందడిగా మార్చింది. బృంద నృత్యాలు, పాటలు, కీబోర్డు, వివిధ రకాల వాద్య పరికరాలతో సాంస్కృతి కార్యక్రమాలు హెూరెత్తాయి. విద్యార్థులు తమలో నిబిడీకృతంగా ఉన్న నైపుణ్యాలు, ప్రతి భను ప్రదర్శించారు. తోటి విద్యార్థుల కరతాళ ధ్వనులు, ప్రోత్సాహక నినాదాలతో ఈ కార్యక్రమాలు ఆద్యాంతం అలరించాయి. కళాకారుల ప్రదర్శనలో భాగంగా, రామ్ మిరియాల, సాహితీ చాగంటి తమ తాజా సినీ పాటలతో ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేశారు. జంట నగరాల చుట్టు ప క్కలున్న పలు కళాశాలల నుంచి వేలాదిగా తరలివచ్చిన విద్యార్థులు రెండో రోజు ప్రమాణ కార్యక్రమాల్లో ఉత్సా హంగా పాల్గొన్నారు. పలు అంశాలలో పోటీపడి తమ సామర్థ్యాన్ని పరీక్షించుకున్నారు. ఈ ప్రమాణ మూడ్రోజుల ఉత్సవాలు శనివారం సాయంత్రం భారత్‌లోనే పేరొందిన ప్రముఖ డీజే ప్రాజెక్ట్ 91, స్కాట్లాండ్ నుంచి వస్తున్న ప్రపంచ ప్రసిద్ధ నినా సుర్దా నిర్వహించనున్న సంగీ త హెూరు (ఎలక్ట్రానిక్ డాన్స్ మ్యూజిక్‌నెట్/డీజే)తో ముగియనున్నాయి.



సదాశివపేట మున్సిపల్ చైర్‌పర్సన్‌పై నెగ్గిన అవిశ్వాసం



నవతెలంగాణ-సదాశివపేట

సంగారెడ్డి జిల్లా సదాశివపేట మున్సిపల్ చైర్‌పర్సన్ పిల్లోడి జయమ్మపై అవిశ్వాస తీర్మానం నెగ్గింది. సదాశివ పేట మున్సిపల్ చైర్మెన్‌పై అవిశ్వాస తీర్మానం ప్రక్రియను కలెక్టర్ ఆదేశాలతో ఆర్డిఓ రవీందర్‌రెడ్డి సమక్ష ంలో శుక్రవారం ఉదయం 11 గంటలకు నిర్వ హించారు. మొత్తం 26 మంది కౌన్సిలర్లు ఉండగా, సమావేశానికి 22 మంది కౌన్సిలర్ హాజరై ఓటింగ్ ప్రక్రియలో భాగంగా అవిశ్వాసానికి మద్దతు పలికారు. మున్సిపల్ చైర్‌పర్సన్ జయమ్మ, కౌన్సిలర్లు పిల్లోడి విశ్వనాథం, పులిమామిడి రాజు, పరంజ్యోతి సమావేశానికి హాజరు కాలేదు. ఆర్డీవో డివిజన్ ఇంచార్జ్ రవీందర్‌రెడ్డి మాట్లాడుతూ.. మున్సిపాల్టీలో మొత్తం 26 మంది కౌన్సిలర్లు ఉండగా.. అందులో అవిశ్వాసానికి 2/3 వంతు మాత్రమే అవసరమన్నారు. అయితే ఈ అవిశ్వాస ప్రక్రియలో 22 మంది కౌన్సిలర్లు ఎటువంటి చర్చ లేకుండా అందరూ అవిశ్వాసానికి మద్దతుగా చేతులు ఎత్తినట్టు చెప్పారు. హాజరైన సభ్యులు మొత్తం అవిశ్వాసానికి మద్దతుగా ఓటు వేశారని.. దాంతో ప్రస్తుత మున్సిపల్ చైర్‌పర్సన్ పిల్లోడి జయమ్మపై ప్రతిపా దించిన అవిశ్వాస తీర్మానం నెగ్గిందన్నారు. ఇదే విషయాన్ని జిల్లా కలెక్టర్‌కు, పై అధికారులకు తెలియజేసినట్టు ఆర్డీఓ వివరించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో రవీందర్ రెడ్డి, తహసీల్దార్ సరస్వతి, మున్సిపల్ కమిషనర్ జి.శ్రీనివాస్ రెడ్డి, ఆర్ఐ గణేష్ తదితర అధికారులు పాల్గొన్నారు.

విద్యార్థిని చితకబాదిన టీచర్, ప్రిన్సిపాల్

- ఆల్‌ఫోర్స్ పబ్లిక్ స్కూల్ ఎదుట విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన
- ప్రిన్సిపల్ ను సస్పెండ్ చేయాలని డిమాండ్
- ఇంత జరిగినా స్పందించని విద్యాధికారులు



నవతెలంగాణ-హుస్నాబాద్‌రూరల్



హుస్నాబాద్ పట్టణంలోని ఆల్‌ఫోర్స్ పబ్లిక్ స్కూల్‌లో 5వ తరగతి చదువుతున్న ఓ విద్యార్థుని పాఠశాల ఇంగ్లీష్ టీచర్‌తోపాటు ప్రిన్సిపాల్‌లు విచక్షణారహితంగా కొట్టారు. ఈ విషయం తెలిసి బాధిత విద్యార్థి కుటుంబ సభ్యులు పాఠశాల ఎదుట శుక్రవారం ధర్నాకు దిగారు. చితకబాదిన ఉపాధ్యాయులపై చర్యలు తీసుకోవాలని, పాఠశాల యాజమాన్య నిర్లక్ష్యంపై అధికారులు ప్రత్యేక విచారణ జరపాలని డిమాండ్ చేశారు. పూర్తి వివరాల్లోకి వెళ్తే.. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని ఆల్‌ఫోర్స్ పబ్లిక్ స్కూల్లో విద్యార్థి విశాల్ ఐదో తరగతి చదువుతున్నాడు. అయితే అతడు ఇంగ్లీషులో సమాధానం చెప్పలేదనే కారణంతో ఇంగ్లీష్ టీచర్‌తో పాటు ప్రిన్సిపల్ కర్రలతో విపరీతంగా ఆ బాలుడిని కొట్టారు. ఈ విషయం విద్యార్థి ఇంటికి వెళ్లి తల్లికి చెప్పాడు. ఆమె విద్యార్థుడి షర్ట్ విప్పి గమనించగా గాయాలున్నాయి. దాంతో అతడిని వైద్యులకు చూపించి.. శుక్రవారం ఉదయం పాఠశాల ఎదుట ఆందోళనకు దిగారు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న ప్రిన్సిపాల్‌తోపాటు టీచర్ పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పాఠశాలలో ఏం జరుగుతుందో తెలియని పరిస్థితి నెలకొందన్నారు. పాఠశాలలో విద్యార్థులను నిత్యం వేధింపులకు గురి చేస్తున్నారని విద్యార్థుల తల్లిదండ్రులు ఆరోపించారు. దానిపై అధికారులు విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. దాంతో పాఠశాలలో యాజమాన్యానికి పేరెంట్స్‌తో తీవ్ర వాగ్వివాదం జరిగింది. ఇంత జరిగినా పాఠశాల వద్దకు విద్యాధికారులు రాకపో వడం గమనార్హం. రెండు గంటలపాటు పాఠశాల ఎదుట ఆందోళన చేపట్టిన విద్యార్థుల తల్లిదండ్రులు చేసేదేమీ లేక చర్యలు తీసుకోకుంటే ఆందోళన ఉధృతం చేస్తామని తిరిగి వెళ్లిపోయారు. కాగా విద్యార్థులను ఇంతలా హింసిస్తున్న పాఠశాలలపై చర్యలు తీసుకోకవడంతో అధికారుల తీరుపట్ల పలువురు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. పేరెంట్స్ పాఠశాల ఎదుట ఆందోళన చేస్తున్నట్టు తెలిసినప్పటికీ కూడా ఒక అధికారి కూడా అటువైపు రాకపోవడం పై ఆంతర్యం ఏంటని ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి పాఠశాలలో జరుగుతున్న తీరుపై విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

అండర్ గ్రౌండ్ డ్రయినేజీ సమస్యను పరిష్కరించండి

నవతెలంగాణ-రామచంద్రాపురం



రామచంద్రాపురం డివిషన్‌లోని అండర్ గ్రౌండ్ డ్రయినేజీ సమస్యలను పరిష్కరించాలని ఖైరతాబాద్‌లో ఉన్న జలమండలి ముఖ్య కార్యాలయంలో జలమండలి మేనేజింగ్ డైరెక్టర్ సుదర్శన్‌రెడ్డిని కార్పొరేటర్ పుష్ప కలిసి శుక్రవారం వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. రామచంద్రాపురంలోని కాలనీలలో డ్రయినేజీ సమస్యల పరిష్కారానికి సుమారు 4.05 కోట్ల నిధులు అందించాలని వినతి పత్రం అందజేసినట్టు చెప్పారు. దశలవారీగా నిధులు మంజూరు చేస్తామని ఈ సందర్భంగా ఎండి హామీ ఇచ్చినట్టు కార్పొరేటర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో పటాన్చెరువు కార్పొరేటర్ మెట్టు కుమార్, బీఆర్ఎస్ నాయకులు నగేష్ తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ
నమ్మకమైన తెలుగు దినపత్రిక
2
సంగారెడ్డి
శనివారం | 10 ఫిబ్రవరి 2024 | www.navatelangana.com

గీతం యూనివర్సిటీని సందర్శించిన కలెక్టర్ వల్లూరు క్రాంతి

నవతెలంగాణ-పటాన్‌చెరు



రానున్న పార్లమెంట్ ఎన్నికల సన్నద్ధతలో భాగంగా జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం(7) సెగ్మెంట్లకు అవసరమైన స్ట్రాంగ్ రూమ్‌లు, కౌంటింగ్ హాళ్ల ఏర్పాటు కోసం పటాన్‌చెరు మండలం రుద్రారం వద్ద గల గీతం డీమ్డ్ యూనివర్సిటీని జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి శుక్రవారం సందర్శించారు. ఆయా గదులు, హాళ్ల పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు చంద్రశేఖర్, మాధురి, పటాన్‌చెరు డీఎస్పీ పురుషోత్తం రెడ్డి, డిప్యూటీ కలెక్టర్ మహిపాల్ రెడ్డి, పటాన్ చెరు తహసీల్దార్ భాస్కర్, ఆర్అండ్ బి అధికారులు, గీతం యూనివర్సిటీ ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరు ప్రభుత్వ ఉపాధ్యాయులు సస్పెండ్

విద్యార్థినీల పట్ల అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నారని ఆరోపణ

నవతెలంగాణ-పటాన్‌చెరు

విద్యార్థినుల పట్ల అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నారని ఆరోపణలతో ఇద్దరు ప్రభుత్వ ఉపాధ్యాయులను డీఈఓ సస్పెండ్ చేశారు. వివరాల్లోకి వెళితే వివరాల్లోకి వెళితే పటాన్‌చెరు మండలం ముత్తంగిలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయులుగా విధులు నిర్వర్తిస్తున్న డి.సందీప్‌రెడ్డి, ఎన్.నరసింహులు విద్యార్థులతో అసభ్యకరంగా ప్రవర్తించడమే గాక వారి తల్లిదండ్రులతో సైతం అమర్యాదగా ప్రవర్తించారనే ఫిర్యాదులు రావడంతో.. విధుల నుంచి సస్పెండ్ చేశారు. దీనిపైన పూర్తిస్థాయిలో విచారణ చేపట్టనున్నట్లు ఎంఈఓ రాథోడ్ తెలిపారు.



2.5, 5 కిలోల వంటగ్యాస్ సిలిండర్లను సరఫరా చేయాలి

నవతెలంగాణ-ఐడీఏబొల్లారం

2.5, 5 కిలోల వంట గ్యాస్ సిలిండర్లను ప్రభుత్వం సరఫరా చేయాలని బీఆర్ఎస్ సీనియర్ నాయకులు బొల్లారం కేజేఆర్ ఆనంద్ కృష్ణారెడ్డి అన్నారు. ఈ సందర్భంగా ఆయన శుక్రవారం మాట్లాడుతూ.. బొల్లారంలో నిరుపేదలు, చిరు ఉద్యోగులు, కార్మికులు, రోజూవారి కూలీలు, వలస కార్మికులు పెద్దఎత్తున ఉన్నారు. వారు ఇప్పటి వరకు గ్యాస్ రీఫిలింగ్ సెంటర్లలో 2.5, 5 కిలోల సిలిండర్లు నింపుకుని ఉపయోగించేవారు. అయితే గత కొన్ని రోజులుగా ప్రమాదాలుకు కారణమవున్నాయనే నేపథ్యంలో గ్యాస్ రీఫిలింగ్ సెంటర్లు బంద్ చేస్తున్నారు. దాంతో చిన్న సిలిండర్లు దొరకక వారు పస్తులు ఉంటున్నారని.. ఈ విషయాన్ని శుక్రవారం రోజున పెద్ద ఎత్తున తన కార్యాలయానికి వచ్చి వాపోయినట్టు చెప్పారు. ఇప్పటికే పేదలకు ఎన్నో రకాలుగా అండగా నిలుస్తున్న కలెక్టర్.. ఈ విషయంలోనూ స్పందించి కార్మికుల ఆకలి తీర్చడానికి చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు.

గృహజ్యోతి కోసం వివరాలు అందజేయాలి

నవతెలంగాణ-జహీరాబాద్

జహీరాబాద్ డివిజన్ పరిధిలోని విద్యుత్ వినియోగదారులు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన గృహజ్యోతి 200 యూనిట్ల ఉచిత విద్యుత్తు పథకం కోసం వివరాలను అందజేయాలని విద్యుత్ శాఖ డీఈఈ లక్ష్మీనారాయణ విజ్ఞప్తి చేశారు శుక్రవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల9 వ తేదీ నుండి 12వ తేదీ వరకు జహీరాబాద్ విద్యుత్ శాఖ సిబ్బంది తమ కాలనీలకు వచ్చినప్పుడు వినియోగదారులు సర్వీస్ నెంబరు, ఆధార్ కార్డు, రేషన్ కార్డు, ప్రజా పాలన దరఖాస్తు నంబరు, వివరాలను అందజేయాలన్నారు. ఈ అవకాశాన్ని విద్యుత్ వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

బొల్లారంలో నేడు విద్యుత్ గ్రీవెన్స్ డే

నవతెలంగాణ-ఐడీఏబొల్లారం

బొల్లారం మున్సిపాల్టీలో నేడు(శనివారం) విద్యుత్ గ్రీవెన్స్ డే నిర్వహిస్తున్నట్టు ట్రాన్స్ కో ఏడిఈ సీహెచ్ అశోక్ రావు, ఏఈ రామకృష్ణారెడ్డిలు ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ సమస్యల పరిష్కార నిమిత్తం ఉపకేంద్రానికి వినియోగదారులు ఆధార్ కార్డు, విద్యుత్ బిల్లుల రశీదులు తీసుకుని రావాలని కోరారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం రెండు వరకు కార్యక్రమం ఉంటుందన్నారు.



మన్నాన్‌పల్లిలో వరి పంటలను పరిశీలించిన ఏడీఏ

నవతెలంగాణ-జోగిపేట

అందోల్ మండల పరిధిలోని మన్నాన్‌పల్లి గ్రామంలో వరి పంట పొలాలను శుక్రవారం జోగిపేట ఏడీఏ అరుణ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రస్తుతం 15 నుంచి 20 రోజుల వరిపంటలో కాండం తొలుచుపురుగు ఉధృతి ఎక్కువగా ఉందఅన్నారు. దాని నివారణకు కార్టాప్ హైడ్రోక్లోరైడ్ 4 జి గుళికలు ఎకరాకు 8 కిలోలు వేసుకోవాలి లేదా క్లోరంట్రా నీలిప్రోల్ 18.5ఎస్‌సీ(కోరాజిన్) 60ఎంఎల్ ఎకరాకు పిచికారి చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తీర్ణ అధికారి అనిత, రైతులు దశరథ్, సాలయ్య మావయ్య, కిష్టయ్య తదితరులు పాల్గొన్నారు.

రేపు ఐదో తరగతి ప్రవేశ పరీక్ష

నవతెలంగాణ-సంగారెడ్డి

సోషల్ వెల్ఫేర్ పాఠశాలల్లో ఐదో తరగతి ప్రవేశ పరీక్ష రేపు(ఆదివారం) జరగనున్నట్టు మెదక్ వెస్ట్ ప్రాంతీయ సమన్వయకర్త భీమయ్య ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1.00 గంట వరకు పరీక్ష ఉంటు ందన్నారు. విద్యార్థులందరూ https://tgcet.cgg.gov.in/TGCETWEB20/#!/home1701klmpmj.rps ద్వారా హాల్‌టిక్కెట్లు డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు. ప్రవేశ పరీక్షకి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్టు తెలిపారు. అడిషనల్ కలెక్టర్ కూడా ఏర్పాట్లను పర్యక్షించి.. పలు సూచనలు చేశారన్నారు. సిట్టింగ్ స్క్వాడ్, సీఎస్, డీవోలని నియమించారన్నారు. విద్యార్థులందరూ హాల్ టికెట్లు తీసుకొని.. సమయానికి ప్రవేశ కేంద్రం చేరుకోవాలన్నారు. ఇంకా ఏమైనా సందేహాలు ఉంటే దగ్గరలోని ఏదైనా రెసిడెన్షియల్ పాఠశాలకు వెళ్లి సందేహాలు నివృత్తి చేసుకోవాలన్నారు.

శ్రీ కోటి బిల్వ లింగేశ్వర జాతర ఆహ్వాన పత్రిక ఆవిష్కరణ

నవతెలంగాణ-సదాశివపేట



మండలంలోని తంగడపల్లి గ్రామంలో వెలిసిన శ్రీ కోటి బిల్వ లింగేశ్వర మఠం.. శ్రీ గురు గంగాధర మహాస్వామి ఆశ్రమం జంగమయ్య గుట్ట 28వ వార్షికోత్సవ జాతర మహోత్సవానికి సంబంధించిన ఆహ్వాన పత్రికకు పూజ గురువర్యులు షఠస్థల బ్రహ్మ శ్రీ శివయోగి శివాచార్య మహాస్వామి చేతులమీదుగా శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శివాచార్య మహాస్వామి మాట్లా డుతూ.. ఫిబ్రవరి 24 నుంచి మార్చి 2 వరకు నిత్య విశేష పూజా కార్యక్రమాలు నిర్వహిస్తారన్నారు. మార్చి 2న శివపార్వతుల కళ్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహిస్తారన్నారు.భక్తులు పూజా కార్యక్రమంలో పెద్ద ఎత్తున పాల్గొని స్వామివారు ఆశీస్సులు పొందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అర్చక పుర హితులు జంగం మహేష్ స్వామి, గీత జ్ఞాన తరంగణి, గీతా మందిర్ నిర్వా హకు లు సదాశివపేట వారు అమ్రాజ మల్లన్న, సుధాకర్ రెడ్డి, ఇతర భక్తులు పాల్గొన్నారు.

సంగారెడ్డిలో 'గావ్ ఛలో ఘర్ ఛలో'



నవతెలంగాణ-సంగారెడ్డి

సంగారెడ్డి పట్టణంలోని రాజంపేటలో శుక్రవారం 'గావ్ ఛలో ఘర్ ఛలో' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్ర మానికి ముఖ్యఅతిథిగా బీజేపీ రాష్ట్ర నాయకులు కొండాపురం జగన్ పాల్గొన్నారు. ఇంటింటి తిరుగుతూ కేంద్ర ప్రభుత్వం చేపట్టిన పథకాలను గురించి వివరించారు. బీజేపీ సంగారెడ్డి పట్టణాధ్యక్షులు రవిశంకర్, బీజేపీ పట్టణ ఉపా ధ్యక్షులు నాగారం సంతోష్, 107 బూత్ అధ్యక్షురాలు సుజాత, 108 భూత అధ్య క్షులు శరత్ బాబు, బీజేపీ నాయకులు సాయి, వీరేష్, అభి, రాజు, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణలో అందరూ భాగస్వాములవ్వాలి

- పచ్చదనం పరిశుభ్రతపై అవగాహన కల్పించాలి
- జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి

నవతెలంగాణ-పటాన్‌చెరు



పారిశుధ్య వారోత్సవాలలో ప్రజలందరూ భాగస్వాములై గ్రామంలోని సమస్యలను పరిష్కరించుకోవాలని జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి ఉద్బోధించారు. పారిశుధ్య వారోత్సవాల్లో భాగంగా మండలంలోని రుద్రారం గణేష్ టెంపుల్ సమీపంలో గ్రీన్ ఇండియా ఛాలెంజ్‌లో భాగంగా ఏర్పాటు చేసిన ప్రకృతి వనాన్ని కలెక్టర్ శుక్రవారం సందర్శించారు. ప్రకృతి వనంలో మొక్కలు నాటి నీళ్ళు పోసారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. పారిశుధ్య వారోత్సవాలను వారం రోజులపాటు చేసుకుంటున్నా మన్నారు. ఈ వారంలోపు గ్రామస్తులందరూ కలిసి గ్రామంలో గల సమస్యలను పరిష్కరించుకోవాలన్నారు. మురుగు కాలువలు, రోడ్లు శుభ్రం చేసుకోవడం, తాగునీటి పైపుల మరమ్మత్తులు, వాటర్ ట్యాంకులను శుభ్రం చేసుకోవడం, మొక్కలకు నీటి సంరక్షణ ఏర్పాటు చేసుకో వడం, చనిపోయిన మొక్కల స్థానంలో కొత్త మొక్కలను పెట్టడం, తదితర పనులు చేసుకోవాలని సూచించారు. పచ్చని పారిశుద్ధ్య గ్రామాలుగా రూపొందించాలన్నారు. ప్రజలు ఆరోగ్యంగా ఉండాలంటే గ్రామం పచ్చదనం పరిశుభ్రంగా ఉండాలన్నారు. గ్రామ పరిధిలో గల రెస్టారెంట్లు, దాబాలు అక్కడే ఒక కంపోస్ట్ పిట్స్ ఏర్పాటు చేసుకోవాలని, రెండు వారాలలోగా ఏర్పాటు చేసుకు నేలా చర్యలు చేపట్టాలని పంచాయతీ కార్యదర్శి సూచించారు. స్వయం సహాయక సంఘాల మహిళలు బట్ట బ్యాగులను తయారు చేయాలని, దాంతో ఆదాయం వస్తుందన్నారు. దాంతో కొంతవరకు ప్లాస్టిక్ నిర్మూలించిన వాళ్ళు అవుతారన్నారు. ఎవరు కూడా ప్లాస్టిక్ వాడరాదని, పేపర్, కాటన్ బ్యాగులు వాడాలని సూచించారు. స్వయం సహాయక సంఘాల మహిళలు పేపర్, కాటన్ బ్యాగులు తయారుచేసి దేవాలయానికి సరఫరా చేయాలని సూచించారు. తయారీ పనిని వెంటనే ప్రారంభించాలని మహిళలను ప్రోత్స హించారు. అంతకు ముందు కలెక్టర్ వల్లూరు క్రాంతి గణపతి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవాలయ అర్చకులు పూర్ణకుంభంతో కలెక్టర్ కు స్వాగతం పలికారు. అనంతరం ప్రత్యేక పూజలు చేసి, ఆశీర్వచనంతో ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో డిఎల్పిఓ సతీష్ రెడ్డి, ఎంపీడీవో బన్సీలాల్, ఎంపీఓ హరిశంకర్ గౌడ్, దేవాలయ ఈవో మోహన్ రెడ్డి, మాజీ సర్పంచ్ సుధీర్ రెడ్డి, ఎంపీటీసీ మన్నె రాజు, పంచాయితీ కార్యదర్శి రాజకుమార్, స్వయం సహాయక సంఘాల మహిళల తదితరులు పాల్గొన్నారు.

కంది పల్లెప్రకృతి వనం, ప్రభుత్వ పాఠశాలల సందర్శన

నవతెలంగాణ-కంది



ప్రత్యేక పారిశుధ్య వారోత్సవాల్లో భాగంగా కంది మండల కేంద్రంలోని పల్లె ప్రకృతి వనాన్ని జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి సందర్శించారు. మొక్కల సంరక్షణ, నీటి వసతి, పారిశుధ్య నిర్వహణ, పడిపోయిన మొక్కలను సరిచేసారా, ఎండిన మొక్కల స్థానంలో కొత్త మొక్కలను నాటారో పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మనం మొక్కలు నాటి రక్షిస్తే, మొక్కలు మనల్ని రక్షిసాయని.. ప్రతీ ఒక్కరూ మొక్కలు నాటి వాటిని కాపాడాలన్నారు. అనంతరం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ హై స్కూల్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలను పరిశీలించడంతో పాటు, ఉపాధ్యాయుల హాజరిజిస్టర్‌ను పరిశీలించారు. పాఠశాలలో గల మొత్తం విద్యార్థుల సంఖ్య, పని చేస్తున్న ఉపాధ్యాయులు, వసతుల గురించి ప్రధానోపాధ్యాయురాలిని అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో మొత్తం 178 మంది విద్యార్థులు ఉన్నారని, 9 మంది ఉపాధ్యాయులు బోధిస్తున్నారని స్కూల్ హెడ్ మాస్టర్ కలెక్టర్‌కు తెలిపారు. ప్రభుత్వం విద్యకు అత్యంత ప్రాధాన్యతనిస్తుందని, విద్యార్థులకు పాఠశాలల్లో అన్ని వసతు లు కల్పిస్తున్నదని కలెక్టర్ అన్నారు. విద్యార్థుల సంఖ్య పెరగాలని, ఆ దిశగా ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. పాఠశాలలో ఏవైనా సమస్యలు ఉన్నాయా అంటూ ఆరా తీశారు. ఈ సందర్భంగా ఎంపీడీవో కార్యాలయ బోరు నుంచి పాఠశా లకు నీటిని ఇస్తున్నప్పటికీ, మరుగుదొడ్లలో నీటి సరఫరా పూర్తి స్థాయిలో లేదని, పాఠశాలకు ప్రత్యేకంగా ఒక బోరు వేయించాలని హెచ్ఎం కలెక్టర్‌ను కోరారు. ఈ కార్యక్ర మాల్లో కంది ప్రత్యేక అధికారి డీడబ్ల్యుఓ సంధ్యారాణి, డీఎల్ పీఓ సతీష్‌రెడ్డి, తహసీల్దార్ విజయ లక్ష్మి, ఎంపీడీవో విశ్వ ప్రసాద్, ఎంపీఓ, పంచాయతీ కార్యదర్శి తదితరులు పాల్గొన్నారు.



జోగిపేట అంగన్వాడీ కేంద్రంలో దొంగతనం

నవతెలంగాణ-జోగిపేట

జోగిపేటలోని ప్రాథమిక పాఠశాల ఆవరణలో ఉన్న అంగన్వాడీ కేంద్రం (కోడ్ నెం.16)లో గురువారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు ప్రవేశించి దొంగతనానికి పాల్పడారు. జోగిపేట ఎస్సై-2 మొగులయ్య తెలిపిన వివరాల ప్రకారం.. అంగన్‌వాడీ కేంద్రంలో టీచర్ సావిత్రి గురువారం సాయత్రం 4 గంటలకు విధులు ముగించుకుని.. తాళం వేసి వెళ్లిపోయింది. అయితే గుర్తు తెలియని వ్యక్తులు గురువారం రాత్రి ఆ తాళాన్ని పగలగొట్టి అందులోని 75 కజీల బియ్యం, 6 కిలోల పప్పు, 14 నూనె ప్యాకెట్లు, 30 కిలోల బాలామృతం ప్యాకెట్‌లు, 5 లీటర్ల పాలు, ఇతర సామగ్రిని ఎత్తుకెళ్లారు. శుక్రవారం ఉదయం కేంద్రాన్ని తెరిచేందుకు వచ్చిన టీచర్‌కు తాళాలు పగలగొట్టి, తలుపులు తెరచి ఉండి కనిపించింది. దాంతో ఆమె వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఎస్ఐ-2 సిబ్బందితో కలిసి ఘటనా స్థలాన్ని పరిశీలించి విచారణ చేపట్టారు. టీచర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు. ఇప్పటి వరకు కేంద్రంలో ఆరుసార్లు దొంగతనం జరిగిందని టీచర్ తెలిపారు.

ప్లాస్టిక్ బాటిల్స్, క్యాన్లలో పెట్రోల్ పోయొద్దు

- ప్రతీ బంక్‌లో హై రెజల్యూషన్ సీసకెమెరాలను ఏర్పాటు చేసుకోవాలి
- పెట్రోల్ బంక్ యజమానులకు ఎస్పీ సూచనలు

నవతెలంగాణ-సంగారెడ్డి



ప్లాస్టిక్ బాటిల్స్, క్యాన్లలో పెట్రోల్ పోయడానికి అనుమతి లేదని.. ప్రతీ పెట్రోల్ బంక్‌లో హై రెజల్యూషన్ కలిగిన సీసీ టీవీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని పెట్రోల్ బంక్ యజమానులకు జిల్లా ఎస్పీ చెన్నూరి రూపేష్ సూచించారు. ప్లాస్టిక్ బాటల్స్, క్యాన్‌ల్లో పెట్రోల్ కొనుక్కొని కొంతమంది నేరస్తులు పలురకాల నేరాలకు పాల్పడుతున్నారన్నారు. పెట్రోలియం యాక్ట్-2002 ప్రకారం పెట్రోల్‌ను ప్లాస్టిక్ బాటల్స్ లేదా క్యాన్‌లలో పెట్రోల్ పోయడానికి అనుమతి లేదన్నారు. ఎవరైనా ఈ చట్టాన్ని ఉల్లంగించి, బాటల్స్ లేదా క్యాన్‌ల్లో పెట్రోల్ పోసినట్టైతే సదరు బంక్ యజమానులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. అంతేకాకుండా బంక్ లైసెన్స్ రద్దుకు సిఫారసు చేస్తామని హెచ్చరించారు. ప్రతీ పెట్రోల్ బంక్‌లో హై రెజల్యూషన్, నైట్ విజన్ కలిగిన సీసీటీవీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని, ఆ కెమెరాల యొక్క స్టోరేజ్ 90 రోజుల వరకు ఉండేవిధంగా హార్డ్ డిస్క్‌లను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఎవరైనా బాటిల్స్‌లో పెట్రోల్ పోయాలని బలవంతం చేస్తే పోలీసు స్టేషన్‌లో సమాచారం ఇవ్వాలన్నారు.

మాజీ సర్పంచ్‌లకు మాజీ ఎమ్మెల్యే ఘన సన్మానం

నవతెలంగాణ-కల్హేర్



మండల కేంద్రంలో శుక్రవారం ఏర్పాటు చేసిన తాజా మాజీ సర్పంచ్‌ల వీడ్కోలు సమావేశానికి నారాయణఖేడ్ మాజీ ఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై.. మాజీ సర్పంచ్‌లను పూలమాల, శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత ఐదేండ్ల బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో తాను ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు.. సర్పంచ్‌లు నిరంతరం గ్రామాభివృద్ధికి కృషి చేసి నియోజకవర్గాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దారని మెచ్చుకున్నారు. గ్రామాభివృద్ధికి, ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం సేవ చేసేందుకు పదవులతో సంబంధం లేకుండా ముందుకు రావాలన్నారు. పదవితో సంబంధం లేకుండా.. పార్టీ కార్యకర్తలకు, నాయకులకు, ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ నరసింహారెడ్డి, పార్టీ మండలా ధ్య క్షుడు రామ్‌సింగ్, ఉపాధ్యక్షుడు ఎన్.యాకోబు, ఎంపీపీ సుశీల అంజయ్య వైస్ ఎంపీపీ నారాయణరెడ్డి, రైతు సమ న్వయ సమితి అధ్యక్షులు దుర్గా రెడ్డి, మాజీ మండ ల ధ్యక్ష ుడు నారాయణరావు, పీఏసీఎస్ చైరెన్ సంగారెడ్డి వైస్ చైర్మ న్ సాయిబాబాగౌడ్, బీఆర్ఎస్ మండల యువ త అధ్య క్షులుసంతోష్‌కుమార్, సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

పుచ్చకాయ సాగుతో అధిక లాభాలు



నవతెలంగాణ-జహీరాబాద్

పుచ్చకాయ సాగుతో అధిక లాభాలు సాధించవచ్చు అని ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త రాహుల్ విశ్వకర్మ అన్నారు. రంజోల్ రైతు వేదికలో పుచ్చ, మొక్కజొన్న సాగు గురించి ఏరువాక కేంద్రం సంగుపేట శాస్త్రవేత్తలైన రాహుల్ విశ్వకర్మ, సరిత శాస్త్రవేత్తల ద్వారా రైతులకు శుక్రవారం శిక్షణ ఇచ్చారు. సమన్వయకర్త రాహుల్ విశ్వకర్మ మాట్లాడుతూ.. మొక్కజొన్నలో కత్తెర పురుగు నివారణ కోసం ముఖ్యంగా తొలి దశలో అయితే ఖురాన్ 0.3 మిల్లీలీటర్లు ఒక లీటర్ నీటికి.. ఆ తర్వాత 445 రోజుల మధ్యలో ఈ సుడులు వచ్చే సమయంలో డెలిగేట్ అంటే స్పైనటోరం 0.5 ఎం.ఎల్ ఒక లీటర్ నీటికి కలుపుకొని పిచికారి చేసుకోవాలన్నారు. లింగాకర్షగా బుట్టలు ఎకరాకి ఐదు పెట్టుకోవాలని.. దాంతో ఈ మగ రెక్క పురుగులు ఆకర్షించబడి పంటకు వాటి ఉధృతి తగ్గుతుందన్నారు. అదేవిధంగా చివరి దశలో అయితే 10 కిలోల తవుడు, రెండు కిలోల బెల్లం కొంత నీటి సముదాయంతో మిశ్రవ వాన్ని తయారు చేసుకొని.. దాంట్లో 100 గ్రాములు తయోడి కారతయోడి కార్బన్‌మిశ్రమాన్ని ఉండలుగా చేసుకొని సుడులో వేయాలన్నారు. దాంతో దాని ఉధృతి తగ్గుతు ందన్నారు. పుచ్చ సాగులో యాజమాన్య చర్యల గురించి ఉద్యాన శాస్త్రవేత్త సరిత వివరిస్తూ.. పుచ్చ సాగులో ముఖ్యం గా ఐస్‌బాక్స్ రకాలైన కిరణ్ మ్యాక్స్ మరియు అరుణ రకాల ను సూచించారు.నేల తయారీ, నార్మడి యాజ మాన్యంలో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. డ్రిప్, మల్చింగ్ పద్ధతి ద్వారా ద్వారా సాగు చేస్తే కలుపు నివాణ నీటి ఆదా అదేవిధంగా కూలీల ఖర్చును తగ్గిం చుకుంటూ తగిన చీరపీడల యాజమాన్యం చేపడితే అధిక లాభాలు పొందవచ్చు అన్నారు. ఈ కార్యక్రమంలో ఉద్యాన అధికారి శైలజ పాల్గొని రైతు పథకాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాస్త్రవేత్తలు ప్రదీప్ కుమార్, కేంద్రం యంగ్ ప్రొఫెషనల్ శ్రీకాంత్, రాజశేఖర్, రైతులు శ్రీనివాస్ రెడ్డి, మోహన్, కృష్ణమోహన్, కృష్ణ, మానెప్ప తదితరులు పాల్గొన్నారు.

క్రషర్లు, క్వారీలపై మైన్స్ అండ్ పీసీబీలకు ఫిర్యాదులు



నవతెలంగాణ-జిన్నారం

మండల మండలం మాదారం గ్రామ పంచాయతీ పరిధిలో ప్రజలకు ఇబ్బందిగా ఉన్న కంకర క్రషర్లు, క్వారీలను వెంటనే నిలిపివేయాలని కోరుతూ మాదారం గ్రామ యువజనులు సెంట్రల్ మైన్స్ అండ్ సేఫ్టీ, రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి, రాష్ట్ర సైన్స్ అండ్ జువాలజీ డైరెక్టర్ అధికారులకు శుక్రవారం ప్రత్యేకంగా ఫిర్యాదులు చేశారు. ఈ మేరకు యువజనులు సాయమొల్ల విజయ్ గౌడ్, సుదర్శన్, రామన్ సింగ్ బృందం హైదరాబాదులోని సెంట్రల్ మైన్స్ సేఫ్టీ డిప్యూటీ డైరెక్టర్ డైరెక్టర్ ప్రేమ్ కుమార్, రాష్ట్ర సైన్స్ అండ్ జువాలజీ డైరెక్టర్ బిఆర్‌వి సుశీల్ కుమార్, రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి చైర్మెన్ రాజీవ్ శర్మ కార్యాలయాల్లో వినతి పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా మాదారం యువజన సంఘాల ప్రతినిధి విజయ్‌గౌడ్ బృందం మాట్లాడుతూ.. మాదారం గ్రామ పంచాయతీ పరిధిలో గల కంకర క్రషర్లు, క్వారీల వల్ల పరిసర గ్రామాల ప్రజానీకం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. విచ్చలవిడిగా బ్లాస్టింగ్లను నిర్వహించడం, దుమ్ము ధూళితో జనాలు ఇబ్బంది గురికావడం, ప్రజారోగ్యం దెబ్బ తినడం, వృద్ధులు చిన్నపిల్లలు, గర్భిణీ స్త్రీలు, బాలింతలు తరచుగా అనారోగ్యం పాలవుతున్నారన్నారు. నిబంధనలను తుంగలో తొక్కి లాభాలే ధ్యేయంగా కంకర క్రషర్లు, క్వారీలు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నాని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాబట్టి వాటిని వెంటనే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా అధికార బృందాలు సానుకూలంగా స్పందిస్తూ.. విచారణ జరిపి తగిన చర్యలు తీసుకుంటామని తెలిపాయి. ఈ కార్యక్రమంలో మాదారం గ్రామ యువజన సంఘాల ప్రతినిధులు సాయ మొల్ల విజయ్ గౌడ్, సుదర్శన్, టి.రమణ సింగ్, జె .బాలేష్, సిహెచ్ గణేష్, కె వెంకటేష్ గౌడ్, జె. రమేష్, పి నాగరాజు, బాలరాజు, పాండు, సంతోష్, నవీన్ గౌడ్, సిహెచ్. అనిల్ బృందం పాల్గొన్నారు.

దేశవ్యాప్త సమ్మె, గ్రామీణ బంద్‌ను జయప్రదం చేయాలి

ప్రజా, కార్మిక సంఘాల ఆధ్వర్యంలో కరపత్రాల పంపిణీ, కార్మికులతో సమావేశాలు





నవతెలంగాణ-సంగారెడ్డి, సదాశివపేట



కేంద్ర బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా, కార్మిక వ్యతిరేక విధానాలపై ఈనెల 16న దేశవ్యాప్తంగా కార్మిక సంఘాలు, సంయు క్త కిసాన్ మోర్చా సంఘాల ఆధ్వర్యంలో చేపట్టనున్న దేశవ్యాప్తం బంద్, సమ్మెను జయప్రదం చేయాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.నర్సిములు, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు వి.ప్రవీణ్ కుమార్ పిలుపునిచ్చారు. ఈ మేరకు సంగారెడ్డి మండలం నాగపూర్, కల్పగూర్, ఇరిగిపల్లీ గ్రామాల్లో స్థానిక నాయకులతో కలిసి నర్సిములు కరపత్ర ప్రచారం నిర్వహించారు. అలాగే సదాశిపేట మండలంలోని చందాపూర్ గ్రామంలో గల పెబ్స్ పెన్నార్ పరిశ్రమ ఎదుట ప్రవీణ్ కుమార్ ముఖ్య అతిథిగా కార్మికుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా సందర్భాల్లో వారు మాట్లాడుతూ.. మోడీ ప్రభుత్వం అధికారంలో వచ్చి పదేండ్లు అవుతున్నా.. కార్మికులు, రైతులు, కూలీలు, ప్రజల సమస్యలను పట్టించుకున్న పాపానపోలేదన్నారు. 29 కార్మిక చట్టాలను నాలుగు లేబర్‌కోడ్‌గా మార్చి కార్మికులను బానిసలుగా చేసే ప్రయత్నం చేస్తున్నదన్నారు. 8 గంటల పని స్థానంలో పన్నెండు గంటల పని విధానం తీసకురావాలని చూస్తోందన్నారు.ప్రజల మధ్య వైశ్యమ్యాలను రెచ్చగొట్టడానికి మతతత్వ ఎజెండాను అమలు చేస్తున్నదన్నారు. ఈ కార్యకమాల్లో సంగారెడ్డిలో వివిధ గ్రామాల కూలీలు, కార్మికులు, సదాశిపేటలో పెబ్స్ పెన్నార్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు నీలం మల్లేశం, శ్రీనివాస్, మోహన్, రవి, నాగరాజ్, అప్పలనాయుడు, శ్రీనివాస్ గౌడ్, పాండురంగం తదితరులు పాల్గొన్నారు.

జిన్నారం : మండలంలోని కాజిపల్లి ఇండస్ట్రియల్ ఏరియాలో పలు పరిశ్రమలకు సీఐటీయూ ఆధ్వర్యంలో సమ్మె నోటీసులను పంపిణీ చేశారు. కార్మిక వర్గాలను కలిసి సమ్మెను జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు. కాజిపల్లి పారిశ్రామిక వాడలోని నవోదయ, ఎస్ఎంఎస్ లైఫ్ సైన్స్‌తో పాటుగా పలు పరిశ్రమల వద్ద సమ్మె నోటీసులను కంపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ కార్మిక సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

నేటి నుంచి మల్లికార్జున స్వామి జాతర

నవతెలంగాణ-ఐడీఏబొల్లారం



బొల్లారం మున్సిపల్ పరిధిలోని శ్రీ మల్లికార్జున స్వామి జాతరకు సర్వం సిద్ధమైంది. ఈనెల 9 న ప్రారంభమైన ఈ ఉత్సవాలు 12వ తేదీ వరకు ఘనంగా జరగనున్నాయి. 9న మైలపోలు కార్యక్రమం ప్రారంభం కాగా..10న గంగపటం, 11న మల్లికార్జున స్వామి కళ్యాణం, అన్నదానం మరియు 12న నాగవెల్లి కార్యక్రమాలను నిర్వహించేందుకు సర్వం సిద్ధం చేశారు. ఆలయ పోషకులు ఉసికేబావి నారాయణరెడ్డి, చంద్రారెడ్డి, యాదిరెడ్డి, వేణుపాల్ రెడ్డిల ఆధ్వర్యంలో నాలుగు రోజుల పాటు జరిగే స్వామి వారి జాతరలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ఉత్సవాలను జయప్రదం చేయాలని నిర్వాహకులు కోరారు.

ఘనంగా పీఆర్టీయూ ఆవిర్భావ దినోత్సం



నవతెలంగాణ-జోగిపేట

పీఆర్టీయూ ఆవిర్భావ దినోత్సవాన్ని జోగిపేటలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఆ సంఘాన్ని స్థాపించి 53 ఏండ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా జోగిపేట ఉన్నత పాఠశాల ప్రాంగణంలో అందోల్ మండలాధ్యక్షులు యస్. నరోత్తం కుమార్ సంఘ పతాకం ఆవిష్కరించారు. అనంతరం సంఘంలో సీనియర్ నాయకులు ప్రేమ్ కుమార్, వి.విశ్వనాథం, టి.మధుసుధాన్, ఆశయ్యలను శాలువా పూలమాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మండల శాఖల ప్రధానకార్యదర్శి బి.రాజమల్లు, రాష్ట్ర బాధ్యులు మాంజ్యా నాయక్, అజీత్, ప్రసాద్, అనిల్ కుమార్, పి.సుభాష్,నవీన్, రమేష్, శ్రీశైలం, వి.బి. శ్రీనివాస్, టి.త్రినాథరావు, మహేష్‌కుమార్‌చారి, మహేందర్, మాయచారి, మౌలానా, వట్‌పల్లి అధ్యక్షులు లక్ష్మణ్, ప్రధానోపాధ్యాయులు నరేశ్ కుమార్, మహిళా ఉపాధ్యాయునిలు జయలత, లావణ్య , సుధారాణి తదితరులు పాల్గొన్నారు.

మునిపల్లి : మండల కేంద్రంలో పీఆర్టీయూ ఆవిర్భావ దినోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పీఆర్టీయూ స్థాపనకు కృషి చేసిన సామల యాదగిరి చిత్రపటానికి పూలమాలవేసి.. అనంతరం పీఆర్టీయూ పతాకాన్ని ఆవిష్కరించారు. సంఘానికి విశేష సేవలు అందించిన ఉపాధ్యాయులు సంగమేశ్వర్, సుజాఉదీన్‌లను శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా మునిపల్లి మండల శాఖ అధ్యక్షులు చంద్రమౌళి, సంగమేశ్వర్ మాట్లాడుతూ.. ఉపాధ్యాయ సంక్షేమానికి పీఆర్టీయూ సంఘం చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో సంఘ ప్రధాన కార్యదర్శి సంగమేశ్వర్, సంఘం అనుబంధ సభ్యులు సుజాఉద్దీన్, రమణ కుమార్ ప్రవీణ్‌కుమార్, సిద్దేశ్వర్, రాజేశ్వర్, కిష్టయ్య,పడురంగారెడ్డి, సత్యనారాయణ, రమణ, ప్రవీణ్ కుమార్, శ్రీనివాసరావు, హేమ సుందర్, పూర్ణిమ, కవిత, స్వప్న తదితరులు పాల్గొన్నారు



నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
మెదక్
3
శనివారం | 10 ఫిబ్రవరి 2024 | www.navatelangana.com

కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలి.

ఖేడ్ మాజీ ఎమ్మెల్యే భూపాల్ రెడ్డి
నవతెలంగాణ- పెద్ద శంకరంపేట్



ఎన్నికలలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని నారాయణఖేడ్ మాజీ ఎమ్మెల్యే భూపాల్ రెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం పెద్ద శంకర్పేట మండల పరిధిలోని కొత్తపేట శివారులో ఏర్పాటు చేసిన మండల స్థాయి తాజా మాజీ సర్పంచ్లకు సన్మాన కార్యక్రమం నిర్వహించిన అనంతరం కార్యకర్తల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన వెంటనే తొలి రోజున హామీలు నెరవేరుస్తామని చెప్పి ప్రజలను మోసం చేస్తూ ఇబ్బందులకు గురి చేస్తున్నారని పేర్కొన్నారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం అభివృద్ధి మరిచి ప్రజలను మోసగిస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పేట ఎంపీపీ జంగం శ్రీనివాస్ జెడ్పిటిసి విజయరామరాజు మండల బి ఆర్ స్ అధ్యక్షులు మురళి పంతులు వైస్ ఎంపీపీ లక్ష్మీ రమేష్ ఎంపీటీసీలు వీణ సుభాష్ గౌడ్ దత్తు ఆయా గ్రామాల సర్పంచులు ఎంపీటీసీలు నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

గుండెపోటుతో పంచాయతీ కార్మికుడి మృతి

నవతెలంగాణ-రామాయంపేట



గుండెపోటుతో గ్రామపంచాయతీ కార్మికుడు మృతి చెందిన ఘటన మండల పరిధిలోని అక్కన్నపేట గ్రామంలో జరిగింది. అక్కన్నపేట గ్రామపంచాయతీలో తాత్కాలిక డ్రైవర్గా విధులు నిర్వహిస్తున్న తుడుం స్వామి(55) గుండెపోటుతో మృతి చెందారు. ఉదయం ట్రాక్టర్ ద్వారా గ్రామంలో చెత్త సేకరణకు వెళ్లిన తుడుం స్వామి అస్వస్థకు గురై పంచాయతీ కార్యాలయం వద్ద కిందపడి అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయాడు. వెంటనే స్పందించిన తోటి కార్మికులు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే స్వామి మృతి చెందినట్లు డాక్టర్లు నిర్ధారించారు. నిరుపేద కుటుంబం కావడంతో ప్రభుత్వం స్వామి కుటుంబాన్ని ఆదుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

ఆశా వర్కర్ల పెండింగ్ వేతనాలను చెల్లించాలి

- గత ప్రభుత్వ హామీలను అమలు చేయాలి
- అధికారుల వేధింపులను అరికట్టాలి
- సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు ఏ మల్లేశం



నవతెలంగాణ-మెదక్

ఆశా వర్కర్లకు రావాల్సిన పెండింగ్ వేతనాలను తక్షణమే చెల్లించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు ఏ.మల్లేశం పేర్కొన్నారు. ఆశా వర్కర్ల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం కలెక్టరేట్ ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించి వినతి పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా సిఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు ఏ. మల్లేశం మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజల ఆరోగ్యాలను కాపాడడం కోసం తమ ఆరోగ్యాలను సైతం లెక్కచేయకుండా ఆశా వర్కర్లు పనిచేస్తూ సేవలందిస్తున్నట్లు తెలిపారు. చాలీచాలని వేతనాలతో అనేక ఇబ్బందులు ఎదుర్కొంటూ అప్పులు చేస్తూ తమ కుటుంబాలను పోషించుకుంటున్న ఆశా వర్కర్లకు డిసెంబర్, జనవరి రెండు నెలల పారితోషికాలను ప్రభుత్వం అందించలేదన్నారు. దీంతో క్రిస్టమస్, సంక్రాంతి పండుగలకు పస్తులు ఉండాల్సిన పరిస్థితి ఏర్పడిందని మండిపడ్డారు. 18 ఏళ్ల నుంచి పనిచేస్తున్న ఆశా వర్కర్లు బడుగు బలహీన వర్గాలకు చెందిన మహిళలని తెలిపారు. పదేళ్లు అధికారంలో ఉన్న గత ప్రభుత్వం ఆశా వర్కర్ల సమస్యల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించిందన్నారు. ప్రస్తుతం అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే ఆశా వర్కర్లకు రావాల్సిన డిసెంబర్, జనవరి 2 నెలల పెండింగ్ పారితోషికాలను చెల్లించాలన్నారు. సమ్మెలో భాగంగా ఆశా వర్కర్లకు గత ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలన్నారు. ఆశాలతో పారితోషికాలు లేని అభయ హస్తం, మహాలక్ష్మి వంటి అదనపు పనులను చేయించవద్దన్నారు. నెలకు రూ. 18000 ఫిక్స్ వేతనం నిర్ణయించాలని, పిఎఫ్, ఈఎస్ఐ సౌకర్యాలు, ఉద్యోగ భద్రత కల్పించాలని, టీబి స్ఫూటమ్ డబ్బాలను ఆశాలతో మోయించే పనిని రద్దు చేయాలన్నారు. ఆశాలను ప్రసూతి సెలవులపైన ఉత్తర్వులను వెంటనే జారీ చేయాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్ రూ.5 లక్షలు ఇవ్వాలని, మట్టి ఖర్చులకు రూ. 50 వేలు చెల్లించాలని, ప్రమాద బీమా సౌకర్యం రూ.10 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. రిజిస్టర్స్ ప్రింట్ చేసి ఇవ్వడంతో పాటు అధికారుల వేధింపులు, బెదిరింపులు అరికట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కోశాధికారి నర్సమ్మ, ఆశా వర్కర్స్ యూనియన్ నాయకులు రాణీ, సునీత, అనసూయ, శ్యామల, వసంత జయశీల, లత, చంద్రకళ, మమత, లావణ్య, భాగ్యలక్ష్మి, రేణుక, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

కబ్జాకు గురైన తన పట్టా భూమిని ఇప్పించండి

ప్రగతి భవన్లో ప్రజావాణిలో ఫిర్యాదు చేసిన బాధితుడు
నవతెలంగాణ-మనోహరాబాద్



తనకు చెందిన పట్టా భూమిని దౌర్జన్యంగా కబ్జా చేసిన వారిపై చర్యలు తీసుకుని తన భూమిని తనకు ఇప్పించాలంటూ శుక్రవారం హైదరాబాద్లోని ప్రగతి భవన్లో నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమంలో బాధితుడు దావూద్ అలీ ఫిర్యాదు చేశాడు. బాధితుని కథనం ప్రకారం వివరాలిలా ఉన్నాయి. మండలంలోని ముప్పిరెడ్డిపల్లి గ్రామ శివారులో సర్వే నంబర్ 51లో తన అన్నదమ్ములకు సంబంధించి పట్టా భూమి 4 ఎకరాల 8 గుంటల భూమి ఉండగా, అందులో తన వంతు వాటాగా రెండు ఎకరాల భూమి ఉన్నట్టు తెలిపారు. తాము ఇప్పటి వరకు పంపకాలు కానీ హద్దులు నిర్ణయించుకోలేదని తెలిపారు. కాగా తమ గ్రామానికి చెందిన అనంతరెడ్డి, సంజీవ, నర్సింహరెడ్డిలు కలిసి హైదరాబాద్కు చెందిన వ్యాపారికి భూమిని ఇప్పించి అందులోనే నిర్మాణ పనులను వారే కాంట్రాక్టుకు తీసుకున్నట్టు తెలిపారు. అందులో వారు తనకు తెలియకుండా తన భూమిని కబ్జాచేసి పరిశ్రమను నిర్మిస్తున్నారని తెలిపారు. తాను నిర్మాణ పనులను అడ్డుకున్నప్పటికి తనపై వారు కేసులను కూడా వేయిస్తు తనను ఇబ్బందులకు గురిచేస్తురని ఆవేదన వ్యక్తం చేశారు. అనుమతులు లేకుండా పనులు చేస్తున్నారని అధికారులకు ఫిర్యాదులు చేసినా పట్టించుకోవడం లేదని కబ్జాకు గురైన తన భూమిని తనకు ఇప్పించి న్యాయం చేయాలంటూ హైదరాబాద్లోని ప్రగతి భవన్లో నిర్వహించిన ప్రజావాణిలో పిర్యాదు చేసినట్టు దావూద్ అలీ తెలిపారు.

కవిత్వం పోటీలో జిల్లా స్థాయికి ఎంపికైన భార్గవి

నవతెలంగాణ-నర్సాపూర్



నర్సాపూర్ పట్టణంలోని జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో తొమ్మిదవ తరగతి చదువుతున్న భార్గవి శుక్రవారం మండల స్థాయిలో నిర్వహించిన కవిత్వం పోటీలలో రాణించి జిల్లా స్థాయికి ఎంపికయ్యారు. జిల్లా స్థాయికి ఎంపికైన భార్గవిని ఆమె తల్లిదండ్రులు కవిత ప్రభాకర్ చారి పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు.

జాతీయ సైన్స్ మండల స్థాయి పోటీల విజేతలు

నవతెలంగాణ-చేగుంట



విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలకు ఎదగాలని, పాఠశాలకు, తల్లిదండ్రులకు, మంచి పేరు తీసుకురావాలని మండల నోడల్ ఆఫీసర్ నీరజ అన్నారు. చేగుంట మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం జిల్లా విద్యాశాఖ అధికారి ఆదేశాల మేరకు మండల స్థాయి సైన్స్ పోటీలు నిర్వహించారు. ఈ ఉపన్యాస పోటీలో మొదటి స్థానం సాదియా (జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల చేగుంట), చిత్రలేఖనం విభాగంలో మొదటి స్థానం స్పందన (జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల చందాయిపేట్), పద్యము రచన విభాగంలో అఖిల మొదటి స్థానం (జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల చేగుంట), పాటల విభాగంలో మొదటి స్థానం నందిని (జిల్లా పరిషత్ పాఠశాల చందాయిపేట్)లు త్వరలో జిల్లాస్థాయి పోటీలో పాల్గొంటారని మండల నోడల్ ఆఫీసర్ నీరజ తెలిపారు. ఈ కార్యక్రమంలో సుధాకర్రెడ్డి, శ్రావంతి, శ్రీనివాస్, వాణి, సౌజన్య, మనోహర్, భవాని, నాగరాజు, సౌజన్య, చల్లా లక్ష్మణ్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆటోలో అసెంబ్లీకి వెళ్లిన ఎమ్మెల్యే సునీత రెడ్డి



నవ తెలంగాణ- నర్సాపూర్ : తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు జరుగుతున్నందున శుక్రవారం నర్సాపూర్ ఎమ్మెల్యే సునీత రెడ్డి ముషీరాబాద్లోని ఆమె నివాసం నుంచి ఆటో కార్మికుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని ప్లకార్డు పట్టుకొని ఆటోలో అసెంబ్లీ వరకు వెళ్లారు. మహిళలకు ఉచిత బస్సును తాను స్వాగతిస్తున్నానని ఆటో కార్మికులకు నెలకు పదివేలు ఇవ్వాలని, మరణించిన ఆటో కార్మికుల కుటుంబాలకు రూ.10 లక్షలు ఇవ్వాలని అసెంబ్లీలో ప్రసంగించారు.

మాజీ ప్రధాని పీవి నరసింహారావుకు భారతరత్న ఇవ్వడం పట్ల హర్షం

నవతెలంగాణ -పెద్ద శంకరంపేట్



కేంద్ర ప్రభుత్వం మాజీ ప్రధానమంత్రి పీవీ నరసింహారావుకు భారతరత్న పురస్కారం ప్రకటించడం పట్ల పెద్ద శంకరంపేట మండల బీజేపీ అధ్యక్షులు కోణం విట్టల్ శుక్రవారం హర్షం వ్యక్తం చేశారు. తెలుగు బిడ్డ అయిన పీవీ నరసింహారావును కాంగ్రెస్ ప్రభుత్వం ఏమాత్రం గుర్తించలేకపోయిందన్నారు. కాంగ్రెస్ పార్టీ కష్టకాలంలో ఉన్నప్పుడు పార్టీకి అండగా నిలబడిన వ్యక్తి పీవీ నరసింహారావు అని ఆయన పేర్కొన్నారు. అలాంటి వ్యక్తికి కాంగ్రెస్ పార్టీ ఏమి చేయలేక పోయిందని. తెలంగాణ ప్రాంతానికి చెందిన దివంగత మాజీ ప్రధాని పివి నరసింహారావుకు అత్యున్నత భారతరత్న పురస్కారం ప్రకటించడం పట్ల ప్రధానమంత్రి మోడీకి ప్రత్యేక అభినందనలు తెలుపుతున్నట్లు ఆయన తెలిపారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పీవీ నరసింహారావుకు భారతరత్న పురస్కారం ఇచ్చి అరుదైన గౌరవం లభించేలా చేసినందుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుకుంటున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మండల బీజేపీ నాయకులు బండల శ్రావణ్ కుమార్, మంగలి కృష్ణ, బొగడాల శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు.

ఏడుపాయల్లో భక్తులకు అన్నదానం

నవతెలంగాణ -పాపన్నపేట



ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన శ్రీఏడుపాయల వనదుర్గామాత సన్నిధిలో మాఘ అమావాస్య సందర్భంగా శుక్రవారం నాడు హైదరాబాద్ బల్కం పేటకు చెందిన దూసరి విజయ్ కుమార్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఏడు పాయలకు వచ్చిన భక్తులు భారీ సంఖ్యలో బారులు తీరారు.విజయ్ కుమార్ మాట్లాడుతూ ప్రతీ సంవత్సరం మాఘ అమావాస్య సందర్భంగా భక్తులకు అన్నదాన కార్యక్రమం చేపడుతున్నట్లు వెల్లడించారు. ఈకార్యక్రమంలో శంకర్ సింగ్, బాలాజీ, అనీల్ గౌడ్, శేఖర్ రెడ్డి, చంద్రశేఖర్ గౌడ్,కె.రాము ముదిరాజ్, వెంకటేష్ ముదిరాజ్, సత్యనారాయణ పాల్గొన్నారు.

మాజీ ఎంపిటిసి వెంకటయ్య హత్య కేసులో నిందితుల రిమాండ్

నవతెలంగాణ -నంగునూరు : సిద్దిపేట జిల్లా నంగునూరు మండలం ఘణపురం గ్రామం చెందిన మాజీ ఎంపీటీసీ బండి వెంకటయ్య హత్య కేసును చేధించి నిందితులను రిమాండ్కు తరలించినట్లు సిద్దిపేట రూరల్ సీఐ శ్రీనివాస్ తెలిపారు. శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ నెల మూడవ తేదిన నంగునూరు మండలం ఘణపుర్ గ్రామానికి చెందిన బండి వెంకటయ్యను కొందరు గుర్తుతెలియని వ్యక్తులు హత్య చేసినట్లు తెలిపారు. ఈ విషయంపై సాధారణంగా రోడ్డుపై పడి చనిపోయినట్లు కుటుంబ సభ్యులు గుర్తించి అనంతరం ఇంటికి తీసుకెళ్లిన మృతదేహన్ని అంత్యక్రియలు చేస్తున్న క్రమంలో శరీరంపై గాయాలు ఉండడంతో అనుమానం వచ్చి పోలీసులకు సమాచారం అందించి ఫిర్యాదు చేశారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు విచారణ జరపగా అదే గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ భర్త అయిన బత్తుల తిరుపతి తన బిడ్డకు మంత్రాలు చేస్తున్నాడని గత కొన్ని రోజులుగా బండి వెంకటయ్యపై కక్ష పెంచుకున్నాడు. అనంతరం నంగునూరు గ్రామానికి చెందిన ఆల్లెపు పరశురాములు, తాళ్లపల్లె సాయి గౌడ్లతో బండి వెంకటయ్యను చంపేందుకు ఐదు లక్షలు ఇస్తానని ఒప్పందం చేసుకున్నారు. ఈ నెల మూడున నంగునూరు నుంచి బండి వెంకటయ్య ఘణపుర్ గ్రామానికి వెళుతున్న క్రమంలో ఘణపూర్ చెక్డ్యాం వద్ద కాపు కాసిన నిందితులు తాళ్లపల్లి సాయి గౌడ్, తుపాకుల సాయి, గొడుగు అరవింద్, అల్లెపు రంజిత్లు కలిసి రోడ్డుపై ఆపి పథకం ప్రకారం గుడ్డను మెడకు చుట్టి బిగించి చంపేశారు. అనంతరం అతని మృతిని యాక్సిడెంట్గా చిత్రీకరించి పారిపోయినట్లు తెలిపారు. పోలీసుల విచారణలో వారు నేరం అంగీకరించినట్లు సిద్దిపేట రూరల్ సీఐ శ్రీనివాస్ తెలిపారు. విచారణ అనంతరం ముద్దాయిలైన ఐదుగురు నిందితులను రిమాండ్కు తరలించినట్లు తెలిపారు.

కార్మికుడి మరణానికి కారణమైన యజమాన్యంపై చర్యలు తీసుకోవాలి

సీఐటీయూ జిల్లా అధ్యక్షులు ఏ. మహేందర్ రెడ్డి
నవతెలంగాణ-మనోహరాబాద్



కార్మికుడి మరణానికి కారణమైన కాళ్లకల్ పారిశ్రామిక ప్రాంతంలోని లివన్ టేక్ బాండ్ పరుపుల తయారీ పరిశ్రమ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షులు ఏ. మహేందర్ రెడ్డి డిమాండ్ చేశారు. మనోహరాబాద్ మండలంలోని కాళ్లకల్ పారిశ్రామిక ప్రాంతంలో గతంలో అనేక పరిశ్రమలలో ప్రమాదాలు జరిగినా సంబంధిత శాఖ అధికారులు తనిఖీలు చేసి చర్యలు తీసుకున్న సందర్భాలు లేవని, అధికారుల నిర్లక్ష్యానికి శుక్రవారం జరిగిన జరిగి సంఘటన నిదర్శనమన్నారు. అనేక సార్లు సీఐటీయూ యూనియన్గా ప్రమాదాలు జరిగిన కంపెనీలపై చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు ఫిర్యాదులు చేసిన దున్నపోతు మీద వాన పడ్డట్టుగా అధికారులు వ్యవహరించారని ఆరోపించారు. అనేక పరిశ్రమలలో ఇతర రాష్ట్రాల కార్మికుల చేత పని చేయించుకొని వారికి కనీస వేతనాలు అమలు చేయకుండా, ఈఎస్ఐ, పిఎఫ్ సౌకర్యం కల్పించకుండా శ్రమదోపిడి చేస్తున్నారన్నారు. సేఫ్టీ సౌకర్యం కల్పించకుండా వలస కార్మికుల చట్టాన్ని అమలు చేయకుండా గొడ్డు చాకిరి చేయించుకుంటున్నారని ఆవేదన చెందారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి లివాన్ టేక్ బాండ్ పరుపుల తయారీ పరిశ్రమ యజమాన్యంపై చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. చనిపోయిన కార్మికునికి రూ.25 లక్షల నష్టపరిహాన్ని ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో సీఐటీయూ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామన్నారు.

కేసీఆర్ ఇలాఖాలో బీఆర్ఎస్కు ఎదురుదెబ్బ

మున్సిపల్కు చెందిన ఏడుగురు బీఆర్ఎస్ కౌన్సిలర్లు కాంగ్రెస్లో చేరిక
నవతెలంగాణ-మనోహరాబాద్



మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఇలాఖాలో బీఆర్ఎస్ పార్టీకి షాకుల మీద షాకులు తగులుతున్నాయి. ఇదివరకే సర్పంచ్లు, తూప్రాన్ మండల ఎంపీపీ, మనోహరాబాద్లో సర్పంచ్లు ఇలా చాలా వరకు కారు దిగి కాంగ్రెస్ గూటికి చేరుకుంటున్నారు. తాజాగా తూప్రాన్ మున్సిపల్కు చెందిన ఉద్యమకారులు ఆర్ శ్రీశైలంగౌడ్తో పాటు ఏడుగురు బీఆర్ఎస్ కౌన్సిలర్లు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్రెడ్డి, రాష్ట్ర రవాణ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ల సమక్షంలో సిద్దిపేట జిల్లా అధ్యక్షులు గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి ఆధ్వర్యంలో గురువారం సాయంత్రం కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా తూప్రాన్ మున్సిప ల్లో జరుగుతున్న అవినీతి అక్రమాలపైనే కాకుండా మున్సిపల్ చైర్మన్ చేస్తున్న అక్రమా లపై కూడా ముఖ్యమంత్రి రేవంత్రెడ్డికి తెలిపినట్టు సమాచారం. కాగా ఎలాగైనా మున్సిపల్లో జరుగుతున్న అవినీతి అక్రమాల ను అడ్డుకుని చైర్మన్ను గద్దెదింపాలనే లక్ష్యంతోనే బీఆర్ఎస్కు చెందిన ఏడుగురు కౌన్సిలర్లు కాంగ్రెస్ పార్టీలో చేరినట్టు తెలిసింది. ముఖ్యమంత్రిని కలిసిన వారిలో కౌన్సిలర్లు నందాల శ్రీనివాస్, రాజు, రవిందర్గౌడ్, చెలిమెల రఘుపతి, కొడిప్యాక నారాయణగుప్త, మామిండ్ల కృష్ణ, ఆర్ శ్రీశైలంగౌడ్ తదితరులు ఉన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు చిట్కుల్ మహిపాల్రెడ్డి, విశ్వరాజ్, భగవాన్రెడ్డి, పల్లెర్ల నవిందర్గుప్త, ఉమర్, అనిల్ తదితరులు ఉన్నారు.

శివరాత్రికి ఏడుపాయలకు సీఎం

మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంత్ రావు
నవతెలంగాణ-పాపన్నపేట



శివరాత్రి మహా జాతరకు ఏడుపాయలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని తీసుకొస్తానని మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు అన్నారు. తిరుపతి, యాదాద్రి, మాదిరిగానే ఏడుపాయలను అభివృద్ధి చేస్తానని మల్కాజిగిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంత్ రావు పేర్కొన్నారు. శుక్రవారం మాఘ అమావాస్య సందర్భంగా మైనంపల్లి హన్మంత్ రావు, శ్రీవాణి, దంపతులు అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం ఆయన విలేఖరులతో మాట్లాడారు. అంతకు ముందు ఆలయ పాలక మండలి చైర్మన్ బాలాగౌడ్, ఈఓ మోహన్ రెడ్డిలు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారి కటాక్షంతో తన కుమారుడు మెదక్ ఎమ్మెల్యే రోహిత్ రావు గెలుపొందారన్నారు. అమ్మవారి క్షేత్రాన్ని యాదాద్రి ఆలయం తరహాలో అభివృద్ధి పరిచేందుకు కృషి చేస్తామని. మహాశివరాత్రి జాతర ఉత్సవాలకు ప్రత్యేక నిధులు రూ.2కోట్ల నిధులు కేటాయించాలని, రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కోరినట్లు పేర్కొన్నారు. దీంతో ఆయన సానుకూలంగా స్పందించారని వెల్లడించారు. అతితక్కువ కాలంలోనే రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఏడుపాయల క్షేత్రం సందర్శనకు తీసుకు వస్తానన్నారు. గత పాలకులు ఏడుపాయల అభివృద్ధి కోసం రూ.100కోట్ల నిధులు మంజూరు చేశారని, తప్పుడు జిఓలు జారీ చేసారే తప్ప నిధులు కాగితాలకే పరిమితమయ్యాయని ఆరోపించారు. పదేళ్ళ పాలనలో ఏడుపాయల ఆలయాన్ని అభివృద్ధి చేయలేకపోయారని, నేటికీ శాశ్వత పనులు లేక పోవడంతో భక్తులు ఇబ్బందులు పడుతున్నారన్న విషయాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాలనలో ఏడుపాయల అభివృద్ధిని ఎల్లలు దాటెల కృషి చేస్తామన్నారు. ఏడుపాయల క్షేత్రంలో తన స్వంత నిధులతో జర్నలిస్టుల కోసం ప్రెస్ క్లబ్ భవనాన్ని ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు. ఆయన వెంట జిల్లా కిసాన్ సెల్ అధ్యక్షులు పబ్బతి ప్రభాకర్ రెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు గోవింద్ నాయక్, జిల్లా నాయకులు పి.ప్రశాంత్ రెడ్డి, మండల కో-ఆప్షన్ సభ్యులు ఎండి.గౌస్, ఆర్కెల జనార్ధన్ రెడ్డి, భరత్ గౌడ్, పార్శీ నర్సింలు గుప్తా, ఇంద్రసేనారెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, నరేందర్ రెడ్డి, ఆలయ ధర్మకర్తలు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

మాచవరంలో లోక్ అదాలత్

నవ తెలంగాణ-మెదక్ టౌన్



గ్రామ పంచాయితీ కార్యాలయం మాచవరం గ్రామంలో మెదక్లో లోక్ అదాలత్లో భాగంగా ఎఫ్ ఐ ఆర్, లీగల్ సర్వీసెస్, సివిల్, క్రిమినల్ కేసులకు సంబంధించి న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో న్యాయవాదులు కరుణాకర్, సిద్దిరాములు, శారదలు మాట్లాడుతూ లోక్ అదాలత్లో బాధితులు తమ సమస్యలను పరిష్కరించుకోవచ్చన్నారు. ప్రీ లీటిగేషన్ కేసుల గురించి మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాలు, వారికి సంబంధించిన చట్టాలు, గృహహింస చట్టాలు, హక్కులు, బాధ్యతలు మనోవర్తి, డ్రైవింగ్ లైసెన్స్, ఇన్సూరెన్సు, మైంటెనెన్సు కేసులు, సివిల్, క్రిమినల్ కేసుల గురించి వివరించారు. జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ ద్వారా ఉచిత న్యాయ సహాయం, సలహాలు అందించడం జరుగుతుందని వివరించారు. అందుకుగాను జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ, మెదక్ నందు న్యాయవాదిని, పారా లీగల్ వాలంటీర్ను నియమించిందని వివరించారు. ఈ సదస్సులో గ్రామ పంచాయతీ సెక్రటరీ, మాచవరం గ్రామం, మెదక్ పంచాయతీ సెక్రటరీ అశోక్, అనంతరావు, సోషల్ వర్కర్ డిడబ్ల్యూ లో బేటీ బచావో బేటీ పడావో మెంబర్ రమేష్, శ్రీనివాస్ చౌదరి, మాచవరం గ్రామ ప్రజలు, ఏఎస్ఐ శివకుమార్, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

11న క్రికెటర్స్ ప్రీమియర్ లీగ్ సీజన్-4

నవతెలంగాణ-మెదక్



కొండ శ్రీనివాస్ మెమోరియల్ సీనియర్ క్రికెటర్స్ ప్రీమియర్ లీగ్ సీజన్-4ను ఈ నెల 11వ తేదీ ఆదివారం మెదక్ పట్టణ జూనియర్ కాలేజ్ గ్రౌండ్లో నిర్వహిస్తున్నట్టు ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్ష, కార్యదర్శులు బివి శివ శంకర్ రావు, ఎంఎల్ఎన్ రెడ్డి, మెదక్ పట్టణ అధ్యక్షులు జుబేర్ పేర్కొన్నారు. శుక్రవారం మెదక్ పట్టణంలోని గుల్షన్ క్లబ్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ మెదక్ పట్టణానికి చెందిన 40 ఏళ్లు నిండిన పూర్వ క్రీడాకారులను ఒకే వేదిక పైకి తీసుకొచ్చి పాత జ్ఞాపకాలను గుర్తుచేయాలనే ఉద్దేశంతో ఈ పోటీలను నిర్వహించారు. 2020 నుంచి ప్రతి సంవత్సరం ఫిబ్రవరి నెలలో టోర్నమెంట్ నిర్వహించనున్నట్లు, ఇది నాలుగవ సీజన్ అని తెలిపారు. ప్రతి సంవత్సరం 12 జట్లు పాల్గొంటాయని, 200 మంది పూర్వ క్రీడాకారులతో పాటు వారి కుటుంబ సభ్యులు, క్రీడాకారులు, క్రీడా అభిమానులు మొత్తం 2000 మంది హాజరవుతారని తెలిపారు. 20 సంవత్సరాల క్రితం క్రికెట్ ఆడి వివిధ ప్రాంతాల్లో స్థిరపడిన 40 సంవత్సరాలు నిండిన పూర్వ క్రీడాకారులు ఆడుతుంటే వారి పిల్లలు మ్యాచ్ చూస్తూ సంతోషం వ్యక్తం చేస్తుంటారని తెలిపారు. ఒకే రోజు నిర్వహించబడే ఈ టోర్నమెంట్కు ముఖ్య అతిథిగా మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్తో పాటు కొండ శీనివాస్ కుటుంబ సభ్యులు, మున్సిపల్ చైర్మన్, కౌన్సిలర్లు, ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు, వివిధ పార్టీల నాయకులు హాజరుకానున్నట్లు తెలిపారు. క్రీడాకారులు, క్రీడా అభిమానులు పెద్ద ఎత్తున వచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సభ్యులు శేఖర్, అబ్దుల్లా, జగదీష్ పాల్గొన్నారు.

గుర్తుతెలియని వ్యక్తి దారుణ హత్య

మంటల్లో కాల్చేందుకు ప్రయత్నించి వదిలి వెళ్ళిన దుండగులు
నవతెలంగాణ- సిద్దిపేటరూరల్



గుర్తుతెలియని వ్యక్తిని హత్య చేసి ఆధారాలను నామరూపాలు లేకుండా చేసేందుకు ప్రయత్నించిన సంఘటన సిద్దిపేట రూరల్ మండల పరిధిలోని రాఘవపూర్ గ్రామ శివారు పిట్టలవాడ దరిదాపుల్లో చోటుచేసుకుంది. రూరల్ ఎస్సై కిరణ్ కుమార్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన గొర్రెల కాపరులు గొర్రెలు కాసేందుకు వెళ్ళిన సమయంలో గుర్తు తెలియని శవం కనబడడంతో పోలీసులకు సమాచారం అందించారని, వెంటనే ఏసీపి సురేందర్ రెడ్డి , సీఐ శ్రీనివాస్ తో కలిసి సంఘటన స్థలాన్ని పరిశీలించామని చనిపోయిన వ్యక్తి వయసు సుమారు 40 వరకు ఉంటుందని, హత్య కాపడ్డ వ్యక్తి వివరాలు తెలియ రాలేదని, హత్య చేసిన వారు వివరాలు కూడా తెలియలేదని అన్నారు. త్వరలోనే నిందితులను పట్టుకుంటామని ఎస్ఐ తెలిపారు.

అక్రమ ఇసుక రవాణా పై సిద్దిపేట టాస్క్ ఫోర్స్ పోలీసుల దాడులు

ప్రజ్ఞాపూర్, గౌరారంలో అనుమతిలేని ఇసుక డంపులు.
నిర్వాహకుల పై కేసు నమోదు
కేసు దర్యాప్తు చేస్తున్న సీఐ సైదా
నవతెలంగాణ-ప్రజ్ఞాపూర్



ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమ ఇసుక దందా చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని సిద్దిపేట టాస్క్ ఫోర్స్ పోలీసులు రమేష్, జానకి రాంరెడ్డి అన్నారు. శుక్రవారం ప్రజ్ఞాపూర్, గౌరారంలో అక్రమంగా డప్పు చేసిన ఇసుకను సీజ్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎలాంటి ప్రభుత్వ అనుమతి లేకుండా ప్రజ్ఞాపూర్ గ్రామ శివారు రాజీవ్ రహదారి, గౌరారం గ్రామ శివారు రాజీవ్ రహదారి పక్కన అక్రమంగా డంపు చేసిన ఇసుకను పట్టుకున్నమన్నారు. ప్రజ్ఞాపూర్, గౌరారం శివారులో ఎలాంటి ప్రభుత్వ అనుమతి లేకుండా ఇసుక డంపు చేశారని, నమ్మదగిన సమాచారం పై సిబ్బంది తో వెళ్లి ఇసుక డంపులను గుర్తించమన్నారు. ఈ అక్రమ ఇసుక డంపులను గజ్వేల్, గౌరారం పోలీసులకు అప్పగించామన్నారు. సంబంధిత పోలీసులు కేసు నమోదు చేసి పరిశోధన ప్రారంభించారన్నారు. ఇసుక డంపు చేసిన నిందితుల వివరాలు గుడికందుల నరేందర్, ప్రజ్ఞాపూర్ గ్రామం, గుడికందుల గణేష్, దాతర్ పల్లి, బక్కల యాదగిరి, రాయవరం, మండలం కుకునూరుపల్లి, శ్రీరామ్ కృష్ణ, గ్రామం ప్రజ్ఞాపూర్, గోపాల్ కృష్ణ, గ్రామం దాతర్ పల్లి,మామిండ్ల స్వామి, గ్రామం వర్గల్ గా గుర్తించామన్నారు. సంబంధిత తాసిల్దారులు పంచనామ నిర్వహించి, తగు చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. అంతేకాకుండా ఎలాంటి ప్రభుత్వ అనుమతి లేకుండా ఇసుక, పిడిఎస్ రైస్, అక్రమ రవాణా చేసిన,పేకాట, జూదం, గంజాయి, మత్తు పదార్థాలు విక్రయించిన మన చర్యలు తీసుకుంటామన్నారు. చట్ట వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడుతున్నటువంటి వారి సమాచారం ఉంటే వెంటనే డయల్ 100, సిద్దిపేట టాస్క్ ఫోర్స్ ఆఫీసర్స్ 8712667447, 8712667446, నెంబర్లకు సమాచారం అందించాలని కోరారు. సమాచారం అందించిన వారి పేర్లను గోప్యంగా ఉంచుతామని అధికారులు పేర్కొన్నారు.

మాఘ అమావాస్య రోజున విషాదం

వాగులోకి స్నానానికి వెళ్లిన వ్యక్తి గలంతు
నవ తెలంగాణ-మిరుదొడ్డి



మాఘ అమావాస్య రోజున విషాదం చోటుచేసుకుంది. దైవ దర్శనం కోసం కూడవెల్లి వాగులోకి స్నానానికి వెళ్లిన వ్యక్తి గల్లంతైన ఘటన మిరుదొడ్డిలో చోటు చేసుకుంది. మిరుదొడ్డి శివారులో శ్రీ సీతారామస్వామి ఆలయం వద్ద మాఘ అమావాస్యను పురస్కరించుకొని స్వామివారిని దర్శించుకోవడానికి వెళ్లిన వ్యక్తి కూడవెల్లి వాగులో గంగా స్నానం ఆచరిస్తున్న సమయంలో వాగులో గల్లంతయ్యాడు. అక్కడే ఉన్న స్థానికులు గమనించి స్వామిని ఒడ్డుకు చేర్చే ప్రయత్నం చేసినప్పటికీ విఫలమయ్యింది. వెంటనే స్థానికులు పోలీసులకు సమాచారం అందించడంతో హుటాహుటిన అక్కడికి చేరుకున్న పోలీసులు స్వామి కోసం గాలింపు చర్యలు చేపట్టారు. సాగునీటి కోసం మల్లన్న సాగర్ ద్వారా గత వారం రోజుల క్రితం వాగులోకి నీటిని విడుదల చేసిన విషయం తెలిసిందే. కూడవెల్లి వాగు ఉధృతంగా ప్రవహిస్తున్న విషయాన్ని గమనించని స్వామి వాగులోకి స్నానం కోసం వెళ్లడంతో నీటి ప్రవాహానికి కొట్టుకు పోయాడని స్థానికులు తెలిపారు. స్వామి కోసం స్థానికులు,పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు.

వల్లంపట్లలో సీసీ రోడ్డు పనులు ప్రారంభం



నవతెలంగాణ-మద్దూరు: మండలం వల్లంపట్ల గ్రామంలో ఎస్సీ కాలనీలో తాజా మాజీ సర్పంచ్ ఆలేటి రజిత యాదగిరి శుక్రవారం సిసి రోడ్డు పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ రజిత మాట్లాడుతూ పాలకవర్గం తీర్మానం చేసిన గ్రామపంచాయతీ నిధులతో సిసి రోడ్డు వేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు

విద్యార్థులకు బహుమతుల ప్రదానం

నవతెలంగాణ-మర్కుక్



రాష్ట్ర స్థాయిలో నిర్వహించిన ఆర్ఎస్బీఎస్వీపి 2023 (సైన్స్ ఫెయిర్) పోటీల్లో జూనియర్ విభాగంలో. వ్యవసాయం ఉప అంశంలో రాష్ట్ర స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచిన దామరకుంట ఉన్నత పాఠశాల విద్యార్థిని బి.సుష్మను గైడ్ టీచర్ వై.చిన్నబ్రహ్మయ్య అభినందించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు, వెంకట రాములు, సీనియర్ ఉపాధ్యాయులు వి.రమేష్ ఎస్ఎంసీ చైర్మన్, ఉపాధ్యాయ బృందం ప్రథమ బహుమతి పొందిన విద్యార్థినీ. గైడ్ టీచర్‌కు అభినందనలు తెలిపారు.

బీజేపీ ప్రభుత్వ మతతత్వ విధానాలను ప్రతిఘటిద్దాం

- 1996 భవన నిర్మాణ కార్మిక చట్టాన్ని, 1979 వలస కార్మికుల చట్టాన్ని రక్షించుకుందాం
- 16న దేశవ్యాపిత కార్మిక కర్షకుల సమ్మె
- సిద్దిపేట జిల్లా బిల్డింగ్ అదర్ కన్స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) జిల్లా ప్రధాన కార్యదర్శి చొప్పరి రవి కుమార్



నవతెలంగాణ-మద్దూరు

తెలంగాణ రాష్ట్రంలోని భవన ఇతర నిర్మాణ కార్మికులంతా ఫిబ్రవరి 16వ తేదిన నిర్వహించే గ్రామీణ భారత్ బంద్‌లో పాల్గొని జయప్రదం చేయాలని సిద్దిపేట జిల్లా బిల్డింగ్, అదర్ కన్స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) జిల్లా ప్రధాన కార్యదర్శి చొప్పరి రవి కుమార్ కార్మిక వర్గానికి విజ్ఞప్తి చేశారు. మండలంలోని జాలపేల్లి గ్రామంలో భవన నిర్మాణ కార్మికులతో కలిసి కరపత్రాన్ని ఆవిష్కరించిన అనంతరం ఆయన మాట్లాడారు. బిజెపి ప్రభుత్వం అధికారంలోకొచ్చి 10 సంవత్సరాలైందని, అయినా కార్మికుల, రైతుల, సామాన్య ప్రజల సమస్యలు పరిష్కరించకపోగా ఇంకా సమస్యలు పెరిగాయన్నారు. భారత్ వెలిగిపోతోంది, అచ్చాదిన్ ఆయేగా, విశ్వగురు ఆత్మనిర్భర్, భారత్ మేకిన్ ఇండియా వంటి మోసపూరిత నినాదాలతో పరిపాలన కొనసాగిస్తోందన్నారు. సంవత్సరానికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని చెప్పింది కానీ నిరుద్యోగం 50 సంవత్సరాల గరిష్టానికి పెరిగిందన్నారు. కార్మికుల నిజ వేతనాలు 20 శాతం పడిపోయాయన్నారు. నరేంద్ర మోడీ అధికారంలోకి వచ్చిన తర్వాత కార్మికవర్గం పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను రద్దుచేసి 4 లేబర్ కోడ్లుగా మార్చిందన్నారు. బీజేపీ అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో ఇప్పటికే 8 నుండి 12 గంటల పని విధానం అమలు చేస్తోందన్నారు. భవన నిర్మాణ కార్మికుల 1996 చట్టం, వలస కార్మికుల 1979 చట్టం రద్దయిందన్నారు. దీంతో దేశవ్యాప్తంగా 10 కోట్ల కార్మికులు, రాష్ట్రంలో 25 లక్షల నిర్మాణరంగ కార్మికులకు పోరాడి సాధించుకున్న హక్కులు హరించుకుపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలపై దేశవ్యాప్తంగా తలపెట్టిన గ్రామీణ భారత్ బంద్‌లో భవన నిర్మాణ కార్మికులంతా పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కరపత్ర ఆవిష్కరణ కార్యక్రమంలో సీఐటీయు దూలిమిట్ట మండల కన్వీనర్ పోతిరెడ్డి రాజు, స్వామి, రాజు, బాలయ్య పాల్గొన్నారు.

ప్రాక్టికల్ పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేసిన డీఐఈఓ



నవతెలంగాణ-సిద్దిపేట

ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షా కేంద్రాన్ని డీఐఈఓ సూర్య ప్రకాష్ శుక్రవారం తనిఖీ చేశారు. టీఎస్ ఆర్‌జెసిలో ప్రాక్టికల్ పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేసి, ప్రాక్టికల్ పరీక్షలు ప్రశాంతంగా జరుగుతున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ విష్ణువర్ధన్ రెడ్డి పాల్గొన్నారు.

ఈవీఎంలను పరిశీలించిన కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్

నవతెలంగాణ-సిద్దిపట కలెక్టరేట్



ఎలక్షన్ కమిషన్ ఆఫ్ ఇండియా నిబంధనలు తప్పనిసరిగా పాటిస్తూ ఈవీఎంల ఫస్ట్ లెవల్ చెకింగ్ జరపాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ప్రశాంత్ జే పాటిల్ అధికారులకు తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్ ప్రక్కన గల ఈవీఎం గోదాంలో జరుగుతున్న ఈవీఎం మీషన్‌ల ఫస్ట్ లెవల్ చెకింగ్ పనులను జిల్లా అదనపు కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డితో కలిసి జిల్లా ఎన్నికల అధికారి క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ముందుగా ఈవీఎం మీషన్లు భద్రపరిచే స్ట్రాంగ్ రూంలను పరిశీలించారు. ఎలక్షన్ కమిషన్ ఆఫ్ ఇండియా మార్గదర్శకాల ప్రకారం స్ట్రాంగ్ రూంల బయట సిసి కెమెరాల అమరికలో కొంత మార్పులు చేయాలని ఎలక్షన్ సూపరిండెంట్ రామేశ్వర్‌కి సూచించారు. ఎఫ్ఎల్‌సి హల్ లో ప్రత్యేక గుర్తింపు కార్డు, ఫోన్ బయట డిపాజిట్, డోర్ ఫ్రేమ్ మేటల్ డిటెక్టర్, హండ్ ఎల్డ్ మెటల్ డిటెక్టర్ ద్వారా పూర్తిగా పరిశీలించాకే లోనికి వంపాలన్నారు. అలాగే గోదాం చుట్టు గట్టి బందోబస్తు ఏర్పాటు చేయాలని పోలీస్ అధికారులకు తెలిపారు. ఈవీఎం మిషన్ చెకింగ్‌లను జాగ్రత్తగా అత్యంత పకడ్బందీగా జరపాలని 13 మంది టెక్నికల్ ఇంజనీర్ల బృందంకు తెలిపారు. ప్రతిది ఈసీఐ నిబంధనల ప్రకారమే జరపాలని తెలిపారు. ఎఫ్ఎల్‌సి లాగ్ బుక్, స్ట్రాంగ్ రూం లాగ్ బూక్, ఈవిఎం గోదాం విజిటర్ రిజిస్టర్‌లను పరిశీలించి సంతకం చేశారు. గోదాం చుట్టూ మైనర్ రిపేర్లను త్వరగా పూర్తి చేయాలని ఆర్ అండ్ బి డిఈని ఆదేశించారు.

గురు కులాల మీద కుట్ర

- సెర్వోస్ నెట్వర్క్ సిద్దిపేట జిల్లా ప్రధాన కార్యదర్శి చిన్నికృష్ణ



నవతెలంగాణ -గజ్వేల్

మాజీ ఐపీఎస్ ప్రవీణ్ కుమార్ కృషితో గురుకులాలు అభివృద్ధి చెందాయని, ఇప్పుడు గురుకులాలపైనే కుట్ర జరుగుతుందని సెర్వోస్ నెట్వర్క్ సిద్దిపేట జిల్లా ప్రధాన కార్యదర్శి చిన్నికృష్ణ అన్నారు. శుక్రవారం గజ్వేల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కనివిని ఎరగని రీతిలో ఒక దశాబ్ద కాలంలోనే గురుకులంలో చదువుకున్న పిల్లలు అన్ని రంగాల్లో ముందుకు వచ్చారంటే ప్రవీణ్ కుమార్ కృషియేనన్నారు. గురుకులాల విద్యార్థులను ఉన్నత స్థాయికి తీసుకుపోయినట్లు ఆయన గుర్తు చేశారు. కాగా ఇటీవల గురుకులాలపై కుట్రలు జరుగుతున్నట్లు ఆయన ఆవేదన చెందారు. రాష్ట్రంలో గురుకుల విద్యకు కార్పొరేట్ కన్నా ఎక్కువ డిమాండ్ ఉండడంతో రాష్ట్రవ్యాప్తంగా అలజడి సృష్టించి కోటి ఆశలతో ఉన్న విద్యార్థుల నోటిలో మట్టి కొట్టే ప్రయత్నం జరుగుతుందన్నారు. విద్యార్థులు ఆత్మహత్య చేసుకోవడమేమిటని ఆయన ప్రశ్నించారు. భువనగిరి ఎస్సి గురుకుల హాస్టల్‌లో జరిగిన సంఘటన మీద ప్రభుత్వం స్పందించడం లేదన్నారు. గురుకులాల్లో జరిగిన సంఘటనను నీరు కార్చేందుకు కుట్ర చేస్తుందన్నారు. చించోలి మైనార్టీ గురుకుల పాఠశాలలో విద్యార్థులు ఘర్షణపడి కొట్టుకొని అబ్బాబ్ హైమద్ అనే బాలుడు ప్రాణాలు కోల్పోవడం బాధాకరమన్నారు. గురుకులాల్లో ఘర్షణ వాతావరణం తీసుకొస్తున్నారని, దీనిని నివారించాలని ఆయన కోరారు.

బాల్క సుమన్ క్షమాపణ చెప్పాలి

నవతెలంగాణ-గజ్వేల్



రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై పిచ్చి కూతలు కూసిన మాజీ ఎంపీ బాల్క సుమన్ వెంటనే క్షమాపణ చెప్పాలని మండల కాంగ్రెస్ నాయకులు గజ్వేల్ మహేష్ డిమాండ్ చేశారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ కుటుంబానికి బానిసగా పనిచేస్తున్న సుమన్ ఇతరులపై ఇష్టానుసారంగ మాట్లాడితే కేసీఆర్ వద్ద మార్కులు పడతాయని చూస్తున్నట్లు కనిపిస్తుందన్నారు. సీఎం రేవంత్ రెడ్డికి క్షమాపణ చెప్పి తీరాలని ఆయన డిమాండ్ చేశారు. అదేవిధంగా మాజీ మంత్రి కేటీఆర్, హరీష్ రావులు కూడా నోరు అదుపులో పెట్టుకొని మాట్లాడాలని ఆయన కోరారు.

హిందూవాహిని జిల్లా సహ వీధి ప్రముఖ్‌గా మధుసూదన్ రెడ్డి



నవతెలంగాణ-సిద్దిపేట

హిందూ వాహిని జిల్లా సహ వీధి ప్రముఖ్‌గా మధుసూదన్ రెడ్డిని నియమించినట్లు జిల్లా సంయోజక్ బస్వరాజు సత్యం తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ సమాచార సేకరణ ప్రముఖ్ రుద్రోజ్ శ్రీనివాస్ ముఖ్య అతిథిగా వచ్చి జిల్లా వీధి అడ్వకేట్ సహ ప్రముఖ్‌గా మధుసూదన్ రెడ్డిని ఎన్నుకోవడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రాంత సహసంయోజక్ శివాజీ గణేష్, జిల్లా సహసంయోజక్ బండి కిరణ్ కుమార్, జిల్లా విధి ప్రముఖ ప్రదీప్ పాల్గొన్నారు.

జనసంద్రమైన సింగరాయ కొండ

- జాతరలో వంకాయ కూర, చింతపండు చారు ప్రత్యేకం
- భక్తులతో కీటకిటలాడిన అడవి ప్రాతం
- లక్ష్మీనరసింహ స్వామి గోవింద అంటూ మర్మోగిన గుట్టలు



నవతెలంగాణ-కోహెడ

కోహెడ మండలంలోని కూరెల్ల, తంగళ్లపల్లి గ్రామాల శివారులో జరిగిన ప్రతాపరుద్ర సింగరాయ లక్ష్మీనరసింహ జాతర భక్తులతో శుక్రవారం జనసంద్రమైంది. ఈ జాతర ప్రతి యేటా పుష్య బాహుళ అమవాస్య రోజు సూర్యోదయంతో మొదలై సూర్యాస్తమయం వరకు జరుగుతుంది.ఈ జాతరకు తెలంగాణ రాష్ట్రం నుంచే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. లక్షకు పైగా భక్తులు తరలిరావడంతో సింగరాయ జాతర కిటకిటలాడింది. ఈ ప్రాంతంలో కొండ చరియలు చెట్ల వేళ్ళ అంచులను తాకుకుంటు జాలువారే నది ఉంటుంది. ఈ నదిలో స్నానం చేస్తే పుణ్యాలు హరించడంతో పాటు చర్మవ్యాధులు నశిస్తాయని భక్తుల నమ్మకం. దీంతో ఈ నదిలో స్నానాలు చేసి గుట్ట సాధికాలో ఉన్న స్వామి వారిని దర్శించుకున్నారు. మమ్మేలు స్వామి లక్ష్మిన రసింహ స్వామి గోవింద అంటు స్వామి నామస్మరణంతో ఆ ప్రాంతం అంతా మారుమ్రోగింది. తంగళ్లపల్లి, కూరెల్ల గ్రామాల మధ్య జాతర హద్దుల వివాదం ఉండటంతో రెవెన్యూ, పోలీసుల ఆధ్వర్యంలో జాతర నిర్వహించారు. కాగ జాతరలో ప్రత్యేకంగా పచ్చని చెట్ల కింద స్వామి వారికి నైవేద్యం సమర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులు సహపంక్తి భోజనాలు చేశారు. ఉదయం ఐదు గంటలకే ఆర్చకులతో ఆదిశేఖ పూణ్యలతో జాతర ప్రారంభమైంది. కాగ అధికారులు పూర్తి స్థాయిలో ఏర్పాట్లు చేయకపోవడంతో భక్తులు ఇబ్బందులు పడ్డారు.

బాహు భాషా కోవిదులు పీవీ

- మున్సిపల్ చైర్మన్ ఎన్సీ రాజమౌళి



నవతెలంగాణ-గజ్వేల్‌శ్రీ: భాహు భాషా కోవిదులు మాజీ ప్రధాని పీవీ నరసింహారావు అని గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ చైర్మన్ ఎన్సీ రాజమౌళి అన్నారు. శుక్రవారం పార్లమెంటులో పీవీకి భారతరత్న అవార్డు ప్రకటించడంతో పలువురు నేతలు హర్షం వ్యక్తం చేశారు. తెలంగాణ ముద్దుబిడ్డ, తెలంగాణ తేజం అపర చాణుక్యుడు రాజకీయ దురంధరుడు, దేశ ఆర్థిక వ్యవస్థకు జీవం పోసిన పీవీ నరసింహారావుకు భారతరత్న దక్కడం గొప్ప విషయమన్నారు. గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పాలకవర్గం తరఫున కేంద్ర ప్రభుత్వానికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. గతంలో ఏ ప్రభుత్వం కూడా ఈ నిర్ణయం తీసుకోలేదన్నారు. ప్రధానమంత్రి మోడీ ఈ నిర్ణయం తీసుకోవడం పట్ల రాష్ట్రం గర్విస్తుందన్నారు.

సబ్బు బిళ్ళ మీద పీవీ చిత్రం

నవతెలంగాణ-గజ్వేల్



సబ్బు బిళ్ళ మీద మాజీ ప్రధానమంత్రి పీవీ నరసింహారావు చిత్రాన్ని రామకోటి రామరాజు చేతుల మీదుగా చిత్రీకరించారు. శుక్రవారం పార్లమెంటులో ప్రధానమంత్రి మోడీ మాట్లాడుతూ పీవీ నరసింహారావుకు భారతరత్న ఇస్తున్నట్లు ప్రకటించడంతో రామరాజు హర్షం వ్యక్తం చేశారు. అంతేకాకుండా సబ్బు బిళ్ళపై చిత్రాన్ని చిత్రీకరించి ఘనంగా నివాళులు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాజీ ప్రధాని పీవీ నరసింహారావు హయాంలో ఆర్థిక సంస్కరణలు ప్రవేశపెట్టినట్లు ఆయన గుర్తు చేశారు.

మాజీ జెడ్పీటీసీని పరామర్శించిన టీపీసీసీ ఉపాధ్యక్షులు

నవతెలంగాణ-చేర్యాల



చేర్యాల పట్టణ కేంద్రానికి చెందిన మాజీ జెడ్పీటీసీ కొమ్ము నర్సింగరావు తల్లి లక్ష్మీ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న టీపీసీసీ ఉపాధ్యక్షులు చామల కిరణ్ కుమార్ రెడ్డి శుక్రవారం మృతురాలి చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి, ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు చెవిటి లింగం, సందుల సురేష్,కాంగ్రెస్ నాయకులు ఉట్లపల్లి శ్రీనివాస్, కాటం మల్లేశం, ఎలుగల దుర్గయ్య, ఎండి. కాజా,అంబాల నాగేశ్వర్ గౌడ్, బండెల మైపాల్ రెడ్డి, ఎలుగల నాగరాజు, పోతిగంటి ప్రసాద్, తుమ్మ శ్రీనివాస్, శ్రీకాంత్, తాటిపాముల పరశురాములు, బుట్టి యాదగిరి, వెలగల రాజు, పచ్చిమడ్ల వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

రేబర్తిలో ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమం



నవతెలంగాణ-మద్దూరు

మండలంలోని రేబర్తి గ్రామంలో ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాన్ని నిర్వహించినట్లు.పంచాయతీ కార్యదర్శి మధవ్ జాదవ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమంలో భాగంగా శుక్రవారం డ్రైడే ఫ్రైడే కార్యక్రమాన్ని నిర్వహించినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో పల్లె ఆస్పత్రి డాక్టర్ ప్రతిభ, ఆశా కార్యకర్తలు యశోద, కవిత, కనకలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

సమస్యలపై నిరంతర పోరాటం చేస్తున్న పీఆర్‌టీయూ

నవతెలంగాణ-గజ్వేల్



రాష్ట్రంలో ఉపాధ్యాయ సమస్యలపై నిరంతరంగా పీఆర్‌టీయూ ఉపాధ్యాయ సంఘం పోరాటం సాగిస్తుందని గజ్వేల్ మండల శాఖ అధ్యక్షులు ఊడేము వేమారెడ్డి, ప్రధాన కార్యదర్శి తిగుల్ల లింగం గౌడ్ అన్నారు. పీఆర్‌టీయూ సంఘం ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా శుక్రవారం జెండావిష్కరణ కార్యక్రమాన్ని గజ్వేల్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 1971లో స్థాపించిన పీఆర్టియు సంఘం ఉపాధ్యాయుల సమస్యలను ఎన్నో పరిష్కరించి వారి జీవన ప్రమాణాన్ని మెరుగుపరిచిందని వారు తెలిపారు. ఉపాధ్యాయులకు ప్రభుత్వం నుంచి ఎన్నో జీవోలను సాధించిపెట్టిందన్నారు. ఇకముందు కూడా ఉపాధ్యాయులకు ప్రధాన సమస్యలైనా సీపీఎస్ రద్దు, బదిలీలు, పదోన్నతుల ప్రక్రియను కొనసాగించడం, పెండింగ్‌లో ఉన్న బిల్లులను మంజూరు చేయించడంలో ప్రత్యేక పాత్ర పోషిస్తుందన్నారు. ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి కృషి చేసిందని వారు గుర్తు చేశారు. అనంతరం ఎమ్మెల్సీ కే.ఆర్.రెడ్డి జన్మదిన సందర్భంగా పత్రికా సంపాదకవర్గసభ్యులు జయపాల్ రెడ్డి, గజ్వేల్ మండల ఎంఎన్ఓ వై కృష్ణ, గజిటెడ్ ప్రధానోపాధ్యాయుడు బసవరాజు, భాస్కర్, మాజీ మండల ప్రధాన కార్యదర్శి నాగేంద్రరావులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు కనక రాములు, బాల్ చరణ్, శ్రీనివాసరావు, పోచయ్య, సత్యనారాయణ రెడ్డి, యాదగిరి, నాగరాజు, వెంకటేశం, భూపతి రెడ్డి, గురూజీ వేణు, శోభ, బషీరుద్దీన్, జానకి రామ్ రెడ్డి, బ్రహ్మరెడ్డి, రాజు, శ్రీనివాస్, నరసింహారెడ్డి, భూపాల్ రెడ్డి, బిల్లా శ్రీనివాస్, జీవన్ రెడ్డి, ప్రతిభా రాణి, నాగేందర్ రావు తదితరులు పాల్గొన్నారు.

బైరాన్ పల్లి కాంగ్రెస్ గ్రామ యూత్ కమిటీల ఎన్నిక

నవతెలంగాణ-మద్దూరు



దూళ్మిట్ట మండలంలోని బైరాన్‌పల్లి గ్రామంలో యూత్ కమిటీలను ఎన్నిక జరిగింది. జనగామ కాంగ్రెస్ పార్టీ డీసీసీ అధ్యక్షుడు నియోజకవర్గ ఇంచార్జ్ కొమ్మూరి ప్రతాప్ రెడ్డి ఆదేశాల మేరకు గురువారం గ్రామ యూత్ కమిటీలను వేసినట్లు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బండి శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. కాంగ్రెస్ పార్టీ గ్రామ యూత్ కమిటీలను కొమ్మూరి ప్రతాపరెడ్డి, మద్దూరు జడ్పిటిసి గిరి కొండల్ రెడ్డి ఆదేశాల మేరకు కమిటీలను వేసినట్లు ఆయన తెలిపారు. గ్రామ శాఖ అధ్యక్షునిగా కొలిపాక ఉపేందర్, ఉపాధ్యక్షులుగా కన్నారపు రమేష్, కుందారం చంద్రం, యూత్ అధ్యక్షునిగా కొత్తపల్లి బాపురాజు, ఉపాధ్యక్షులు నాగిళ్ల గణేష్‌లతో కమిటీలు వేసినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నిరాశ్రయుల ఆశ్రమంలో అన్నదానం



నవతెలంగాణ-సిద్దిపేట

అమావాస్య సందర్భంగా వాసవి యూత్ క్లబ్ ఆధ్వర్యంలో వైశ్య భవన్ గోశాలలో గోసేవ, బుక్క యశస్వి పుట్టినరోజు సందర్భంగా పట్టణ నిరాశ్రయుల ఆశ్రమంలో అన్నదానం జరిగిందని వాసవి యూత్ క్లబ్ అధ్యక్షుడు అర్వపల్లి హరికిరణ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో బుక్క శివ సంతోష్, చొక్కారపు శ్రీధర్, రవి, దుర్గయ్య, వీరేశం తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో విజేతలుగా నిలవాలి

నవతెలంగాణ-సిద్దిపేట



రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో విజేతలుగా నిలవాలని స్పోర్ట్స్ క్లబ్ కన్వీనర్ పాల సాయిరాం క్రీడాకారులను కోరారు. జిల్లా అథ్లెటిక్స్ సంఘం కార్యాలయంలో కొత్తగూడెంలో శనివారం జరిగే రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్‌కు వెళ్లే జిల్లా క్రీడాకారులకు క్రీడా దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రస్థాయి పోటీల్లో బాగా రాణించి విజేతలుగా నిలవాలని ఆకాంక్షించారు. క్రీడా దుస్తుల దాత బెజ్జంకి జెడ్పిటిసి కానగండ్ల కవిత తిరుపతిని అభినందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్‌జిఎఫ్ కార్యదర్శి పన్యాల రామేశ్వర్ రెడ్డి, జిల్లా సైకిల్ అసోసియేషన్ అధ్యక్షులు బందారుపల్లి శ్రీనివాసులు, జిల్లా అథ్లెటిక్స్ సంఘం ప్రధాన కార్యదర్శి కర్రోల్ల వెంకట స్వామి గౌడ్ , జిల్లా రెజ్లింగ్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కడకంచి ఉప్పలయ్య జిల్లా ప్రవేట్ వ్యాయామ ఉపాధ్యాయుల అధ్యక్షులు బయ్యారపు కనక రెడ్డి, కోచ్‌లు కృష్ణ కుమార్, నిశాంక్ గౌడ్, విజయ్, స్వామి, తదితరులు పాల్గొన్నారు.

గ్రామాలను సందర్శించిన మండల ప్రత్యేక అధికారి

నవతెలంగాణ-హుస్నాబాద్ రూరల్



మండల ప్రత్యేక అధికారి, బీసీ వెల్ఫేర్ జిల్లా అధికారి సరోజ శుక్రవారం గాంధీనగర్ మిర్జాపూర్‌తో పాటు పలు గ్రామాలలో సందర్శించారు. గాంధీనగర్, మీర్జాపూర్ గ్రామ పంచాయతీని సందర్శించి ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలు, యూపీఎస్ పాఠశాల, అంగన్‌వాడీ పాఠశాల, నర్సరీ, మహాలక్ష్మి ఎల్‌పీజీ సిలిండర్ సర్వేను పరిశీలించారు. పారిశుద్ధ్య కార్యక్రమాలపై సూచనలు చేశారు. స్కూల్ పిల్లలకు ఆరోగ్యం, పోషకాహారం, విద్య బోధనలపై సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో పంచాయితీ కార్యదర్శి హారిక, మీర్జాపూర్ పంచాయతీ కార్యదర్శి శారద తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పని ప్రదేశాన్ని పరిశీలించిన ఎంపీడీవో



నవతెలంగాణ-మర్కుక్

మండల పరిధిలోని చేబర్తి గ్రామంలో చేపట్టిన ఉపాది హామీ పథకం ద్వారా చేపట్టిన పనులను మర్కుక్ ఎంపీడీవో ప్రవీణ్, ఉపాదిహామీ ఈసీ రాజు శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాది హామీ కూలీలకు పనికి తగిన వేతనం ఇవ్వటం జరుగుతుందన్నారు. కూలీలు పని ఎక్కువ చేసి పనికి తగిన కూలి తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కూలీలు తదితరులున్నారు.

శివాజీ విగ్రహ పునప్రతిష్ట వాల్ పోస్టర్ ఆవిష్కరణ



నవతెలంగాణ-సిద్దిపేట: ఛత్రపతి శివాజీ జయంతి సందర్భంగా సిద్దిపేట పట్టణం వెంకటేశ్వర ఆలయం వద్ద 19న ఛత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహ పునః ప్రతిష్ట , బైక్ ర్యాలీ కార్యక్రమాలను నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించిన వాల్ పోస్టర్, కరపత్రాలను హిందూ వాహిని ప్రాంత సదస్యులు సమాచార సేకరణ ప్రముఖ్ రుద్రోజు శ్రీనివాస్ శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా హిందూ వాహిని సిద్దిపేట జిల్లా సంయోజక్ బస్వరాజు సత్యం మాట్లాడుతూ 19న జరిగే బైక్ ర్యాలీని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు శివాజీ గణేష్, బండి కిరణ్ కుమార్, ప్రదీప్ కుమార్, మధు సుధన్ రెడ్డి, డి.రాజు, పరశురాములు, లక్ష్మణ్, అజయ్, రాజు, మాధవరెడ్డి, వీరేశం పాల్గొన్నారు.

నాగ మానస దేవి వార్షికోత్సవం



నవతెలంగాణ-నంగునూరు: స్వయం భూ నాగమానస దేవి వార్షికోత్సవం సందర్భంగా శుక్రవారం నంగునూరు మండల కేంద్రంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రతియేటా అమావాస్య రోజున ప్రత్యేక పూజలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. గ్రామ పురోహితులు ఆదిరాల సాయినాథ్ శర్మ అమ్మవారికి అభిషేకంతో పాటు పూజలు నిర్వహించారు. ఆలయ పూజారి ఆనందచారి పాల్గొనగా భక్తులు మొక్కులు సమర్పించుకున్నారు.

అభివృద్ధి పనులకు టెండర్లు పిలవండి



• మున్సిపల్ చైర్ పర్సన్

నవతెలంగాణ-దుబ్బాక: గత ప్రభుత్వ హయాంలో మంజూరైన రూ.10 కోట్ల టీయుఎఫ్ఐడీసీ నిధులకు టెండర్ల ప్రక్రియను వెంటనే ప్రారంభించాలని కోరుతూ దుబ్బాక మున్సిపల్ చైర్ పర్సన్ గన్నె వనిత భూమిరెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం జిల్లా కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్‌ను కలిశారు. అనంతరం చైర్ పర్సన్ వనిత మాట్లాడుతూ, దుబ్బాక లోని పాత ఎమ్మార్వో భవనాన్ని ఇంటిగ్రేటెడ్ వెజ్ నాన్ వెజ్ మార్కెట్ కోసం కేటాయించడం జరిగిందని పనులు మొదలు పెట్టేందుకు టెండర్ల ప్రక్రియ ను వేగవం తం చేయాలన్నారు.మున్సిపల్ పరిధిలోని అన్ని వార్డుల్లో పలు అభివృద్ధి కార్యక్రమాలకు టెండర్లు పిలవక పనులు ఆగిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు.నూతనంగా ఏర్పడ్డ కాంగ్రెస్ ప్రభుత్వం దుబ్బాక అభివృ ద్ధికి సహకరించేలా టెండర్ల ప్రక్రియను వెంటనే మొదలుపెట్టాలని, ఆ దిశగా రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్ళేలా ప్రత్యేక చొరవ చూపాలని కోరుతూ కలెక్టర్ కు వినతిపత్రాన్ని అందజేశామన్నారు. కౌన్సిలర్ ఆస యాదగిరి, కోఆప్షన్ సభ్యుడు ఆస స్వామి, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు రొట్టె రాజమౌళి, గుండెల్లి ఎల్లారెడ్డి, అధికం బాలకిషన్ గౌడ్, మూర్తి శ్రీనివాస్ రెడ్డి, గోనెపల్లి సంజీవరెడ్డి, పులిగారి ఎల్లం, బట్టు ఎల్లం పలువురున్నారు.

ఎరువుల దుకాణాల తనిఖీ



నవతెలంగాణ-చేర్యాల

మండలంలోని పలు ఎరువుల దుకాణాలను శుక్రవారం జిల్లా వ్యవసాయ శాఖ అధికారి శివప్రసాద్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా దుకాణ యజమానులు తప్పకుండా ప్రతిరోజు ఎప్పటికప్పుడు స్టాక్ రిజిస్టర్ రాయాలని,ఈపాస్ మిషన్ లో ఎప్పటికప్పుడు ఎరువుల నిల్వలను అప్డేట్ చేయాలని శివ ప్రసాద్ సూచించారు. ప్రతి ఎరువుల దుకాణంలో ఖచ్చితంగా 10 మెట్రిక్ టన్నుల యూరియ నిల్వ ఉంచాలని, జిల్లావ్యాప్తంగా అన్ని ఎరువుల దుకాణాలలో మొత్తం 27,000 మెట్రిక్ టన్నుల యూరియా నిల్వ ఉందని తెలిపారు. రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ శాఖ అధికారి ఎండీ. అఫ్రోజ్, ఎరువుల దుకాణ యాజమానులు పాల్గొన్నారు.

వాసవి సేవా సమితి ఆధ్వర్యంలో అన్నదానం



నవతెలంగాణ- గజ్వేల్

గజ్వేల్ ఇంద్ర పార్క్ చౌరస్తాలో శుక్రవారం వాసవి సేవాసమితి ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. గజ్వేల్ పట్టణానికి చెందిన లయన్ దొంతుల సత్యనారాయణ కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో అమావాస్య అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆర్యవైశ్య సంఘం నాయకులు నంగునూరి సత్యనారాయణ,గోలి సంతోష్, రావికంటి చంద్రశేఖర్ మాట్లాడుతూ అన్నదానం మహా దానం అని అమావాస్య అన్నదానం చేస్తే మహా పుణ్యం లభిస్తుందని పవిత్రమైన అమావాస్య సందర్భంగా స్థానిక ఆర్యవైశ్య నాయకుడు దొంతుల సత్యనారాయణ తల్లిదండ్రుల జ్ఞాపకార్థం అన్నదానం నిర్వహించినట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య నాయకులు పాల్గొన్నారు.

పాలమాకులలో దత్తాత్రేయ జాతర



నవతెలంగాణ-నంగునూరు

మాఘ అమావాస్య పురస్కరించుకొని శుక్రవారం నంగునూరు మండలం పాల మాకుల లోని దత్తాత్రేయ ఆలయం భక్తులతో కిటకిట లాడింది. చీకోటి వంశస్తులు ఉదయం స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించి నైవేద్యం సమర్పించడంతో జాతర ప్రారంబమైంది. చుట్టుపక్కల గ్రామాల నుంచి వచ్చిన భక్తులు పవిత్ర గుండంలో స్నానాలు చేసి దత్తాత్రేయున్ని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. చీకటి పడగానే ప్రత్యేక పూజల నిర్వహించి ఆలయాన్ని మూసివేశారు.

16న దేశవ్యాప్త సమ్మె, గ్రామీణ బంద్ జయప్రదం కోసం సంతకాల సేకరణ



నవతెలంగాణ- కొండపాక

బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న రైతు, కార్మిక, వ్యవసాయ కూలీల, ప్రజా వ్యతిరేక విధానాలను నిరస స్తూ ఈ నెల 16న జరిగే దేశ వ్యాప్త సమ్మె, గ్రామీణ భారత బందును జయప్రదం చేయాలని అమ్ముల బాల నర్సయ్య అన్నారు. శుక్రవారం రోజున వెలికట్ట గ్రామంలో సంతకాల సేకరణ, కరపత్రాల పంపిణీ చేయడం జరిగింది. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యులు అమ్ముల బాలనర్సయ్య మట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం సంవత్సరానికి 2 కోట్ల ఉద్యోగాల హామీని విస్మరించడంతో నేడు ఉద్యోగ కల్పన పడిపోయిందన్నారు. 16 న జరిగే దేశవ్యాప్త కార్మికుల సమ్మె-గ్రామీణ భారత్ బంద్లో పాల్గొని జయప్రదం చేయాలన్నారు.ఈ కార్యక్రమంలో వివిధ రంగాల కార్మికులు అమ్ముల పరుశరాములు, పబోజు లక్ష్మి నర్సయ్య, ఎర్ర సత్తయ్య, నర్సింహ రవి, ఎల్లమ్మ గారి నాగయ్య, భూమని నర్సయ్య, నాంపల్లి యాదయ్య, ముత్తని శేఖర్, అమ్ముల పరుశరాములు, దొబ్బబాలయ్య, శ్రీనివాసు, బాలనర్సయ్య, ఎల్లయ్య పాల్గొన్నారు.

కల్లు గీత వృత్తిదారుల సంఘం క్యాలండర్ ఆవిష్కరణ



నవతెలంగాణ-తొగుట

తెలంగాణ కల్లుగీత వృత్తిదారుల సంఘం క్యాలెండర్ ను ఎస్ కే లతీఫ్ ఆవిష్కరించారు. శుక్రవా రం సిఐ కార్యాలయం వద్ద స్థానికులతో కలిసి క్యాలండర్ ఆవిష్కరించారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ కల్లు గీత వృత్తిదారుల సంఘం రాష్ట్ర కార్యదర్శి అల్వాల కృష్ణ గౌడ్, తొగుట ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు ఉల్లెంగల సాయి కుమార్ ముదిరాజ్, ఉపాధ్యక్షుడు అనిమెల్ల బాల్ నర్సయ్య, కార్యదర్శి చెరుకు నరేష్ రెడ్డి, కోశాధికారి జూపల్లి నర్సింలు, లింగాల మహేష్, షపి, నాగార్జున తదితరులు ఉన్నారు.

18న దొడ్డి కొమురయ్య కురుమ భవన్ ప్రారంభోత్సవం



నవతెలంగాణ - సిద్దిపేట

18 న హైదరాబాద్ లోని కోకాపేట్‌లో దొడ్డి కొమురయ్య కురుమ భవనాన్ని సీఎం రేవంత్ రెడ్డి ప్రారంభిస్తారని, జిల్లాలోని కురుమలు భారీగా తరలివచ్చి విజయవంతం చేయాలని కురుమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు, ఎమ్మెల్సీ యెగ్గె మల్లేశం కురుమ కోరారు. ఈ కార్యక్రమంలో సిద్దిపేట జిల్లా అధ్యక్షులు కోరే ఎల్లయ్య రాష్ట్ర ఉపాధ్యక్షులు జిందం రాజ మల్లయ్య, జిల్లా యువత అధ్యక్షులు కోటగిరి ప్రభాకర్, జిల్లా కార్యదర్శి కంతుల రమేష్, పట్టణ అధ్యక్షుడు బైతి నారాయణ, బీడ రాయుడు, మొండయ్య కురుమ, కంతుల రాజు, కంతుల మల్లేశం, రాంబాబు, కన్నఫోరమ్ ఎల్లయ్య, రాగుల రవి, నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు కట్టుదిట్టమైన చర్యలు

• సిద్దిపేట సీపీ. డాక్టర్ బి.అనురాధ



నవతెలంగాణ -సిద్దిపేట అర్బన్

జిల్లాలో రోడ్డు ప్రమాదాలను నివారించి విలువైన ప్రాణాలు కాపాడేందుకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని సిద్దిపేట సీపీ. డాక్టర్ బి.అనురాధ అన్నారు. శుక్రవారం 35 వ జాతీయ భద్రత మాసోత్సవాలలో భాగంగా సిద్దిపేట ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో సిద్దిపేట పోలీస్ కన్వెన్షన్ సెంటర్లో ట్రాఫిక్ నిబంధనలు రోడ్డు నిబంధనల పై 66 గ్రామాల రోడ్డు సేఫ్టీ కమిటీ మెంబర్లు, ఎన్ఎస్ఎస్ విద్యార్థులు, రోడ్డు భద్రత వాలంటీర్లు, ఎన్సిసి విద్యార్థులు, హెచ్ కె ఆర్ సిబ్బందికి నిర్వహించిన అవగాహన కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల నివారణ కోసం వివిధ డిపార్ట్మెంట్ అధికారులు సిబ్బందితో కలిసి తగు చర్యలు తీసుకోవాలని, గత రెండు సంవత్సరాల నుండి జాతీయ భద్రత మాసోత్సవాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. అనంతరం 108 మెడికల్ సిబ్బంది ఎవరైనా రోడ్డు ప్రమాదంలో ఇతర కారణాల ద్వారా అపస్మారక స్థితిలోకి వెళ్లిన వారిని ఎలా బతికించాలి అనే విషయంలో సీపీఆర్ ద్వారా డెమో నిర్వహించి అందరికీ అవగాహన కల్పించారు. సిపిఆర్ చేసిన తర్వాత అట్టి వ్యక్తి స్పృహలోకి వస్తే మళ్లీ సిపిఆర్ చేయవద్దని స్పృహలోకి వచ్చిన వ్యక్తిని వెంటనే ఆసుపత్రికి తరలించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సిద్దిపేట ట్రాఫిక్ ఏసిపి ప్రసన్నకుమార్, సిద్దిపేట ఏసీపీ సురేందర్ రెడ్డి, సిసిఆర్బి ఏసిపి చంద్రశేఖర్, డిటిఓ లక్ష్మణ్, రిజర్వ్ ఇన్స్పెక్టర్ ధరణి కుమార్, ఎస్బి ఇన్స్పెక్టర్ సత్యనారాయణ రెడ్డి, తొగుట సీఐ లతీఫ్ తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గానికి నిధులు మంజూరు పట్ల హర్షం

నవతెలంగాణ-నంగునూరు

ఈజీఎస్ నిధుల నుండి జిల్లా ఇంచార్జి మంత్రి కొండా సురేఖ ద్వారా సిద్దిపేట నియోజకవర్గనికి కోటి రూపాయలు మంజూరు చేయడం పట్ల కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎం.డీ.ఇమ్రాన్ హర్షం వ్యక్తంచేశారు. శుక్రవారం నంగునూరులో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ముఖ్యమంత్రికి, ఇంచార్జి మంత్రికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ నిధులు నియోజకవర్గ ఇంచార్జి పూజల హరికృష్ణ వివిధ గ్రామాలకు కేటాయింపులు చేయటం జరిగిందని తెలిపారు. గ్రామాల అభివృద్ధి ధ్యేయంగా నూతనంగా ఏర్పడిన ప్రభుత్వం పనిచేస్తుంద న్నారు. ఆరు గ్యారంటీలు వంద రోజుల్లో అమలు చేస్తామని చెప్పినట్లు ప్రభుత్వం అడుగులు ముందుడుగులు వేస్తుందన్నారు. దీనిని జీర్ణించుకోలేక పోతున్న ప్రతిపక్ష పార్టీలు విమర్శలు చేస్తూ రోజులు లెక్కబెట్టుతున్నారని ఆరోపించారు . బీఆర్ఎస్ పాలనలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమయ్యారని తెలిపారు. సీఎం రేవంత్ రెడ్డి పై బీఆర్ఎస్ నేత బాల్క సుమన్ చేసిన అనుచిత వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. ఆయనతో పాటు బడె అశోక్, బడుగు సదానందం, నవీన్, హరీష్, చరణ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమిని కబ్జా నుంచి కాపాడి పేదలకు పంచాలి

నవతెలంగాణ-కొండపాక

కొండపాక మండలం ఖమ్మం పల్లి గ్రామంలో ప్రభుత్వ భూమి కబ్జాకు గురైందని అట్టి భూమిని అధికారులు స్వాధీనం చేసుకొని పేదలకు పంపిణీ చేయాలని ఖమ్మంపల్లి ఎంపీటీసీ సభ్యుడు యాదగిరి శుక్రవారం ఆర్డీఓకు వినతి పత్రం అందజేశాడు. గ్రామంలోని 1060, 1061 సర్వే నెంబర్ల లో గల ప్రభుత్వ భూమి కబ్జాకు గురైందని పేర్కొన్నారు. ఈ సర్వే నంబర్ లో ఉన్న ప్రభుత్వ భూమిలో డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల నిర్మాణం చేయడం కోసం గతంలో కేటాయించారన్నారు . కానీ అందులో నిర్మాణాలు చేయలేదన్నారు. కొంత భూమిలో గ్రామపంచాయతీ అవసరాలైన డంపింగ్ యార్డ్ నిర్మాణం జరిగిందన్నారు. వందకు పైగా ఎకరాలు ఉన్న భూమిలో గతంలో కొంతమందికి పంపిణీ చేయగా మిగిలిన భూమి ప్రభుత్వ ఆధీనంలోనే ఉండేదన్నారు. ప్రస్తుతం అది కబ్జాకు గురవుతుందని ఆయన పేర్కొన్నారు. ఈ విషయమై తహసిల్దార్ కు విన్నవించుకోగా ఆర్ ఐ తోపాటు సర్వేయర్ ను పంపించాడని వారు సైతం ప్రత్యక్షంగా ప్రభుత్వ భూమిని పరిశీలించాలన్నారు. కానీ ఇప్పటివరకు ఎలాంటి స్పందన కనబడలేదన్నారు. కబ్జా గురైన రైతులకు అవసరమయ్యే అవసరాలకు కేటాయించాలని ఆయనే ఆర్డీఓను కోరాడు. ప్రభుత్వ భూములు స్వాధీనం చేసుకొని పేదలకు పంచుదామన్న సీఎం అన్నమాట ప్రకారం ఖమ్మం పల్లిలో ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకొని పేద ప్రజలకు పంపిణీ చేయాలని కోరారు.



16న జరిగే సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలి

• సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఏ మల్లేశం

నవతెలంగాణ -వెల్దుర్తి

కేంద్ర బీజేపీ కార్పొరేటు మతతత్వ విధానాలను నిరసిస్తూ ఈ నెల 16న దేశవ్యాప్త కార్మికుల సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఏ మల్లేశం పిలుపునిచ్చారు. శుక్రవారం మండల పరిధిలో బండ పోసాని పల్లి గ్రామంలో అసంఘటిత రంగ కార్మికులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారినుద్దేశించి మాట్లాడారు. ఈ నెల 16న జరగబోయే దేశవ్యాప్త సమ్మెను అసంఘటిత రంగ కార్మికులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కేంద్రంలో బిజెపి ప్రభుత్వం అధికారంలో వచ్చిన తర్వాత కార్మిక రైతాంగ వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్నదన్నారు. బిజెపి ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలను మానుకోవాలని డిమాండ్ చేశారు. భవన నిర్మాణ కార్మికుల సమావేశం నిర్వహించి వారి సమస్యలను తెలుసుకోవడం జరిగిందన్నారు. ఒక భవనం నిర్మాణం చేపట్టాలన్న ఇసుక ఎంతో అవసరముంటుందన్నారు. అలాంటి ఇసుకపై ప్రభుత్వం నిషేధించడం జరిగిందన్నారు. అందుకు భవన నిర్మాణ కార్మికులకు పని లేక పోయిందన్నారు. భవన నిర్మాణ కార్మికుల వెల్ఫేర్ బోర్డులో గతంలో నిర్ణయించిన పాలసీలు సరిపోవడం లేదు అందుకు వెల్ఫేర్ బోర్డులో క్లయమును పెంచాలని డిమాండ్ చేశారు. ఈ నెల జరగబోయే దేశవ్యాప్త సమ్మెలో అన్ని కార్మికులతో పాటు భవన నిర్మాణ కార్మికులకు కూడా సమ్మెలో పాల్గొనాలని కోరారు. వెల్దుర్తి మండలంలో ఈ నెల 16న జరిగే భారీ ర్యాలీలో అన్ని రంగాల కార్మికులతో పాటు భావన నిర్మాణరంగ కార్మికులు కూడా పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల నాయకుడు గౌరీ భవన నిర్మాణ కార్మికులు పాల్గొన్నారు.



పరుపుల పరిశ్రమలో ప్రమాదం.. కార్మికుడి మృతి



నవతెలంగాణ-మనోహరాబాద్: పరుపుల పరిశ్రమలో పనులు చేస్తున్న కార్మికుడు ప్రమాదవశాత్తు ఫాంలో పడి మృతి చెందిన సంఘటన మండలంలోని పారిశ్రామిక ప్రాంతమైన కాళ్ళాకల్‌లో జరిగింది. పోలీసులు తెలిపిన వివరా ప్రకారం రాజస్థాన్ రాష్ట్రానికి చెందిన కిషోర్ (18) గత కొన్ని నెలలుగా మండలంలోని పారిశ్రామిక ప్రాంతమైన కాళ్ళాకల్ శివారులోగల లివోన్ టెక్ ఫాండ్ ఫోం పరిశ్రమలో పనులు చేసుకుంటు జీవిస్తున్నట్టు తెలిపారు. కాగా శుక్రవారం ఉదయం 10.30 గంటల ప్రాంతంలో పరిశ్రమలో పనులు చేస్తున్న కార్మికుడు కిషోర్ ప్రమాదవశాత్తు బెడ్ ఫాంలో పడిపోయినట్టు తెలిపారు. దాంతో కార్మికుడు ఊపిరాడక అపస్మారక స్థితిలోకి వెల్లడంతో తోటి కార్మికులు గుర్తించి సమాచారం ఇవ్వడంతో పరిశ్రమ యాజమాన్యం వాహనంలో మేడ్చల్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. కాగా కార్మికుడు కిషోర్ అప్పటికే మృతి చెందినట్టు తెలిపారు. కాగా మనోహరాబాద్ పోలీసులకు అందిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని శవాన్ని తూప్రాన్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్టు ఎస్ఐ కరుణాకర్‌రెడ్డి తెలిపారు.

బహుముఖ ప్రజ్ఞాశాలి పీవీకి భారతరత్న

• సురభి దయాకర్ రావు ఫార్మసీ కళాశాల
• ప్రిన్సిపాల్ ఎం.వెంకటరమణ



నవతెలంగాణ-గజ్వేల్

బహుముఖ ప్రజ్ఞాశాలి, మాజీ ప్రధాని స్వర్గీయ పీవీ నర్సింహారావుకు కేంద్ర ప్రభుత్వం భారతరత్న ప్రకటించడం పట్ల సురభి దయాకర్ రావు ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మాచర్ల వెంకటరమణ సంతోషం వ్యక్తం చేశారు. శుక్రవారం పార్లమెంటులో మాజీ ప్రధానమంత్రి పీవీ నరసింహారావుకు భారతరత్న అవార్డు ప్రకటన రావడంతో గజ్వేల్ మండలం రిమ్మనగూడ సురభి దయాకర్ రావు కళాశాలలో విద్యార్థులు, ఉపాధ్యాయులు, అధ్యాపకులు సంబరాలు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా కళాశాల సెక్రెటరీ, ఎమెల్సీ సురభి వాణీదేవి ఆదేశాల మేరకు కళాశాల సిబ్బంది, విద్యార్థులు ఆనందోత్సాహాలతో సంబరాలు చేసుకుని స్వీట్లు పంచుకున్నారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ భారత ఆర్థిక వ్యవస్థను తన ఆర్థిక సంస్కరణలు, ప్రపంచీకరణ ద్వారా ప్రపంచంలోనే ఆర్థికంగా బలమైన దేశంగా భారతదేశాన్ని రూపొందించడంలో మాజీ ప్రధాని పీవీ నరసింహారావు ఎనలేని కృషి చేశారని ఆయన అన్నారు. ఆర్థిక సంస్కరణల పునాదుల ఫలితంగానే నేడు దేశం ప్రపంచంలోనే ఆర్థికంగా నాల్గో బలవంతమైన దేశంగా రూపుదిద్దుకుందన్నారు. గొప్ప రాజనీతిజ్ఞుడు, బహుభాషా కోవిదుడు తెలంగాణ రాష్ట్రానికి చెందిన ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా కేంద్రమంత్రిగా పనిచేయడమే కాకుండా దేశాభివృద్ధి కోసం ప్రధానమంత్రి హోదాలో ఆర్థిక సంస్కరణలతో భారతదేశ పురోగతికి పునాదులు వేశారన్నారు. కళాశాల సెక్రెటరీ, ఎమ్మెల్సీ సురభి వాణీదేవి తన తండ్రి పీవీ నరసింహారావు ఆశయాలను పుణికిపుచ్చుకుని సురభి ఎడ్యుకేషనల్ సొసైటీ ద్వారా ఎంతో మంది విద్యార్థుల భవిష్యత్తుకు బంగారు బాటలు వేస్తున్నారని కొనియాడారు. అలాంటి మహోన్నతమైన వ్యక్తుల ఆధ్వర్యంలో నడుస్తున్న కళాశాలలో విద్యనభ్యసించిడం విద్యార్థులకు గొప్ప వరం అన్నారు. పీ.వి. జీవితం విద్యార్థులందరికీ ఆదర్శనీయమని ఆయన అడుగుజాడల్లో నడిచి ఉన్నత స్థానానికి ఎదగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల సిబ్బంది డాక్టర్ శేష ఫణీంద్ర, డాక్టర్ రంగు నిర్మల, డాక్టర్ స్వాతి, చెరుకు నరేష్ రెడ్డి, సౌమ్య, సౌందర్య పూజిత, ఈశ్వర్, భారతి, బీ.అరుణ, రాజేశ్వరీ, లుబ్న, కృష్ణ, మజీద్, కే.అరుణ, ప్రవీణ్, కరుణాకర్, రజిత, విద్యార్థులు పాల్గొన్నారు.



ఆల్ఫోర్స్ పాఠశాల గుర్తింపు రద్దు చేయాలి

• ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి జేరిపోతుల జనార్ధన్



నవతెలంగాణ-హుస్నాబాద్ రూరల్

హుస్నాబాద్‌లో నిబంధనలకు విరుద్ధంగా నడుపుతూ అధిక ఫీజులు వసూలు చేస్తూ అకారణంగా విద్యార్థులను మానసికంగా శారీరకంగా వేధిస్తున్న ఆల్ఫోర్స్ పబ్లిక్ స్కూల్ గుర్తింపును రద్దు చేయాలని ఏఐఎస్ఎఫ్ సిద్దిపేట జిల్లా ప్రధాన కార్యదర్శి జేరిపోతుల జనార్ధన్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో పాఠశాల ముందు ధర్నా నిర్వహించారు. అనంతరం విద్యా శాఖ అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆల్ఫోర్స్ పాఠశాల విద్య హక్కు చట్టం ప్రకారం ఎలాంటి నిబంధనలు పాటించడం లేదన్నారు. అర్హత లేని టీచర్లచే విద్యా బోధన చేపిస్తున్నారని ఆరోపించారు. విద్యార్థులకు సరిపడ మరుగుదొడ్లు లేవన్నారు. విద్యార్థులను మానసికంగా శారీరకంగా వేధిస్తున్నారన్నారు. కార్పొరేట్ స్థాయిలో వేలాది రూపాయలు దండుకుంటున్నారన్నారు..ఆల్ఫోర్స్‌లో 5వ తరగతి చదువుతున్న ఇప్పకాయల విశాల్ అనే విద్యార్థిని ఒక టీచర్, ప్రిన్సిపాల్ చితకబాదగా అడగడానికి వెళ్లిన తల్లిదండ్రులను, విద్యార్థి సంఘ నాయకులను స్కూలుకు సంబంధం లేని వ్యక్తులతో భయభ్రాంతులకు గురి చేస్తున్నారని తెలిపారు. విద్యా శాఖ అధికారులు వెంటనే పాఠశాల గుర్తింపును రద్దు చేయాలని డిమాండ్ చేశారు. పాఠశాల గుర్తింపు రద్దు చేసేవరకు ఏఐఎస్ఎఫ్ పోరాటం చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ రామగాళ్ల నరేశ్, ఆర్గనైజింగ్ సెక్రెటరీ చిట్యాల శేఖర్, నాయకులు చట్ల సమ్మయ్య, సిద్దుల సుమన్, నాయకులు కొమ్ముల శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఎంపీపీతో కలిసి భూమి పూజ చేస్తే ప్రోటోకాల్ ఉల్లంఘించడమా !

• కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి చూసి ఓర్వ లేకనే విమర్శలు
• కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు అక్కం స్వామి.



నవతెలంగాణ-తొగుట

మండలానికి మూడున్నర కోట్ల రూపాయల నిధులు రావడం జీర్ణించుకోలేని బీఆర్ఎస్ నాయకులు అనవసర రాద్ధాంతం చేస్తున్నారని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు అక్కం స్వామి మండి పడ్డారు. శుక్రవారం ఎంపీపీ గాంధారి లత నరేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గురువారం మండలంలో దాదాపు రూ. 3.33 కోట్ల నిధులతో స్థానిక ఎంపీపీతో కలిసి కాంగ్రెస్ పార్టీ దుబ్బాక నియోజకవర్గ ఇన్చార్జ్ చెరుకు శ్రీనివాస్ రెడి తో భూమి పూజ కార్యక్రమాలు చేయడం తప్పు ఎలా అవుతుందని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు అందరూ పాల్గొన్నారని తెలిపారు. మండలానికి ఎంపీపీ ప్రోటో కాల్ పదవి అని, ఎంపీపీ భూమి పూజ చేయడం ప్రోటోకాల్ ఉల్లంఘించడం ఎలా అవుతుందని ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ఏర్పడిన రెండు నెలల సమయంలోనే మండలానికి మూడున్నర కోట్ల రూపాయలు అభివృద్ధి కోసం రావడం జీర్ణించుకోలేని బీఆర్ఎస్ నాయకులు అనవసర రాద్ధాంతం చేస్తున్నారన్నారు. 10 సంవత్సరాలు ఎంపీగా పనిచేసిన ప్రస్తుత ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి మొత్తం ఆయన పదవీ కాలంలో కూడా మూడు కోట్ల రూపాయల నిధులు ఇవ్వలేదని, బీఆర్ఎస్ నాయకులకు చేతనైతే ఎమ్మెల్యే ద్వారా మరో మూడున్నర కోట్ల రూపాయ లు తెచ్చి మండలంలో అభివృద్ధి పనులు చేయాలని సవాల్ విసిరారు. గత పది సంవత్సరాలు సిద్దిపేట నాయకుల మోచేతి నీళ్లు తాగుతూ దుబ్బాక నియోజకవర్గానికి తీరని అన్యాయం చేసిన బీఆర్ఎస్ నాయకులు ఈ రోజు మాట్లాడడం విడ్డూరంగా ఉందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇకనైనా సోయి తెచ్చుకొని మండల అభివృద్ధికి సహకరించాలని వారు హితవు పలికారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ గంట రేణుక రవీందర్, మాజీ సర్పంచులు పాగాల కొండల్ రెడ్డి, బుర్ర అనిత నర్సింలు, కొంగరి నర్సింలు, ఐఎన్టియుసీ నియోజక వర్గ అధ్యక్షుడు బాలమల్లు, కిసాన్ సెల్ అధ్యక్షుడు శ్రీనాకర్ రెడ్డి, జిల్లా నాయకులు పబ్బతి మల్లా రెడ్డి, యెన్నం భూపాల్ రెడ్డి, బుస నిరంజన్ రెడ్డి, మండల నాయ కులు ఉప్పలయ్య, మధు, ముక్కెర కనకయ్య, దుద్దేడ యాదగిరి, దయాకర్ రెడ్డి, జయబాబు, స్వామి తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనులను పరిశీలించిన కేంద్ర అధికారుల బృందం

నవతెలంగాణ- కొండపాక

కొండపాక మండలం తిమ్మారెడ్డిపల్లి గ్రామంలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను కేంద్ర శిక్షణ అధికారుల బృందం శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు కూలీలతో మాట్లాడారు. కూలీల హాజరు ఏ విధంగా వేస్తారు అనే విషయాన్ని ఫీల్డ్ అసిస్టెంట్‌లను అడిగి తెలుసుకున్నారు. తమకు వందరోజుల పని సరిపోదని 150 రోజుల పని దినాలు పెంచాలని కూలీలు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. గ్రామంలో జరుగుతున్న చేపల పెంపకం, ఇతర ఉపాధి హామీ పనులను పరిశీలించారు. సరైన సమయానికి కూలి డబ్బులు పడుతున్నాయా లేదా అని ఆరా తీశారు. అవసరం ఉన్న పనులు ఇస్తున్నారా లేదా అనే విషయాలను తెలుసుకున్నారు. డీఆర్డీఏ పీడీ జయదేవ్, ఎంపీడీవో రాంరెడ్డి, ఈజీఎస్ టెక్నికల్ అసిస్టెంట్ నాగరాజు, ఫీల్డ్ అసిస్టెంట్ స్కైలాబ్ వ్యవసాయ శాఖ అధికారి తదితరులు ఉన్నారు.

ఏ సమస్య వచ్చినా కలవండి...అందుబాటులో ఉంటా

• మాజీ ఎమ్మెల్యే సతీష్ కుమార్



నవతెలంగాణ - హుస్నాబాద్ రూరల్

బీఆర్ఎస్ కార్యకర్తలకు ఏ సమస్య వచ్చినా నన్ను కలవాలని ఎప్పుడూ అందుబాటులో ఉంటాననీ మాజీ ఎమ్మెల్యే సతీష్ కుమార్ కార్యకర్తలకు భరోసా ఇచ్చారు. శుక్రవారం బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే సతీష్ కుమార్ మాట్లాడుతూ పార్టీ కార్యకర్తలు అధైర్యపడవద్దనీ, భవిష్యత్తు మనదేనన్నారు. గ్రామస్థాయి నుండి పార్టీనీ సంస్థాగతంగా బలోపేతం చేస్తామన్నారు. అభివృద్ధి చేసినప్పటికీ ఓటమి చెందడం బాధ కలిగించిందన్నారు. త్వరలో జరగనున్న పార్లమెంట్ ఎన్నికలలో తెలంగాణ రాష్ట్ర సాధనలో కీలక పాత్ర పోషించిన పార్టీ ముఖ్యులు మాజీ పార్లమెంటు సభ్యులు బోయినపల్లి వినోద్ కుమార్‌ను గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. బహుభాష కోవిదులు దేశం గర్వించదగ్గ నేత మాజీ ప్రధాని పీవీ నరసింహారావుకు కేంద్ర ప్రభుత్వం అత్యున్నత పురస్కారం భారతరత్న అవార్డు ప్రకటించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ ప్రజా ప్రతినిధులు పార్టీ కార్యకర్తలు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

దుర్గామాతను దర్శించుకున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు



నవతెలంగాణ-తొగుట

విజయవాడ శ్రీ దుర్గామాతను టీపీసీసీ ఫిషర్మెన్ కాంగ్రెస్ చైర్మన్ మెట్టు సాయికుమార్‌తో కలిసి శుక్రవారం దర్శించుకున్నామని టీపీసీసీ ఫిషర్ మెన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రేపాక తిరుపతి ముదిరాజ్ తెలిపారు. ఈ సందర్భంగా దుబ్బాక బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు ఐలాపురం కనకయ్య సాయికుమార్ కు దుర్గామాత చిత్రపటాన్ని బహుకరించారు. ఈ కార్యక్రమంలో ప్రదీప్, రమేష్, రవి, లడ్డు, రాము తదితరులు ఉన్నారు.

సిద్దన్నపేటను సందర్శించిన కేంద్ర బృందం



నవతెలంగాణ-నంగునూరు

సిద్దిపేట జిల్లా నంగునూరు మండలంలోని సిద్దన్నపేట గ్రామా న్ని శుక్రవారం కేంద్ర బృందం సభ్యులు సందర్శించారు. ఉపాధి హామీ పథకం, వ్యవసాయం, పంచాయతీరాజ్, మిషన్ భగీరథ, ఐసీడీఎస్ తదితర పథకాలను అడిగి తెలుసుకున్నారు. రికార్డులను పరిశీలించారు. ఇంచార్జి ఎంపీడీవో వేణుగోపాల్, ఎంపీటీసీ బెదురు తిరుపతి, నాయకులు దాకూరి భాస్కర్ రెడ్డి వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఇటుకబట్టి కార్మికులను హింసించడం అమానుషం

నవతెలంగాణ-హుస్నాబాద్ రూరల్

పెద్దపల్లి జిల్లా రామగిరి ఖిల్లా సమీపంలో ఇటుకబట్టి కార్మికులను యజమానులు హింసించడం అమానుషమైన చర్య అని మానవ హక్కుల వేదిక నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పొట్ట చేత పట్టుకుని బతుకుదెరువు కోసం పని వెతుక్కుంటూ మన రాష్ట్రానికి వలస వచ్చిన కార్మికుల బతుకులు చాలా దుర్భరంగా ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఒరిస్సా నుంచి వేలాదిమంది తెలంగాణకు తరలివచ్చారని, ఇటుక బట్టీలలో బానిస బతుకులు వెల్లదీస్తున్నారని పేర్కొన్నారు. కొందరు యజమానులు వలస కార్మికుల జీవించే హక్కును కాలరాస్తున్నారని అన్నారు. కూడు, గూడు, వైద్యం వంటి కనీస వసతులు వారికి తప్పకుండా కల్పించాలని అన్నారు. కానీ స్వార్థపరులైన యజమానులు వారి ప్రాథమిక అవసరాలు తీర్చకుండా వారితో పెట్టి చాకిరి చేపించుకుంటున్నారని అన్నారు. వాళ్లని జంతువుల కన్నా హీనంగా చూస్తూ భౌతిక దాడులకు పాల్పడటం అత్యంత బాధాకరమైన విషయమని అన్నారు.

ఇకపై ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉన్న ఇటుక బట్టిలలో వలస కార్మికులపై ఎలాంటి దాడులు జరగకుండా చూడాలని, లేనిచో చట్టపరమైన చర్యల కోసం రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన చేపడతామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మానవ హక్కుల వేదిక జిల్లా కమిటీ మెంబర్ ముక్కెర సంపత్ కుమార్, నాయకులు కొయ్యడ కొమురయ్య, బండ సంధ్యారాణి, సావుల రాజమౌళి, పొన్నాల వినోద్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ సైన్స్ దినోత్సవాన్ని సందర్భంగా చిత్రలేఖన ఉపన్యాస పోటీలు



నవతెలంగాణ-వెల్దుర్తి

జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని మండల వ్యాప్తంగా ఉన్న పాఠశాలల్లో శుక్రవారం 6 నుంచి 10వ తరగతి విద్యార్థులకు చిత్రలేఖనం, కవిత్వం, పాటలు, పాడుట ఉపన్యాస, పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో విజేతలైన విద్యార్థులను జిల్లా స్థాయి పోటీలకు పంపడం జరిగిందని ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఎంఈఓ యాదగిరి తెలిపారు. చిత్రలేఖనములో ప్రథమ స్థానం బి. గురు ప్రసాద్ (జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వెల్దుర్తి), కవిత్వంలో జి నందిని (జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మంగళపర్తి) పాటల పోటీల్లో కస్తూరిబా పాఠశాల వెల్దుర్తి, ఉపన్యాస పోటీలలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఎంపికయ్యాంని తెలిపారు. విజేతలకు అభినందనలు తెలియజేస్తూ జిల్లా స్థాయిలో కూడా మంచి ప్రతిభను కనబరిచి రాష్ట్రస్థాయికి కూడా ఎంపిక కావాలని విద్యార్థులకు మండల విద్యాధికారి ఏ యాదగిరి కోరారు. ఈ కార్యక్రమం నిర్వహణకు సహకరించిన ప్రధానోపాధ్యాయులు, న్యాయ నిర్ణేతలకు, ఉపాధ్యాయులకు కృతజ్ఞతలు తెలిపారు.

చౌక ధరల దుకాణాన్ని పరిశీలించిన విద్యార్థులు



నవతెలంగాణ-చేగుంట

చేగుంట మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఎనిమిదవ తరగతి విద్యార్థులు ప్రాజెక్ట్ వర్క్‌లో భాగంగా శుక్రవారం చేగుంట పట్టణ కేంద్ర రేషన్ షాప్‌ను పరిశీలించి, వాటి పనితీరును తెలుసుకున్నారు. రేషన్ షాప్ యజమాని శ్రీనివాస్ రేషన్ కార్డులు ఎన్ని రకాలు, వాటి ఉపయోగాలు, ప్రజా పంపిణీ వ్యవస్థ పనితీరును విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు చల్లా లక్ష్మణ్, రాధ, సిఆర్పి రమేష్, విద్యార్థులు పాల్గొన్నారు.

చాకలికుంట కబ్జాను అడ్డుకోవాలని తహశీల్దార్‌కు వినతి



నవ తెలంగాణ కొండపాక

రియల్ ఎస్టేట్ వ్యాపారులు కంటికి కనిపించిన ఏ స్థలాలను వదలకుండా కబ్జాలు చేస్తున్నారని, కుంటస్థలాలను, నక్ష బాటలను సైతం వదలకుండా ఆక్రమించి నిర్మాణాలు చేపడుతున్నారని దుద్దెడ గ్రామ రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కొండపాక మండల పరిధిలోని దుద్దెడ గ్రామంలో టోల్ గేట్ వద్ద ఉన్న చాకలికుంటను, నక్ష బాటను కొంతమంది రియల్ ఎస్టేట్ వ్యాపారులు కబ్జా చేసి గోడను నిర్మిస్తున్నారని, తాతల కాలం నుంచీ అక్కడ వ్యవసాయ భూములు ఉన్నాయని, అప్పటి నుండి వ్యవసాయ పొలాలకు కుంట, నక్ష బాట దారి ఉండేదని.. ఇటీవల కాలంలో కొంత మంది రియల్ ఎస్టేట్ వ్యాపారులు ఆ కుంటను ఆక్రమించుకొని కబ్జాను చేసి నిర్మాణాలు చేపడుతున్నారని తెలిపారు. సుమారు ఏళ్లుగా నడుస్తున్న నక్ష బాటను, కుంట స్థలాలను రియల్ వ్యాపారులు ఆక్రమిస్తే తమ వ్యవసాయ పొలాలకు ట్రాక్టర్లు హార్వెస్టర్లు ఎలా వెళ్తాయని అని ప్రశ్నిస్తున్నారు. ఇదే విషయమై మండల తహసిల్దార్ చల్లా శ్రీనివాస్‌కు శుక్రవారం వినతిపత్రం ఇచ్చి కబ్జా చేసి గోడ నిర్మిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, నక్షబాటను పునరుద్ధరించాలని విజ్ఞప్తి చేశారు.

రైతుల భూములపై అక్రమార్కుల కన్ను

సాదా కాగితం, నోటి మాట ద్వారా 60 సంవత్సరాల క్రితం కొనుగోలు చేసి సాగు చేస్తున్న భూములను కొంతమంది వ్యక్తులు తిరిగి తీసుకునేందుకు ప్రయత్నిస్తున్నారని దుద్దెడ గ్రామ రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దుద్దెడ గ్రామంలోని సర్వే నంబర్ 456,457,458,463 తో పాటు మరి కొన్ని సర్వే నంబర్లను నర్ర లలితా బాయ్ అలియాస్ గుర్రాల లలితా బాయ్ వద్ద నుంచి 50 సంవత్సరాల క్రితం డబ్బులు చెల్లించి సాదా కాగితం, నోటి మాట ద్వారా కొనుగోలు చేసినట్లు రైతులు తెలిపారు. ఆనాటి నుండి నేటి వరకు ఆ భూములను అలాగే సాగు చేసుకుంటున్నామని, ఆ భూములకు సంబంధించిన కొన్ని వివరాలు ధరణిలో నమోదు కాలేదని, ఇప్పటికీ ధరణి లో లలితా బాయ్ పేరు పైనే రికార్డు రావడంతో ఇదే అదనుగా భావించిన వారి వారసులైన అమరేందర్ రెడ్డి ఆ భూములపై కన్నేసి వాటిని లాక్కునేందుకు అనేక ప్రయత్నాలు చేస్తున్నట్లు రైతులు తెలిపారు. ప్రైవేటు సర్వేయర్లతో సర్వే చేస్తూ మార్కింగ్ ఇస్తున్నారని, అడ్డుకున్న రైతులపై దాడి చేసి తిడుతున్నారని వారు వాపోయారు. వ్యవసాయాన్ని నమ్ముకుని జీవిస్తున్న తమకు న్యాయం చేసి తమ భూములను అక్రమార్కుల పాలు కాకుండా చూడగలరని కోరుతున్నారు. ఇదే విషయమై కొండపాక మండలం ఎమ్మార్వో తహశీల్దార్‌కు వినతి పత్రం ఇచ్చినట్లు రైతులు తెలిపారు.

ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పెండింగ్ పనులు పూర్తి చేయాలి

కలెక్టర్ రాజర్షి షా



నవతెలంగాణ - మెదక్

మెదక్ జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో పెండింగ్ పనులు త్వరిత గతిన పూర్తి చేయాలని కలెక్టర్ రాజర్షి షా జిల్లా అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టర్ కార్యాలయంలో వైద్య శాఖ అధికారులు, పంచాయతీరాజ్ ఇంజనీర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లా వ్యాప్తంగా 15 వ ఆర్థిక కమిషన్ ద్వారా మంజూరైన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పనులు, పెండింగ్ లో ఉన్న భవన నిర్మాణాలు, ఇతర పనులు త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. సర్దన, చెగుంట, మనోహరబాద్, తూప్రాన్, పాపన్నపేట, శ%శీ%కరంపెట్ (ఏ), వివిధ మండలల్లో పెండింగ్ పనులు పూర్తి చేయాలన్నారు. ఉపాధి హామీ పథకంలో సిసి రోడ్లు, డ్రైనేజీలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి చందు నాయక్, పంచాయితీ రాజ్ ఈఈ నర్సింహులు, డిప్యూటీ డిఎంహెచ్ఓ విజయనిర్మల, వివిధ మండలాల ఇంజనీర్లు పాల్గొన్నారు.

బ్యాక్ లాగ్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలి



నవతెలంగాణ-నిజాంపేట

ప్రభుత్వ శాఖలో ఖాళీగా ఉన్న బ్యాక్‌లాగ్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని మెదక్ జిల్లా వికలాంగుల సంఘం ఉపాధ్యక్షుడు మాందాపురం గౌతమ్ అన్నారు. రజాక్ పల్లి గ్రామంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వ శాఖలో ఖాళీగా ఉన్న బ్యాక్‌లాగ్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని కోరారు. జిల్లా అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం వల్లనే నిరుద్యోగ వికలాంగులకు శాపంగా మారిందన్నారు. వికలాంగుల కుటుంబానికి అంత్యోదయ కార్డు ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు రాగుల మాణిక్యం, ఉపాధ్యక్షులు గుండెల్లి రేణుక, కార్యదర్శి దుండిగల్ రాములు, వజ్జ ముత్తయ్య , అద్దాల రాజలింగం, మధ్య బుచ్చమ్మ , తదితరులు పాల్గొన్నారు

నందిగామలో స్పెషల్ శానిటేషన్ డ్రైవ్



నవతెలంగాణ-నిజాంపేట

మండల పరిధిలోని నందిగామ గ్రామంలో శుక్రవారం స్పెషల్ సానిటేషన్ డ్రైవ్‌లో భాగంగా మురికి కాలువలను శుభ్రం చేశారు. రోడ్లపై చెత్తాచెదారం లేకుండా శుభ్రపరిచారు. గ్రామంలో మంచినీటి సమస్య తలెత్తకుండా ముందు జాగ్రత్త చర్యగా తగు జాగ్రత్తలు తీసుకున్నారు. మంచినీటి ట్యాంకు కడిగి శుభ్రం చేశారు. పల్లె ప్రకృతి వనంలో గడ్డిని తొలగించడం జరిగిందని గ్రామ కార్యదర్శి మహమ్మద్ ఆరిఫ్ హుస్సేన్ తెలిపారు. గ్రామస్తులు తమ నీటి తొట్టిలను బ్లీచింగ్ పౌడర్‌తో శుభ్రం చేసుకోవాలని, లేకుంటే దోమలు పెరిగిపోతాయన్నారు. గ్రామస్తులు తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు

కొప్పల్ ఉమా సంగమేశ్వర ఆలయంలో పోటెత్తిన భక్తులు



నవతెలంగాణ -పెద్ద శంకరంపేట

మాఘ అమావాస్య పురస్కరించు కొని దక్షిణ కాశీగా పేరుగాంచిన కొప్పల్ ఉమా సంగమేశ్వర ఆలయంలో శుక్రవారం నాడు వేకువ జాము నుంచే స్వామివారికి వేద బ్రాహ్మణ పండితుల మంత్రోచ్చారణల మధ్య అభిషేకాలు, ఆకుల పూజ, ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై గుండంలో పుణ్య స్నానాలు ఆచరించి స్వామివారిని దర్శనం చేసుకున్నారు. ఆలయ కమిటీ అధ్యక్షులు, సభ్యులు భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాటు పూర్తి చేశారు. కిష్టప్ప గారి సంగమేశ్వర్ సహకారంతో అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. పెట ఎస్సై శంకర్ ఏఎస్ఐ సునీత ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ బాధ్యులు పద్మ బాపిరాజు సీతారామారావు సతీష్ గౌడ్ గాండ్ల సంగమేశ్వర్ కొత్తపేట శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.

టీఎస్ యుటిఎఫ్ మండల కమిటీ ఎన్నిక

అధ్యక్షులుగా కే రవి, ప్రధాన కార్యదర్శిగా ఎస్.కె నాగుల్ మీరా





నవ తెలంగాణ-నర్సాపూర్

టీఎస్ యుటిఎఫ్ నర్సాపూర్ మండల కమిటీని శుక్రవారం టీఎస్ యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు జి శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి పద్మారావుల సమక్షంలో ఎన్నుకున్నారు. మండల అధ్యక్షులుగా కే రవి, ప్రధాన కార్యదర్శిగా ఎస్.కె నాగుల్ మీరాతోపాటు ఉపాధ్యక్షులుగా షాహీన్ దాకియా, కోశాధికారిగా కనకరాజు, ఆడిట్ కమిటీ కన్వీనర్ గంగాధర్, కుటుంబ సంక్షేమ నిధి కన్వీనర్‌గా కె.వి.ఆర్ నాయుడు, పత్రికా కన్వీనర్‌గా రమేష్ రాజు, క్రీడా సబ్ కమిటీ కన్వీనర్‌గా హెచ్ రవి, సంస్కృతిక సబ్ కమిటీ సభ్యులుగా కళా రాములు, బి.సత్యనారాయణ, సోషల్ మీడియా కన్వీనర్ జే రాజు, అకాడమీ కన్వీనర్ శ్రీనివాస్ గౌడ్, కార్యదర్శులుగా కృష్ణ, గీత , రంజిత్, శ్రీనివాస్, సురేఖ, రామ జ్యోతి, కల్పనా దేవి, కవిత, శ్రీ మూర్తి నాయుడు, రాంబాబు తదితరులను ఎన్నుకున్నారు.

ఘనంగా లక్ష్మీనరసింహస్వామి జాతర



నవతెలంగాణ-రామాయంపేట

మాఘ అమావాస్యను పురస్కరించుకొని రామాయంపేట పట్టణంలో శుక్రవారం లక్ష్మీనరసింహస్వామి జాతర ఉత్సవాలు ఘనంగా జరిగాయి. ఉదయం పంచామృతాలతో అభిషేకాలు, అష్టోత్తర నామాలతో పూజా కార్యక్రమాలను నిర్వహించి, ధూపదీప నైవేద్యాలు సమర్పించారు. లక్ష్మీ నరసింహ స్వామి జాతరలో భక్తులు పెద్ద ఎత్తున కనిపించారు.

జనగామలో పారాల్సిన నీళ్లను సిద్దిపేటకు తరలించారు

పట్టించుకోని అప్పటి ఎంపీ వెంకట్‌రెడ్డి
తపాస్‌పల్లి రిజర్వాయర్ సందర్శన
కంటెస్టెడ్ ఎంపీ అభ్యర్థి పివి శ్యాంసుందర్ రావు



నవ తెలంగాణ- కొమురవెల్లి

జనగామ, ఆలేరు, భువనగిరి ప్రాంతా పంట పొలాల్లో పారాల్సిన నీళ్లను మాజీ మంత్రి హరీష్ రావు అన్యాయంగా సిద్దిపేటకు తరలించుకుపోయారని భువనగిరి బీజేపీ కంటెస్టెంట్ ఎంపీ అభ్యర్థి పీవీ శ్యాంసుందర్‌రావు ఆరోపించారు. రిజర్వాయర్ పనులు వెంటనే పూర్తిచేసి జనగామ, ఆలేరు, నియోజకవర్గాలకు సాగునీరు అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం మండలంలోని తపాస్‌పల్లి రిజర్వాయర్‌ను సందర్శించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనగామ, ఆలేర్ నియోజకవర్గాలకు సాగునీరు అందించేందుకు ఈ రిజర్వాయర్ నిర్మాణం చేస్తే ఒరిజినల్ డిజైన్‌లో లేని సిద్దిపేట, గజ్వేల్‌కు మాజీ మంత్రి హరీష్ రావు నీళ్లు మళ్లించుకుపోయారని ఆయన విమర్శించారు. భువనగిరి పార్లమెంటుకు సంబంధించిన సాగునీటి ప్రాజెక్టులను బీఆర్ స్ ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం చేసిందన్నారు. భువనగిరి పార్లమెంటు ప్రజల ఓట్లతో 2018లో ఎంపీగా గెలిచిన కోమటిరెడ్డి వెంకటరెడ్డి తరలిపోతున్న నీళ్ల కోసం పోరాటం చేయాల్సిన బాధ్యతను విస్మరించి అప్పటి బీ ఆర్ ఎస్ ప్రభుత్వంతో కుమ్మక్కై, కోవర్ట్ రాజకీయాలకు పాల్పడ్డారని ఆరోపించారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి తపాస్‌పల్లి రిజర్వాయం ను 5 టి ఏంసిలకు పెంచాలని, వెంటనే డిస్ట్రిబ్యూటరీ కాలువలను నిర్మించి కరువు ప్రాంతాలకు నీరు అందించాలని ఆయన డిమాండ్ చేశారు. కొమురవెల్లి మల్లన్న, కొండ పోచమ్మ ఆలయాల చెంత ఉన్న తపాస్‌పల్లి రిజర్వాయర్‌ను టూరిజం సెంటర్‌గా తీర్చిదిద్దాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ జర్నలిస్టు యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు కప్పర ప్రసాద్ రావు, ప్రధాన కార్యదర్శి, బింగి స్వామి, రవి, దండ్యాల లక్ష్మారెడ్డి, బుర్గోజు నాగరాజు, గనబోయిన శ్రీనివాస్, వంగ శివారెడ్డి, దండ్యాల బిక్షపతిరెడ్డి, అక్కేన పల్లి సంపత్ రెడ్డి, దుంబాలశివ, నారాయణ, కొయ్యడ మల్లేశం, కుడికుడి మల్లేశం, ఈగ కనకయ్య, పుట్ట కనుకయ్య, రాములు పాల్గొన్నారు

ఏడుపాయల్లో లక్షలాది భక్తుల మాఘస్నానాలు



నవతెలంగాణ-పాపన్నపేట

తెలంగాణాలోనే ప్రసిద్ధి గాంచిన ఏడుపాయల వన దుర్గామాత ఆలయం మాఘ అమావాస్య సందర్భంగా శుక్రవారం ఉదయం నుండే భక్తులతో కిక్కిరిసి పోయింది. ఆంధ్ర ప్రదేశ్, కర్ణాటక, మహారాష్ట్ర, తదితర రాష్ట్రం నుంచి భక్తులు వివిధ వాహనాలలో ఏడుపాయలకు చేరుకుని మంజీరాలో పుణ్య స్నానాలాచరించారు. అనంతరం అమ్మవారిని దర్శించుకునేందుకు ప్రధాన ఆలయంలో క్యూ లైన్‌లలో బారులు తీరారు. ఈ సందర్భంగా ఏడుపాయల పాలక మండలి ఛైర్మన్ ఎస్.బాలాగౌడ్, ఈఓ పి.మోహన్ రెడ్డి, ధర్మకర్తలు భక్తులకు పూర్తి స్థాయిలో వసతులు కల్పించారు. కాగా అమ్మవారిని దర్శించుకునేందుకు ఏర్పాటు చేసిన విఐపి క్యూలైన్ దర్శనంలో తొక్కిసలాటతో భక్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఏడుపాయలకు వచ్చే భక్తుల సౌకర్యార్థం మెదక్, పోతన్ షెట్ పల్లి నుంచి 2 ఆర్టీసీ బస్సు సర్వీసులు, సికింద్రాబాద్ నుంచి ఏడుపాయలకు 25 బస్ సర్వీసులను ఆర్టీసీ సంస్థ ప్రతి 15 నిమిషాలకు ఒక సర్వీస్ నడిపారు. దేవస్థానం తరపున వృద్ధులకు ఆటోలను ఏర్పాటు చేశారు. మెదక్ ఎస్పీ బాలస్వామి నేతృత్వంలో డిఎస్పీ ఫనిందర్, సిఐ కేశవులు ఆధ్వర్యంలో పాపన్నపేట ఎస్ఐ నరేశ్ పర్యవేక్షణలో 150మంది పోలీసులు తమ విధులు నిర్వహించారు. జాతరలో 20 మంది గజఈతగాళ్లను ఏర్పాటు చేశారు. పాపన్నపేట, పొడిచన్ పల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ హరిప్రసాద్, సింధూల ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది తమ సేవలందిస్తున్నారు. నిరంతరాయం విద్యుత్‌ను అందించేందుకు పాపన్నపేట విద్యుత్ ఏఈ నర్సింలు ఆధ్వర్యంలో సిబ్బంది పనిచేస్తున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు యాదాగౌడ్, వెంకటేశం, సాయిలు, మోహన్ రావు, మనోహర్, ఆలయ సిబ్బంది సూర్య శ్రీనివాస్, మధుసూదన్ రెడ్డి, ప్రతాప్ రెడ్డి, లక్ష్మీ నారాయణ, శ్రీనివాస్ శర్మ, నరేష్, మహేష్, సాయిబాబా, యాదగిరి, బలరాం, తదితరులు పాల్గొన్నారు.

ఎంఎస్ఎస్ఓ తరపున బాధితులకు ఆర్థిక సహాయం



నవతెలంగాణ-నార్సింగి

గత ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ ప్రచార కార్యక్రమంలో మండల పరిధిలోని జప్తి శివునూర్ గ్రామానికి చెందిన బీసీ సెల్ అధ్యక్షుడు గంగబోయిన స్వామి స్టేజ్‌పై నుంచి కిందపడగా కాలు విరిగింది. అప్పటి నుంచి ఆయన చికిత్స పొందుతున్నారు. శుక్రవారం మైనంపల్లి సోషల్ సర్వీస్ ఆర్గనైజేషన్ (ఎంఎస్ఎస్ఓ) అధ్యక్షుడు గ్రామ మాజీ ఉప సర్పంచ్ షేక్ రుక్ముద్దీన్ పార్టీ కార్యకర్తలతో పాటు స్వామిని కలిసి ఆర్గనైజేషన్ తరపున రూ.20 వేల సహాయం అందజేశారు. ఈ సందర్భంగా స్వామి ఎంఎస్ఎస్ఓ నిర్వాహకుడు మైనంపల్లి హన్మంతరావు, మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావులకు కృతజ్ఞతలు తెలిపారు. ఇప్పటి వరకు తనకు సంస్థ ద్వారా రూ.30 వేల సాయం అందిందని, తాను వారికి రుణ పడి ఉంటానన్నారు. తనకు చికిత్స కోసం రూ.3 లక్షల వరకు ఖర్చు అయ్యిందని, కుటుంబ పోషణ భారంగా మారిందన్నారు. ఎమ్మెల్యే రోహిత్ తన కుటుంబాన్ని ఆదుకోవాలని విన్నవించారు. తాను ఎన్నో సంవత్సరాలుగా కాంగ్రెస్ పార్టీ కోసం పని చేశానని తెలిపారు. అదే గ్రామానికి చెందిన జెట్టి కమలమ్మ ఇటీవల మృతి చెందగా రుక్ముద్దీన్ పార్టీ కార్యకర్తలతో పాటు మృతురాలి కుటుంబానికి ఎంఎస్ఎస్ఓ, ఎమ్మెల్యే రోహిత్ తరపున రూ.5 వేల ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు చాంద్ పాషా, ఉపాధ్యక్షుడు రాందాస్, ప్రధాన కార్యదర్శి గణేష్ కుమార్, యూత్ నాయకులు గౌస్ పాషా, సిద్ధి రాములు, వెంకటేష్, ఎస్టీ సెల్ అధ్యక్షుడు బాల్య శేఖర్, గ్రామ తాజా మాజీ సర్పంచ్ షేక్ షరీఫ్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా పీఆర్టీయూ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు



నవతెలంగాణ - సిద్దిపేట

కూర భూపతిరెడ్డి స్మారక పీఆర్టీయూ భవన్ లో సంఘ 53వ ఆవిర్భావ దినోత్సవ వేడుకల సందర్భంగా జెండా ఆవిష్కరించినట్లు జిల్లా శాఖ అధ్యక్షులు ఆదరాసుపల్లి శశిధర్ శర్మ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్సీ రఘోత్తంరెడ్డి జన్మదిన సందర్భంగా కేక్‌ను కట్ చేసినట్లు తెలిపారు. అనంతరం ప్రతి సంవత్సరం ఆనవాయితీగా రిటైర్డ్ అయిన సంఘ నాయకులు అలాజిపూర్ లక్ష్మీనారాయణ, ఏలేటి రాంరెడ్డి, దూడెండెం బాలకృష్ణ లను ఘనంగా సన్మానించారు మహిళా ప్రతినిధి అనిత భాస్కర్ రెడ్డికి ప్రత్యేక సన్మానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి మల్లు గారి ఇంద్రసేనారెడ్డి, నాయకులు పంతం వెంకటరాజం, లక్కిరెడ్డి విజయ , ముత్యాల సురేందర్ రెడ్డి, ఆస లక్ష్మణ్, నర్రా భాస్కర్ రెడ్డి, హనుమారెడ్డి, కోట ప్రభు, నీరడి లక్ష్మీనారాయణ, రాంచంద్రారెడ్డి, బొల్లం రాజశేఖర్, నారెడ్డి రామకృష్ణారెడ్డి, ప్రసాద్ , అతికం పవన్ కుమార్, మల్లారెడ్డి, రాంచంద్రారెడ్డి, సిద్ధి వెంకటేష్, ఎర్ర పార్థసారథి, కిషన్ రెడ్డి, కూరెళ్లి శ్రీనివాస్ రెడ్డి, కేవీన్ రెడ్డి, పల్లె శ్రీనివాస్ గౌడ్, రవీందర్ రెడ్డి, వంగ శ్రీనివాస్ రెడ్డి, రాజిరెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, బెంజరం నరసింహ రెడ్డి, పంతం నరేష్, అన్నగోని సతీష్ గౌడ్, త్యాగరాజు, ఆస శ్రీహరి, చంద్రారెడ్డి, రాజేందర్, కత్తుల బాపురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మనోహరాబాద్‌లో మండల సైన్స్‌డే పోటీలు



నవతెలంగాణ-మనోహరాబాద్

మనోహరాబాద్ మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో మండల స్థాయి సైన్స్‌డే దినోత్సవ పోటీలను నిర్వహించారు. ఈ పోటీలలో మండలంలోని వివిధ పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు. ఒక్కొక్క విభాగం నుంచి విద్యార్థులు విజేతలుగా నిలిచారని మండల నోడల్ అధికారి వెంకట్‌స్వామి తెలిపారు. ఈ పోటీలలో పాల్గొన్న విద్యార్థులు మంచి ప్రతిభను కనబరిచి విజేతలుగా నిలిచినట్టు తెలిపారు. ఇందులో డ్రాయింగ్‌లో మనోహరాబాద్ జడ్‌పిహెచ్ఎస్ పాఠశాలకు చెందిన అరిబా (పదవ తరగతి), జడ్‌పీహెచ్ఎస్ మనోహరాబాద్‌కు చెందిన వైష్ణవి (9వ తరగతి) కవితలు పోటీల్లు, పాటల పోటీల్లో జడ్‌పీహెచ్ఎస్ మనోహరాబాద్ పాఠశాలకు చెందిన అక్షర (9వ తరగతి), ఉపన్యాస పోటీల్లో కాళ్ళకల్ జడ్‌పిహెచ్ఎస్ పాఠశాలకు చెందిన రేష్మిత (9వ తరగతి)లు మండల స్థాయిలో విజేతలుగా నిలిచినట్టు తెలిపారు. వారికి పాఠశాల ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మనోహరాబాద్ ఉన్నత పాఠశాల ప్రదానోపాధ్యాయురాలు రేహన సుల్తానా, సైన్స్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రమాదవశాత్తు నివాస గుడిసె దగ్ధం

రూ.8.50 లక్షల ఆస్తి నష్టం



నవతెలంగాణ-మనోహరాబాద్

ప్రమాదవశాత్తు నివాస పూరిగుడిసె దగ్ధం కావడంతో సుమారు రూ.8.50 లక్షల ఆస్తి నష్టం జరిగిన సంఘటన తూప్రాన్ మున్సిపల్ కేంద్రంలో శుక్రవారం మధ్యాహ్నం జరిగింది. బాధితుని కథనం ప్రకారం వివరాలిలా ఉన్నాయి. కండెల నర్సింలు, భార్య గంగోత్రి ఇద్దరు పిల్లలతో కలిసి తూప్రాన్ మున్సిపల్ కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల వెనకాల పూరి గుడిసె వేసుకుని నివాసముంటున్నారు. కాగా నర్సింలు ఆటో నడుపుతూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. కాగా శుక్రవారం మధ్యాహ్నం సమయంలో నర్సింలు ఆటో నడపడానికి వెళ్లగా భార్య గుడికి వెళ్లి వస్తానని వెళ్లినట్టు తెలిపారు. కాగా గుడిసెలో ఎవరు లేని సమయంలో ప్రమాదవశాత్తు పూరి గుడిసెకు నిప్పంటుకుంది. దాంతో గుడిసెలో ఉన్న ప్రతి వస్తువు అగ్నికి ఆహుతయ్యాయి. గుడిసెలో ఉన్న మూడు లక్షల నగదు, నాలుగు తులాల బంగారం, కట్టుకునే బట్టలు, టీవి, వంట సామానులు పూర్తిగా బూడిదయ్యాయి. ప్రమాద సమయంలో గుడిసెలో ఎవరు లేకపోవడంతో ప్రమాదం తప్పింది. తూప్రాన్ పోలీసులు, రెవెన్యూ ఇన్స్‌పెక్టర్ నాగరాజులు సిబ్బందితో వెళ్లి ఘటనా స్థలాన్ని పరిశీలించి తక్షణ సహాయాన్ని అందజేశారు.

పుణ్యస్నానాలు ఆచరించిన భక్తజనం



నవతెలంగాణ -సిద్దిపేటరూరల్

మండలం పరిధిలోని పుల్లూరు గ్రామంలో బండపై వెలసిన శ్రీలక్ష్మీనరసింహస్వామి జాతర ఉత్సవాలు శుక్రవారం మాఘ అమావాస్య రోజున కోనేరులో భక్తులు పుణ్యస్నానాలు చేశారు. జాతరకు తొలిరోజున భక్తులు పెద్ద ఎత్తున పోటెత్తి పవిత్ర స్నానాలను ఆచరించి స్వామి వారిని దర్శించుకున్నారు. స్వామి వారికి ఉదయం సుప్రభాతం, అభిషేకం తదితర సేవలను ఆలయ ఉత్సవ కమిటి చైర్మన్ కనకయ్య గౌడ్, వంశపారంపర్య అర్చకులు పోడిచేటి రామకృష్ణల ఆధ్వర్యంలో నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జీ పూజల హరికృష్ణ, బీజేపీ ఇంచార్జీ దూది శ్రీకాంత్ రెడ్డి తదితరులు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక అభిషేకాలను నిర్వహించారు. ఉత్సవాల్లో భక్తులకు ఇబ్బందులు కలగకుండా నిర్వాహకులు సకల సౌకర్యాలు కల్పించారు. సిద్దిపేట జిల్లా కేంద్రం నుంచి సుమారు పది కిలోమీటర్ల దూరంలో ఈ ఆలయం ఉన్నందున, ఉత్సవాలకు ఆర్టీసీ ప్రత్యేక బస్సులను నడుపుతుంది. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు గరిపల్లి రాములు ,ఆలయ కమిటీ డైరెక్టర్ తదితరులు పాల్గొన్నారు

మధ్యాహ్న భోజన పథక నిర్వహణ పరిశీలన

నవ తెలంగాణ- కొండపాక

పాఠశాలల్లో అమలవుతున్న మధ్యాహ్న భోజన పథకం నిర్వహణ తీరును సోషల్ ఆడిట్ అధికారి భాస్కర్ రెడ్డి శుక్రవారం పరిశీలించారు. కుకునూరు పల్లి ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాలలో ఈ పథక నిర్వహణ తీరుపై పలు అంశాలను అడిగి తెలుసుకున్నారు. ఉపాధ్యాయులు మధ్యాహ్న భోజన నిర్వాహకులతో మాట్లాడి తీరుతెన్నులను తెలుసుకున్నారు. విద్యార్థులకు పోషకాహారం అందిస్తున్న విషయాలను పరిశీలించారు.

అయోమయంలో బీఆర్ఎస్ నాయకులు

ఎమ్మెల్యేగా ఉన్నా కలవని కేసీఆర్
రోజు రోజుకు ఖాళీ అవుతున్న బీఆర్ఎస్
పట్టించుకోని బీఆర్ఎస్ అదిష్టానం

నవతెలంగాణ-మనోహరాబాద్ : ఒక వైపు పార్టీ అధికారంలో లేకపోవడంతో పాటు గజ్వేల్ నియోజక వర్గం నుంచి గెలిచిన మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఇప్పటి వరకు కనీసం నాయకులనుకాని కార్యకర్తలను కాని కలవకపోవడంతో తూప్రాన్, మనోహరాబాద్ ఇరు మండలాల్లోని బీఆర్ఎస్ నాయకులు కార్యకర్తలు అయోమయ పరిస్థితిలో ఉండిపోయారు. తెలంగాణ రాష్ట్రంలో జరిగిన ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ అధికారం కోల్పోయి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడంతో బీఆర్ఎస్ నాయకుల్లో ఉన్న అత్యుత్సాహం పూర్తిగా నీరుగారిపోయిందనే చెప్పాలి. అయినప్పటికి గజ్వేల్ నియోజకవర్గంలో మాత్రం బీఆర్ఎస్ పార్టీని గెలిపించుకున్న నాయకులు కొంత సంతోషం వ్యక్తం చేస్తున్నప్పటికి ఆ పార్టీ అధినేత కేసీఆర్ కనీసం పార్టీ నాయకులకు కార్యకర్తలకు కనీసం సమయం కేటాయించకపోడవంతో అందరు నిరాశతో ఉండిపోయారు. ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో కేసీఆర్ కనీసం ఎవరికి సమయం ఇవ్వలేదని కనీసం నియోజక వర్గ ఎమ్మెల్యేగా ఉన్న కేసీఆర్ ఇప్పుడైనా కార్యకర్తలకు సమయాన్ని కేటాయించి కార్యకర్తల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంచుతారనే ఆలోచనలో ఉన్న నాయకులు కార్యకర్తల్లో నిరాశే మిగిలిస్తుంది. ఒక్కరోజైన తమను కలవడానికి సమయం లేకపోవడం ఏంటని పార్టీ నాయకులు అంటున్నారు. మరో వైపు రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడంతో కాంగ్రెస్ పార్టీ మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున నాయకులు బీఆర్ఎస్ పార్టీని వీడి కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారు. బీఆర్ఎస్ పార్టీ ఇరు మండలాల్లో ఖాళీఅయ్యే పరిస్థితి నెలకొంది. ఇప్పటికైనా గజ్వేల్ నియోజకవర్గ ఎమ్మెల్యేగా బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ పార్టీ నాయకులపై దృష్టి పెట్టి ఇరు మండలాల్లోని నాయకులతో సమావేశాలను ఏర్పాటు చేస్తూ వారిలో ఆత్మవిశ్వాసాన్ని నింపే విధంగా చర్యలు తీసుకోవాలంటూ బీఆర్ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలు కోరుతున్నారు. బీఆర్ఎస్ అధినేత పార్టీ నాయకులు, కార్యకర్తలను పట్టించుకోకపోవడం వల్లనే మున్సిపల్ కౌన్సిలర్లు కొందరు గురువారం కాంగ్రెస్ పార్టీలో చేరారని పలువురు పేర్కొంటున్నారు. మరో వైపు అధిక సంఖ్యలో బీఆర్ఎస్ నాయకులు సర్పంచ్‌లు, ఉపసర్పంచ్‌లు, కౌన్సిలర్లు కాంగ్రెస్ పార్టీలో చేరుతుండడంతో బీఆర్ఎస్‌లో ఉన్న నాయకుల్లో అయోమయ పరిస్థితి నెలకొంటుంది. ఇప్పటికైనా బీఆర్ఎస్ పార్టీ అధిష్టానం కార్యకర్తలు నాయకులకులతో సమావేశాలను ఏర్పాటు చేసి వారిలో ఉన్న నిరుత్సాహాన్ని తొలగించి వారిలో ఆత్మవిశ్వాసాన్ని పెంచాల్సిన అవసరం ఎంతైనా ఉందని తెలుస్తుంది.